ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 151 పేజీలు: 10+4 వెల: 6.50

రేపు కేబినెట్ సమావేశం 2

అన్నదాతల కోసం రూ. 1,56,496 కోట్ల ఖర్చు: -డి. సిఎం భట్టి 7

## పంటలపై ఎల్ నినో పంజా?



### ఆయిల్ సాగుసైతం అంతంత మాత్రమే

### 17 జిల్లాల్లో లోటు వర్షపాతం

### ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాల కదలికలు మందగించడం, బలమైన ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్ర వ్యవసాయ రంగం తీవ్రంగా ప్రభావితమవుతోంది. వర్షపాతం లోపం వల్ల తెలంగాణలో ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో వర్షపాత లోపం కనిపించగా 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో గత రెండు రోజుల క్రితం జిల్లాలో సాధారణ వర్షపాతం 101.3 మి.మీ కాగా 84.6 మి.మీ వర్షపాతం నమోదైంది. దీనివల్ల 16.5 శాతం లోటు ఏర్పడింది. సిద్దిపేట, హన్మకొండ జిల్లాలు గణనీయమైన వర్షపాత లోటును ఎదుర్కొంటుండగా, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, వరంగల్, మహబూబాబాద్, జనగాం, మేడ్చల్, గద్వాల్ వంటి జిల్లాలు పాక్షిక వర్షపాత లోటును ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పంటల సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 13.60 లక్షల ఎకరాల వరకూ పడిపోయింది. వరి, మొక్కజొన్న వంటి పప్పు ధాన్యాల నాట్లు, విత్తనాలు వేయడంలో తీవ్ర >>2

## • కాళేశ్వరం కూలినా..

# వరి సాగులో నం.1



మంగళవారం హైదరాబాద్‌లో రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

### కొంతకాలం మెట్టపంటలకు ప్రాధాన్యం

### ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుతాయి

### రైతుల కోసం ప్రత్యేక అసెంబ్లీ నిర్వహిద్దాం

### మరో 15 యేళ్ల తర్వాతే బిజెపికి ఛాన్స్

### రైతు భరోసా నిధుల విడుదల సభలో సిఎం రేవంత్

### 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడతాయని, రైతులు వరి సాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి పంటల పెట్టుబడికోసం మొదటి విడతలో 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482 కోట్లు రైతుభరోసా నిధులను మంగళవారం సాయంత్రం శిల్పకళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. వ్యవసాయం అంటే దండగ కాదు, పండగ అనుకునేలా >>2



ఘట్‌కేసర్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్

## గ్యారెంటీలేని కాంగ్రెస్ 6 హామీలు

### యువత, మహిళలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి

### 'సర్'పై ప్రజలకు అవగాహన కల్పించాలి

### వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పనిచేయండి

### పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్

**ఘట్‌కేసర్, జూన్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించి ఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీకి ఏటీఎంగా మార్చిందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్ విమర్శించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ లోని రాక్‌ఎన్‌క్లేవ్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన బిజెపి రాష్ట్రకార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. సమావేశం హాలు ఆవరణలో నితిన్‌నబీన్ బిజెపి పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్రశాఖ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నితిన్‌నబీన్ మాట్లాడుతూ ఆరుగ్యారంటీలతో పాటు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిలో ఒక్క హామీ కూడా ప్రజలకు సంతృప్తి కరంగా అమలు చేయలేకపోయిందన్నారు. యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థికసాయం ఇవ్వడంలో విఫలమైన సర్కార్ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పే పరిస్థితిలో లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి రాష్ట్రాన్ని ఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీకి ఏటిఎంగా మార్చిందని, నిజంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేసి ఉంటే కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రయోజనాలు ఇప్పటికే ప్రతి ఇంటికి చేరి ఉండేవని ఆయన ఎద్దేవా చేశారు. పశ్చిమబెంగాల్‌లో కార్యకర్తల కృషితో బిజెపి అధికారంలోకి వచ్చిందని, తెలంగాణలో ఎస్‌ఐఆర్‌పై ప్రజలకు బిజెపి కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం వేల కోట్ల రుపాయల నిధులు కేటాయించిందని, ప్రజలు బిజెపి వైపే ఉన్నారని ఆయన తెలిపారు. గత 12 ఏళ్లలో బిజెపి అమలు >>2



## బాధ్యతలు చేపట్టిన సిఎస్ సంజయ్ జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కె. రామకృష్ణా రావు మంగళవారం పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ >>2

## అది రైతు వంచన సభ



జడ్చర్లలో సర్ అవగాహన సదస్సులో హరీష్‌రావు

### రైతులకు రూ. 29,300 కోట్లు బాకీ

### ఎప్పుడు తీరుస్తారో సిఎం చెప్పాలి

### సిఎం కుర్చీకి ఉన్న విలువ పోతోంది..

### జడ్చర్ల 'సర్' అవగాహన సభలో హరీష్ రావు

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త:** సీఎం రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభ అని పెడుతున్నాడని, అది రైతు ఆశీర్వాద సభ కాదు రైతుల వంచన సభ అని, సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండి రైతును వంచించుతూనే ఉన్నాడని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు రేవంత్ రెడ్డిని రాజీనామా చేయమంటే జిరాక్స్ కాగితం ఇచ్చి పారిపోయారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, సభ్యత్వ నమోదు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ కోసం రాజీనామా చెయ్యమంటే జిరాక్స్ కాయితం ఇచ్చిన చరిత్ర రేవంత్ రెడ్డిదని, 2009లో కూటమిలో భాగంగా లక్ష్మారెడ్డి గారికి టికెట్ రాకపోయినా పార్టీకోసం నిబద్ధతతో పని చేసి కేసీఆర్ ని ఎంపీగా గెలిపించడానికి కృషి చేసిన నిజాయితీ గల నాయకుడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమం గురించి, త్యాగాల గురించి మాట్లాడుతుంటే నవ్వి పోదురు గాక నాకేం సిగ్గు అన్నట్టు ఉంది ఆయన తీరన్నారు. యాసంగి రైతు బంధు ఎగ్గొట్టి ఇప్పుడు మల్ల వానాకాలం రైతు బంధు వేస్తానని మోసం చేస్తున్నాడన్నారు. రైతు రుణమాఫీ అన్నారు రెండు లక్షలు కాదు కదా లక్ష లోపు ఉన్నవాళ్లకు కూడా చెయ్యలేదని, నిన్న నల్గొండలో ఒట్టేసి చెప్తున్నా మూసి ప్రాజెక్ట్ పూర్తి చేస్తా అన్నాడు. ఆ ఒట్టు అనేదానికి ప్రాణం ఉంటే ఈ రేవంత్ రెడ్డి అబద్ధాలకు ఉరేసుకొని ఎప్పుడో ఆత్మహత్య చేసుకునేదని పేర్కొన్నారు. కనబడ్డ దేవుని మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చెయ్యకుండా దేవుళ్ళనే మోసం చేసిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు బిడ్డలు స్వచ్ఛమైన పాలలాంటి మనసున్న బిడ్డలు. రేవంత్ రెడ్డి జూట మాటలు, బట్టెబాజ్ మాటలతో >>2



పోలీసుల అదుపులో గంజాయి ముఠా

## 525 కిలోల గంజాయి స్వాధీనం

### పెద్ద ఎత్తున ఈగల్ ఫోర్స్ మెరుపు దాడులు

**బూర్గంపహాడ్ , ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల రవాణాపై ఈగల్ ఫోర్స్ పోలీసులు చేపట్టిన వరుస మెరుపు దాడుల్లో భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అత్యంతవేగంగా వ్యూహాత్మకంగా నిర్వహించిన ఈ ఆపరేషన్లు అంతరాష్ట్ర గంజాయి >>2

## జన్మతః పౌరసత్వం: ట్రంప్‌కు షాక్



### ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను తిరస్కరించిన అమెరికా సుప్రీం కోర్టు

### ట్రంప్ ప్రయత్నాలకు అడ్డుకట్ట

### రాజ్యాంగం 14వ సవరణ యధాతథం

**వాషింగ్టన్, జూన్ 30:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కొనసాగుతుందని అమెరికా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జన్మహక్కు పౌరసత్వ నిబంధనలను మార్చాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. మంగళవారం వెలువడిన తీర్పులో, అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలని ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ను కోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని ధర్మాసనం అమెరికా భూభాగంలో జన్మించిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వ హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటికే దిగువ కోర్టులు కూడా ట్రంప్ ఆదేశాలను >>2





## బేసిక్ పే, పెన్షన్ నుండి 1.5% కోత

### ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సర్కార్ షాక్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాత వార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ షాక్ తగిలింది. వారి ప్రాథమిక వేతనం (బేసిక్ పే)లో ప్రతీ నెలా 1.5 శాతం మేర కోత విధించాలని సర్కార్ వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అయితే ఉద్యోగ దంపతులకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. భార్యాభర్తలు ఇరువురూ ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ, ఇద్దరి జీతాల నుండి కాకుండా ఒకరి బేసిక్ పే >>2

## ఎయిర్‌టెల్‌కు హైదరాబాద్ రెండో హెడ్‌క్వార్టర్



మంగళవారం సిఎం రేవంత్‌తో భేటీ అయిన సునీల్ భారతీ మిట్టల్


### త్వరలోనే చందన్‌వెల్లి డేటా సెంటర్

### ఎటిసిల్లోని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

### సిఎం రేవంత్‌రెడ్డితో భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం తెలంగాణలో చేపట్టిన అనేక కార్యక్రమాలు, సంస్కరణలను వివరిస్తూ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేకంగా విద్యా రంగంలో తీసుకొస్తున్న >>2

## బండి సంజయ్, రాజాసింగ్‌కు ప్రత్యేక కోర్టులో ఊరట






### రెండు వేర్వేరు కేసుల్లో ఆరోపణలను కొట్టివేసిన నాంపల్లి ప్రత్యేక కోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు మంగళవారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం >>2

## ఏరోస్పేస్‌లో మనం టాప్



ఏరోస్పేస్ డిఫెన్స్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో గన్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

### హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం

### వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం

### కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్: మంత్రి ఉత్తమ్ కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా' అని >>2



ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మంగళవారం తన వివరాలను సమర్పిస్తున్న ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

## గ్యారెంటీలేని కాంగ్రెస్ 6 హామీలు

>> చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలలియజేస్తూ వచ్చే కార్పొరేషన్, అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేసి బిజెపి సందేశాన్ని తెలంగాణ ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని నితిన్‌నబీన్ పిలుపునిచ్చారు. ఈసమావేశంలో కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, 3 కార్పొరేషన్‌ల ఇంచార్జ్-ఎంపీ రేఖశర్మ, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు- ఎంపీ డా.కె.లక్ష్మణ్,ఎంపీలు డికె.అరుణ్, ఎం.రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జి.నగేశ్, బిజేఎల్‌పి నేత ఎలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కె.వెంకట రమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, పాయల్ శంకర్, పి.హారీష్‌బాబు, రామారావుపాటిల్, సూర్యనారాయణ, ఎమ్మెల్సీ కొమురయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శులు ఎన్.గౌతంరావు, జి.మనోహార్‌రెడ్డి, తూళ్ల వీరేందర్‌గౌడ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చ అధ్యక్షులు బస్వ లక్ష్మినర్సయ్య, మాజీ మంత్రులు కృష్ణయాదవ్, ఇ.పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రాంచంద్రారెడ్డి, ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బేసిక్ పే, పెన్షన్ నుండి 1.5 %కోత

>> నుండి మాత్రమే 1.5 శాతం కోత విధించనుంది. ఒక వేళ ఉద్యోగి,పెన్షనర్ దంపతులైనా సరే ఈ మినహాయింపు వర్తించనుంది. పొరపాటున ఇద్దరి జీతాల నుండి రెండుసార్లు కటింగ్ జరిగినట్లయితే ఆ మొత్తాన్ని తిరిగి రిఫండ్ చేస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన ఈ నెల నుండి అమలు కానుంది. మే నెల వేతనాలు, పెన్షన్ల నుండే ఈ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఫండ్‌కు చందా కోతలు వర్తిస్థాయని స్పష్టం చేసింది. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అమలు చేయనున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఫండ్‌కు ఈ విరాళాన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ హెల్త్ స్కీమ్ ట్రస్ట్‌ను బలోపేతం చేసేందుకు కేవలం ఉద్యోగులపైనే భారం వేయకుండా ప్రభుత్వం ప్రత్యమ్నాయ చర్యలను చేపడుతుంది. ఇందుకు ఉద్యోగి లేదా పెన్షనర్ తన ప్రాథమిక వేతనం నుండి ఎంత మొత్తాన్ని అయితే చందాగా చెల్లిస్తారో అంతేసమానమొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతు వాటాగా హెల్త్ ట్రస్ట్‌కు జమ చేయనుంది.

## ప్రత్యేక కోర్టులో ఊరట

>> ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. కాగా, హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది.ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, మంగళవారం ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. గోషా మహల్ రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును పూర్తిగా కొట్టివేస్తూ రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

## పంటలపై ఎల్ నినో పంజా?

>> ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా ప్రధాన పంటల సాగు లక్ష్యాలు అందుకోవడం కష్టంగా మారింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 1,32,44,305 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో రెండు రోజుల క్రితం వరకూ రైతులు కేవలం 14,78,120 ఎకరాల్లోనే పంటలు వేశారని నివేదికలో వెల్లడించింది. దీనికి భిన్నంగా గత ఏడాది ఇదే సమయానికి 28,38,416 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వర్షపాతం లోపం కారణంగా ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం సుమారు 13,60,296 ఎకరాలు తక్కువగా ఉందని వ్యవసాయ శాఖ నివేదిక స్పష్టం చేసింది. ఈ సీజన్‌లో వరి సాగు లక్ష్యం 62,47,868 ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 30,243 ఎకరాల్లోనే నాట్లు పూర్తయ్యాయి. ఇతర పంటల చూస్తే పత్తి 48,93,016 ఎకరాల సాధారణ విస్తీర్ణానికిగాను ఇప్పటివరకు 12,60,315 ఎకరాలులో సాగు చేయగా, మొక్కజొన్న 5,21,206 ఎకరాలకు 30,932 ఎకరాలు సాగు చేశారు. కందులు 6,69,732 ఎకరాలకు 55,500ల ఎకరాలు, సోయాబీన్ 4,20,625 ఎకరాలకు గాను 24 వేల 666 ఎకరాలలో సాగు చేశారు. జొన్నలు 3,992 ఎకరాలు సాగు చేశారు. అయితే ఈ సీజనులో రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో ఖరీఫ్ పంటలు వేశారు. ఈ జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 7,33,536 ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 54.87 శాతం మేర 4,02,460 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అలాగే నల్లగొండ జిల్లాలో 1,56,681 ఎకరాల్లో,నాగర్‌కర్నూల్‌లో 85,805ఎకరాల్లో, గద్వాల్‌లో 82,132ఎకరాలు, ఖమ్మంలో56,707ఎకరాల్లో, ఆసిఫాబాద్ లో 54,500 ఎకరాలు, ఆదిలాబాద్ జిల్లాలో 1,80,152 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగు చేశారు. ఇక రాష్ట్రంలోనే అత్యల్పంగా ములుగు జిల్లాలో ఇప్పటి వరకూ కేవలం 600 ఎకరాల్లోనే పంటలు వేశారు.

## 525 కిలోల గంజాయి స్వాధీనం

>> రాకెట్పై కీలక దెబ్బగా నిలిచాయి. తాజా ఘటనలో బూర్గంపహాడ్ మండలం సారపాక సమీపం లో కంటైనర్లో అక్రమంగా తరలిస్తున్న 525 కిలోల గంజాయిని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసుల సంయుక్త ఆపరేషన్లో జరిగింది. ఈ గంజాయి విలువ సుమారు కోట్ల రూపాయలుగా అంచనా వేయబడింది. అంతకు ముందు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో కూడా ఈగల్ఫోర్స్ కీలక విజయాలు సాధించింది. ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా రహస్యంగా తరలిస్తున్న సుమారు రూ.2.5 కోట్ల విలువైన 500 కిలోల గంజాయిని పోలీసులు సరిహద్దు ప్రాంతాల నుంచి 80కిలోల మీటర్ల మేర ఛేజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈఘటనలో ముఠా కదలికలను గమనించి సమయోచితంగా చర్యలు తీసుకోవడం ద్వారా పెద్ద నెట్వర్కు భగ్నం చేశారు. ఈగల్ ఫోర్స్ అధికారులు అత్యంత వేగంగా స్పందిస్తూ, ఆధునిక సాంకేతిక, గూఢచారి సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. వరుస విజయాలతో మాదకద్రవ్యాల రవాణా ముఠాలకు పెద్ద ఎదురు దెబ్బ తగిలినట్లయింది. పట్టుబడిన కేసులపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, అంతరాష్ట్ర నెట్వర్క్ ను పూర్తిగా ఛేదించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన సిఎస్ సంజయ్ జాజు

>> జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కె. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు. సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన సంజయ్ జాజు బాధ్యతల స్వీకరణకు ముందు ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

## వారం - వర్జ్యం

01-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పాడ్యమి ఉ.7.38
పూర్వాషాఢ ఉ.6.51
వర్జ్యం : మ.3.43-సా.5.29
దు.11.45-మ.12.37
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** సంతాన విద్యావిషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి.

**వృషభం:** పట్టుదలతో ముందుకుసాగి వ్యవహారాలు చక్కదిద్దుతారు. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మిథునం:**ముఖ్యులతో పరిచయాలు ఏర్పడతాయి. మీ తొందరపాటు మాటలవల్ల మిత్రులతో శతృత్వం ఏర్పడుతుంది.

**కర్కాటకం :** మీ ప్రతిభాపాటవాలు వెలుగు చూస్తాయి. ఇళ్లు కొనుగోలుయత్నాలు సాగిస్తారు. పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు.

**సింహం:** కీలకనిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఉద్యోగములలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి. వాహనసౌఖ్యం.

**కన్య :** ఇంట్లో వడ్రంగిపనులు, ఫర్నీచర్ పనులు చేస్తారు. ఫాస్ట్‌ఫుడ్స్ వ్యాపారస్థులకు అనుకూలమైన కాలం. వస్త్రలాభం.

**తుల :**ఆర్థికంగా చెప్పుకోదగిన లాభాలు ఉండపోయినా లోటువుండదు. ఖర్చును అదుపుచేయలేకపోతారు.

**వృశ్చికం:**స్థిరత్వము, ధైర్యమువలన చాలా ఫలితములు అనుకూలదిశలో పయనిస్తాయి. స్నేహితుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబ ఐకమత్యంకు విఘాత మేర్పడకుండా సంయమనం పాటించండి. ఆస్తివివాదాలు తీరుతాయి.

**మకరం:** మాటలచాతుర్యంతో కార్యా లయంలో ఉన్నతాధికారుల మెప్పు పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం వుంటుంది.

**కుంభం:** రాజకీయ, సినీ, కళారంగాల వారికి విదేశీపర్యటనలు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**మీనం :**పోరాడి దూరప్రాంత అవకాశము లను సాధిస్తారు. మీమీద నిందారోపణలు చేసే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాళేశ్వరం కూలినా.. వరి సాగులో నం.1

>> చేస్తున్నామని సీఎం తెలిపారు. 30 నెలలుగా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని వివరించారు. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలన్నీ మాఫీ చేశామన్న సీఎం, రుణమాఫీ కింద ఆర్నెళ్లలోనే రైతుల ఖాతాల్లో రూ.22,600 కోట్లు జమచేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదంటూ దుష్ప్రచారం చేశారని, సాగుకు ఉచిత కరెంట్ అనేది కాంగ్రెస్ పేటెంట్ హక్కని రేవంత్ రెడ్డి అన్నారు. ఉచిత కరెంట్‌ను 2004 లోనే వైఎస్ఆర్ మొదలు పెట్టారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం రూ.36 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. వ్యవసాయ పనిముట్ల కోసం ఏటా వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రైతుబీమా కోసం ఏటా రూ.3,500 కోట్లు చెల్లించామని చెప్పారు. వేలకోట్ల కమీషన్ల కోసం హడావుడిగా ఒక్క కాళేశ్వరం కట్టారని కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపించారు.ఉమ్మడి రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారని, ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి, పాలమూరుబిడ్డ బూర్గుల రామక్రిష్ణారావు నుంచి కిరణ్ కుమార్ రెడ్డి వరకు తెలంగాణకు ఇచ్చిన అప్పు 69 వేల కోట్లు. అయితే తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ.8.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని తనకు అప్పగించారన్నారు. ఎన్నికల ముందు రూ.6 లక్షల కోట్లు అప్పు ఉందని తాము భావించామని, పదవి చేపట్టి లెక్కలు తీస్తే గుట్టల కొద్ది అప్పులు బయటపడ్డాయన్నారు. 60 యేళ్లలో 69 వేల కోట్ల అప్పులు చేస్తే కేవలం కల్వకుంట్ల కుటుంబం రూ.7లక్షల కోట్లకు పైగా అప్పు చేసి అప్పుల ఊబిలో నిండా ముంచారు.మళ్లీ లేవడానికి వీలులేకుండా అప్పులతో మన్ను కప్పారు.మేం 6 లక్షల అప్పులు చేశారని ఎన్నికల సమయంలో విమర్శిస్తే కాంగ్రెస్ అబద్దాలు చెపుతుందని బుకాయించారు. అన్ని రకాల అప్పులను తొవ్వితే గుట్టల కొద్ది బయటపడ్డాయి,అందిన కాడికి చేబదులు తీసుకువచ్చారని చెప్పారు. సీఎస్ వంటి ఐఏఎస్‌లకే1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

కొన్నేళ్లుగా జీతాలు వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు తనకు చెప్పారన్నారు.'ప్రభుత్వ ఉద్యోగులకు విడతల వారీగా జీతాలు ఇచ్చారు.కష్టమైనా ఫస్టు తారీఖున జీతాలు ఇవ్వాల్సిందేనని అధికారులను ఆదేశించాను..బడి పిల్లల కూరగాయలు, బట్టలకు కూడా చెల్లించకుండా బకాయిలు పెట్టారు.సర్పంచ్ లకు వందల కోట్లు బకాయిలు పెట్టారు.. సర్పంచ్ లు ఆత్మహత్యలు చేసుకున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ధర్నాలు చేశారు. కాయిలు పెట్టింది బకాసురులు.. కట్టే పని మాత్రం నాకు పడింది' అని చెప్పారు. షేర్వానీ వేసుకుని నవాబు అని చెప్పుకోలేం.. మనం నవాబులం కాదు బీకార్లం,స్వయం సహాయక మహిళలు బడి పిల్లలకు వండి పెడితే వాళ్లకు కూడా డబ్బులు ఇవ్వలేదు.. హాస్టళ్లలో చదువుకునే పిల్లలకు మైస్ ఛార్జీలు,కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వలేదు.. అప్పులతో పాటు అడ్డగోలుగా తప్పులు కూడా చేశాడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.30 నెలల్లో సమాజంలో గౌరవం పెంచుకుని , విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నాం..ఎప్పుడు ప్రజల్లోనే ఉంటున్నాం, తప్పించుకుని తిరగడం లేదు.. ఫామ్ హౌస్ ల్లో ఉండటం లేదు.సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో బకాయిలు పెట్టిపోతే 2023 లో చెల్లించాం..రైతు భరోసాను రూ.12 వేలకు పెంచి ఇప్పటి వరకు రూ.27 వేల కోట్లు రైతు ఖాతాల్లో వేశాం..ఈ విడుతతో కలిసి రూ.36 వేల కోట్ల రైతు భరోసా కింద చెల్లించాం. సన్న వడ్ల బోనస్ కోసం రూ.4 వేల కోట్ల ఖర్చు చేశాం.. మూడున్నర వేల కోట్ల రైతు బీమా కోసం ఖర్చు చేశాం..ఇప్పటి వరకు లక్షా డెబ్బై ఐదు వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేశాం.. నెలకు రూ.6 వేల కోట్లు ఖర్చు పెట్టాం.రైతుల కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేద్దాం..చర్చకు సిద్ధమా పదేళ్లలో మీరు ఏం చేశారో, రెండున్నర యేళ్లలో మేం ఏం చేశామో చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు.రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయిందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బోరు కింద పంట పండితే కూడా కాళేశ్వరం మహిమ అని మోసం చేశారని మండిపడ్డారు. కూలిన కాళేశ్వరం నుంచి మూడేళ్లుగా చుక్క నీరు కూడా తీసుకోలేదన్నారు. కాళేశ్వరం కూలినా ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారని సీఎం ప్రశ్నించారు. కేసీఆర్, మోదీ, కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదామని సవాల్ చేశారు. పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఇచ్చారా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బెంగాల్‌లో ఉడికిన పప్పులు తెలంగాణలో ఉడకవన్నారు. అక్కడ గెలిచేందుకు బీజేపీ 15 ఏళ్లు పట్టిందని తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడానికి మరో 15 ఏళ్లు పడుతుందన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చామన్న సీఎం, మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని మండిపడ్డారు. మహిళలతోనే సోలార్ విద్యుత్ ప్లాంట్ పెట్టించి వ్యాపారులుగా చేశామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వంలో ప్రతి శాఖలో కొలువులు భర్తీ చేశామన్నారు. కేసీఆర్ మళ్లీ వస్తీ చేసేదేమీ ఉండదన్నారు. దమ్ముంటే రాజీనామా చేయాలని అంటున్నారు, నీ అయ్య జాగీరా, నీ తాత గడీలు అనుకుంటున్నవా, గడీల ముందు బానిసలమా రాజీనామా చేయడానికి అని ప్రశ్నించారు. వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్ ఫామ్ హౌస్‌లో వరి పండించి నాలుగు వేల రెండువందలకు క్వింటాలు అమ్ముకున్నాడు.

కేసీఆర్ మళ్లీ వస్తే భార్య భర్తల ఫోన్లు వింటాడు తప్ప ఏమీ చేయడు.. పెళ్లాం మొగుడు మాట్లాడుకున్న మాటలు వినడానికి సిగ్గుండాలి. పాపాల భైరవుడు ఫామ్ హౌస్‌లో ఉన్నాడు.. మళ్లీ రావాలంట.. ఆయన కోసం జనం ఎదురు చూస్తున్నారట. ఉన్నది ఉన్నట్లు చెపుతా.. చేసేది చెపుతా.. కిరిటాలు పెట్టుకోవాలి, వజ్ర వైడూర్యాలు సంపాదించాలని నాకు లేదు.. పదవి శాశ్వతం కాదు.. మాట శాశ్వతం.. మాట కోసం ఎంతకైనా నిలబడతాడు అన్న పేరు కోసం ప్రయత్నం,అబద్దాల పునాదులపైన ప్రభుత్వాన్ని నడపను అని స్పష్టం చేశారు.ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత రైతులది, ఫామ్ హౌస్‌లో పశుపతిని బంధించాను, అరుంధతి సినిమాలో రాక్షసుడిలా ఫామ్ హౌస్‌లో రైతులు బంధించారు అని వ్యాఖ్యానించారు.

## జన్మతః పౌరసత్వం: ట్రంప్‌కు షాక్

>> నిలిపివేసిన విషయం తెలిసిందే. తీర్పులో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ మాట్లాడుతూ అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలు కూడా అమెరికా అధికార పరిధిలోకి వస్తారని, రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం వారికి పుట్టుకతోనే పౌరసత్వ హక్కు లభిస్తుందని పేర్కొన్నారు.అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం అమెరికాలో జన్మించిన లేదా చట్టబద్ధంగా పౌరసత్వం పొందిన ప్రతి వ్యక్తి అమెరికా పౌరుడేనని స్పష్టంగా పేర్కొంది. ఈ నిబంధనను మొదట బానిసత్వం నుంచి విముక్తి పొందిన నల్లజాతీయులకు పౌరసత్వ హక్కు కల్పించేందుకు తీసుకువచ్చినా, తరువాత అమెరికా భూభాగంలో జన్మించిన అందరికీ వర్తించేలా అమలులో ఉంది. అమెరికాలో అక్రమంగా ఉన్న విదేశీయుల పిల్లలు అమెరికా అధికార పరిధిలోకి రారని, అందువల్ల వారికి జన్మహక్కు పౌరసత్వం వర్తించదని వాదించింది.తన రెండోసారి అధ్యక్ష పదవీ కాలం తొలి రోజే ట్రంప్ ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అక్రమ వలసలను కట్టడి చేసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై ఏప్రిల్‌లో జరిగిన వాదనలకు ట్రంప్ స్వయంగా హాజరయ్యారు. ఇదిలా ఉండగా, తీర్పు వెలువడే కొద్ది నిమిషాల ముందు ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రయత్నాలు సుప్రీంకోర్టు తీర్పుతోనైనా లేదా కాంగ్రెస్ చట్టం ద్వారానైనా విజయవంతమయ్యే అవకాశం ఉందంటూ వచ్చిన కథనాన్ని పంచుకున్నారు. మరోవైపు టెక్సాస్‌కు చెందిన రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు బ్రియాన్ బాబిన్ మాట్లాడుతూ అమెరికా పౌరసత్వం అమూల్యమైన హక్కు అని, దాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వ్యాఖ్యానించారు. అమెరికా సుప్రీంకోర్టు తాజా తీర్పుతో జన్మహక్కు పౌరసత్వంపై దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజ్యాంగ పరిరక్షణకు మరోసారి బలం చేకూరింది.



మంగళవారం అమెరికా కొలరాడోలోని బ్యూలా సమీపంలో కొండ ప్రాంతాన్ని ఆస్పెన్ ఏకర్స్ చుట్టుముట్టడంతో ఎగసి పడుతున్న మంటలు

## ఏరోస్పేస్‌లో మనం టాప్

>> స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. 'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోందని పేర్కొన్నారు.

స్పెయిన్‌కు చెందిన ఐటిపి ఏరో, కెనడాకు చెందిన ఎఫ్‌టిజి ఏరోస్పేస్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్ అండ్‌ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌరసైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు. ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 'మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం మీకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వం' అని ఆయన పిలుపునిచ్చారు.ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 'ఏరోమార్ట్ హైదరాబాద్-2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## రేపు కేబినెట్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీకి తేదీ ఖరారైంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగబోతోంది. సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువాదంతో సహా బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఏ శాఖలోనైనా ఎలాంటి అజెండా అంశాలు లేకపోతే.. నిల్ రిపోర్టునైనా సరే నిర్ణీత సమయానికి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

## అది రైతు వంచన సభ

>> పాలమూరు పరువు తీస్తున్నాడని పేర్కొన్నారు. ఎన్నికల్లో మాట ఇచ్చి తప్పిన మనిషి సీఎం రేవంత్ రెడ్డి, హామీ ఇవ్వక పోయినా ప్రజలకు కావాల్సింది అర్థం చేసుకొని రుణమాఫీ చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు.రైతు బంధు పేరిట 29 వేల 300 కోట్ల రూపాయలు రైతులకు బాకీపడ్డ రేవంత్ రెడ్డి అని, మీ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు మతి ఉండి మాట్లాడుతాడో మతి లేక మాట్లాడతాడో అర్థం కాదన్నారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ అన్నారు. అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకే అన్నారు. ఇప్పుడు కేవలం 7రకాల వడ్లకే అంటున్నారని పేర్కొన్నారు. మూడు రైతు బంధులు ఎగ్గొట్టాడని, బీఆర్ఎస్ హయాంలో 20212022 లో 92 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొన్నాం. దానితో పోల్చుతే మీరుకొన్నది ఎంత అని, రైతులకు బాకీపడ్డ 30 వేల కోట్లు ఎప్పుడు ఇస్తావో చెప్పాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాని,మిగిలిపోయిన రుణమాఫీ ఎప్పటిలోగా పూర్తి చేస్తావో చెప్పాలని రైతుల పక్షాన అడుగుతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 3ఏళ్ళు అవవుతుంది ఒక్క ఎకరాకు నీళ్ల ఇచ్చావా..? అని, తుంగభద్ర నది మీద శ్రీశైలంకు నీళ్ల రాకుండా 65 టీఎంసీలతో ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటకలు డ్యాములు కడుతుంటే మన పాలమూరు రంగారెడ్డి పరిస్థితి ఏంటి అన్నారు. ఇంటర్లింకింగ్ ఆఫ్ రివర్స్, ఆల్మట్టి ఎత్తు, అక్రమ ప్రాజెక్టులు తుంగభద్ర, కృష్ణపై కడుతున్న ప్రాజెక్ట్ లపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా నోరు మూసుకున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ మాట ఇచ్చాడని, తండాలను గ్రామ పంచాయితీలను చేస్తా అన్నాడు చేసి చూపించాడన్నారు. హై కోర్ట్ మొట్టికాయలు వేసినా పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వడం లేదని, ఫీజు కట్టక పిల్లల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు వాళ్ళ చదువులు ఆగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు డా.సి.లక్ష్మారెడ్డి ,శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్ రెండో హెడ్‌క్వార్టర్

>> సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేస్తున్న తీరును వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అధునాతన సాంకేతిక విధానాలతో ఏటీసీలుగా మార్చిన విషయాలను తెలిపారు. ఇదే కోవలో పాలిటెక్నిక్ కాలేజీల అధునికీకరణ గురించి చెప్పారు. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత తొందరగా ప్రారంభించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ,ఎఐ కార్యకలాపాలపైన దృష్టి పెట్టాలి మిట్టల్‌కు సూచించారు. రాష్ట్రంలో భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తామని సునీల్ మిట్టల్ తెలిపారు. అలాగే, ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్ క్వార్టర్‌గా హైదరాబాద్‌ను పరిగణిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు పాల్గొన్నారు.

# తిరుమల మోడల్‌లోనే గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం



మంగళవారం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి సంబంధించి ఎంసిఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

### భూమి యాజమాన్యం హక్కులు ఆలయం వద్దనే..
### వివిధ మఠాలకు భూకేటాయింపుపై స్పష్టమైన విధానం
### యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై సిఎం రేవంత్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 30:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో వివిధ మఠాలకు భూముల కేటాయించడానికి సంబంధించి స్పష్టమైన విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా భూ యాజమాన్యపు హక్కులు దేవస్థానంకే ఉండాలని చెప్పారు. మంగళవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశం లో సమీక్షి ంచారు. ఆలయం పరిధిలో భూముల కేటాయింపు విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ (చారిటబుల్) ఫౌండేషన్ కోసం మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

గుట్టపైన అతిథి గృహాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే వారి జాబితా రూపొందించాలని, అతిథి గృహాల నిర్మాణాల్లోనూ టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ అనుసరించాలని, దశల వారిగా అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు.

కుల సంఘాలకు స్థలం కేటాయింపుపైన కూడా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం రూపొందించాలని అన్నారు. ఆలయ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయం నిర్మాణానికి సంబంధించి ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను సమగ్రంగా అధ్యయనంచేసి వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అలాగే, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డితోపాటు దేవాదాయ, ఆర్థిక శాఖల, లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో మంత్రి శ్రీధర్‌బాబు దంపతుల మార్ఫింగ్ వీడియో
### సైబర్‌క్రైం పోలీసులకు న్యాయవాది ఫిర్యాదు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయన సతీమణి, సీనియర్ ఐఎఎస్ అధికారి శైలజా రామయ్యర్‌లకు సంబంధించిన ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం కలకలం రేగింది. దీనిపై వెంటనే చర్య లు తీసుకోవాలని శ్రీధర్ బాబు తరపున న్యాయవాది శశిభూషణ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీధర్ బాబు దంపతులపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించిన అభ్యంతకర మార్ఫింగ్ వీడియో ఫేస్‌బుక్‌లో ప్రత్యక్షమవడం దుమారం రేపింది. శ్రీధర్ బాబు దంపతు లను గుర్తు తెలియని వ్యక్తులు టార్గెట్ చేసినట్లు ఈ వీడియోలో వుందని న్యాయ వాది శశిభూషణ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాజంలో ఉన్నత హోదాలో వున్న ఒక మంత్రి, ఐఎఎస్ అధికారి పరువు, ప్రతిష్టలను దిగజార్చడం నేరగాళ్ల ఉద్దేశమని న్యాయవాది తన ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదుపై సైబర్ క్రైం పోలీసులు ఐటి సెక్షన్‌తో పాటు బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు.




కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఐఐసిటి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

### వ్యవసాయ పరిశోధన-పరిశ్రమల భాగస్వామ్యమే
## దేశ ఆర్థికాభివృద్ధికి చోదకశక్తి
### కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 30, ప్రభాతవార్త :** వ్యవసాయ పరిశోధనలను పరిశ్రమలతో అనుసంధానం చేయడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపునివ్వవచ్చని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్ అన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా వ్యవసాయ వ్యర్థాలను విలువైన ఉత్ప త్తులుగా మార్చి రైతులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటీ)లో మంగళవారం నాలుగు అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలను ప్రారంభించిన ఆయన, రూ.44.46 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 200 మంది విద్యార్థుల సామర్థ్యమున్న ఆధునిక హాస్టల్ సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఫ్లోరోకెమికల్స్ అడ్వాన్స్‌డ్ ఆర్అండ్‌డీ సెంటర్, సిరిపురం చేనేత క్లస్టర్ కోసం 500 కేఎల్‌డీ వికేంద్రీకృత వ్యర్థజల శుద్ధి కేంద్రం, కంటిన్యూయస్ ప్రాసెసింగ్ ప్లాట్‌ఫామ్, సస్టైనబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్‌లను ప్రారంభించారు. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు ఉపయోగపడే సాంకేతికతలుగా మారాలని అన్నారు. సీఎస్ఐఆర్- ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్త పరిశోధనా సౌకర్యాలు సంస్థ పరిశోధన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనున్నాయని తెలిపారు.




## రెండు 'భారత్ గౌరవ్' పర్యాటక రైళ్లు
### అయోధ్య, కాశీ, అరుణాచలంతో దివ్య దక్షిణయాత్రలకు ఐఆర్‌సిటిసి ఏర్పాటు

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 30, ప్రభాతవార్త :** తెలుగు రాష్ట్రాల భక్తుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) రెండు ప్రత్యేక భారత్ గౌరవ్ పర్యాటక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఇందులో బైద్యనాథ్‌ధామ్‌తో కూడిన అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్రతో పాటు అరుణాచలంతో దివ్య దక్షిణ యాత్రలను నిర్వహించనుంది. అయోధ్య-కాశీ యాత్ర జులై 4న మధ్యాహ్నం 2 గంటలకు సికిందరాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమవుతుంది. ఈ పదిరోజుల యాత్రలో విష్ణు పాద ఆలయం, కాశీవిశ్వనాథ్ ఆలయం, విశాలాక్షి, అన్నపూర్ణ ఆలయాలు, గంగాహారతి, రామ జన్మభూమి, హనుమాన్‌గర్హి, త్రివేణి సంగమం, బాబా బైద్యనాథ్ ఆలయాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు. దివ్య దక్షిణ యాత్ర జులై 20న ఉదయం 9 గంటలకు సికిందరాబాద్ నుంచి బయలు దేరుతుంది. ఈ యాత్రలో అరుణాచలేశ్వర ఆలయం, నటరాజ ఆలయం, శ్రీరంగనాథస్వామి ఆలయం, బృహదీశ్వర ఆలయం, రామనాథస్వామి ఆలయం, మీనాక్షి అమ్మవారి ఆలయం, వివేకానంద రాతి స్మారకం, కన్యాకుమారి అమ్మవారి ఆలయాలను సందర్శించనున్నారు. ఈ రెండు ప్రత్యేక రైళ్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రధాన రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు ఎక్కే, దిగే సౌకర్యంతో నడుస్తాయి. ప్రయాణికులకు శాకాహార భోజనాలు, ప్రయాణ బీమా, భద్రత, అనుభవజ్ఞులైన టూర్ ఎస్కార్ట్‌లు, పర్యటన మొత్తం ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్ల సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు, బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ పర్యాటక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## టిజిజిడిఎ ఎన్నికలకు నోటిఫికేషన్
### నేటి నుంచి 4 వరకు నామినేషన్ల స్వీకరణ
### 12న పోలింగ్, సాయంత్రం 5 గంటల నుంచి లెక్కింపు
### ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఎ)రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. టిజిజిడిఎ రాష్ట్ర కార్యవర్గం (2026-2028) ఎన్నికల నోటిఫికేషన్‌ను సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సీఈసీ) జూన్ 29న ఆమోదించిన తీర్మానం మేర కు రాష్ట్ర సెక్రటరీ జనరల్ డాక్టర్ ఆర్. లాలు ప్రసాద్ రాథోడ్ నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేశారు. ఎన్నికల ద్వారా రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర సెక్రటరీ జనరల్, కోశాధికారి, ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు కార్యదర్శులతోపాటు 15 మంది సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సీఈసీ) సభ్యులను ఎన్నుకోనున్నారు. రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలకు డాక్టర్ అవుల మురళీధర్‌ని రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమించినట్లు ప్రకటించారు. టిజిజిడిఎ రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షి కంగా పారదర్శకంగా నిర్వహించ నున్నారు. నామినేషన్ల స్వీకరణను నేటి(బుధవారం) నుంచి ప్రారంభించి ఈ నెల 4 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. ఈ నెల 6న సాయంత్రం 5 గంటలకు వరకు నామినేషన్ల పరిశీలన చేయనున్నారు.

నామినేషన్ల ఉపసంహారణ ఈ నెల 7న సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 12న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు హైదరాబాద్‌లోని తెలంగాణ వైద్య భవన్‌లో నిర్వహించబడతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి పదవులకు పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా టిజిజిడిఎ జనరల్ కౌన్సిల్ సభ్యునిగా ఒక పూర్తి పదవీకాలం పూర్తి చేసి ఉండాలి. అదనంగా సంఘ రాజ్యాంగంలో పేర్కొన్న అర్హతలు, ప్రభుత్వ సేవా కాలం, స్థానికత ఇతర నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన జనరల్ కౌన్సిల్ సభ్యులందరూ ఎన్నికల్లో పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి. నరహరి, రాష్ట్ర సెక్రటరీ జనరల్ డాక్టర్ ఆర్. లాలు ప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఎం. కె. రౌఫ్ విజ్ఞప్తి చేశారు.



## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అంబులెన్స్‌లను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 30:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సమకూర్చిన రెండు ఆంబులెన్స్‌లకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ముఖ్యమంత్రి బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని పేర్కొంటూ మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని, అందు కోసం పెద్దఎత్తున రుణాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రాంట్లలో భారీగా కోత.. రాష్ట్రానికి తీవ్రఅన్యాయం
### 45 శాతం మాత్రమే విడుదల
### రావాల్సింది రూ.22,782.50 కోట్లు
### విడుదల చేసింది రూ. 10,422.98 కోట్లు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** రాష్ట్ర ఖజానా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో కేంద్రం నుండి అధికంగా గ్రాంట్లు, నిధులు వస్తాయని ప్రభుత్వం భారీగా ఆశలు పెట్టుకుంది. అంతేకాకుండా ఆ మేరకు నిధులు, గ్రాంట్లు రాబట్టాలని తెలంగాణ సర్కార్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అయితే అంచనా వేసిన నిధుల్లో కనీసం సగం కూడా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఏటా రాష్ట్రంపై వివక్షను చూపుతోంది. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న ప్రకారం కేంద్ర గ్రాంట్లలో రూ.24,166 కోట్లు వస్తాయని అంచనా వేసింది. కానీ కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధులు మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు. తెలంగాణకు గత 2025-26 ఆర్థిక సంవత్సరంలో 45.75 శాతం మాత్రమే కేంద్రం గ్రాంట్లకు సంబంధించిన నిధులు విడుదల చేసింది. ఆ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర వాటాగా రాష్ట్రానికి రూ.22,782.50 కోట్లు రావాల్సి ఉండగా, మార్చి నెలాఖరు నాటికి రూ.10,422.98 నిధులు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో తెలంగాణకు రావాల్సిన గ్రాంట్లలో 54.25 శాతం మేర రూ.12,359.52 కోట్లు కోత విధించింది. అదే సమయంలో హిమాచల్‌ప్రదేశ్‌కు 94.68 శాతం నిధులు, చత్తీస్‌ఘడ్‌కు 90.96 శాతం నిధులు, అస్సాంకు 84.77 శాతం నిధులు, మధ్యప్రదేశ్‌కు 70.28 శాతం నిధులు, ఆంధ్రప్రదేశ్‌కు 62 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర గ్రాంట్లలో రూ.24,166 కోట్లు వస్తాయని అంచనా వేసింది. అదే 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 45.75 శాతం చొప్పున రూ.10,422.98 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.21,636.15 కోట్లు అంచనా వేస్తే 36.57 శాతం మేర రూ.7,913.08 కోట్ల నిధులే వచ్చాయి. అదే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.41,259.17 కోట్ల గ్రాంట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. కానీ 23.58 శాతం) రూ.9,729.91 నిధులు మాత్రమే విడుదలచేసింది. అదే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.41,001.73 కోట్ల అంచనాలకు గాను 32.14 శాతంగా రూ.13,179.21 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.38,669.46 కోట్ల గ్రాంట్లు విడుదలవుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది.

కానీ 22.29 శాతం చొప్పున రూ.8,619.26 నిధులు మాత్రమే రాష్ట్రానికి విడుదల చేసి కేంద్రం చేతులుదులుపుకొంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.24,166 కోట్ల గ్రాంట్లు ఎలా విడుదలవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ జగన్నాథ్‌నాయక్

**హైదరాబాద్ (చాంద్రాయణగుట్ట), జూన్ 30, ప్రభాతవార్త :** విశిష్ట శాస్త్రవేత్త, సిహెచ్ఇఎస్ఎస్ (చెస్) డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్ నాయక్, డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్ మిస్సైల్స్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ (డిజిఎంఎస్ఎస్)గా నియమితుల య్యారు. ఇక్కడి డైరెక్టర్ యు.రాజా బాబు డిఎస్ అండ్ డిజిఎంఎస్ఎస్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ చెస్ డాక్టర్ జగన్నాథ్ నాయక్ డిఆర్డిఓ డిజి (ఎంఎస్ఎస్)గా నియమించారు. బుధవారం నుండి డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్‌గా కొనసాగు తారు. డాక్టర్ జగన్నాథ్ నాయక్ ఒక విశిష్ట శాస్త్రవేత్త, డిఆర్‌డిఓలోని సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (సిహెచ్ఇ ఎస్ఎస్) డైరెక్టర్. రక్షణ పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) రంగంలో 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. రక్షణ, ఏరోస్పేస్ అనువర్తనాల కోసం అధునాతన ఏవియానిక్స్ యొక్క స్వదేశీ రూపకల్పన, అభివృద్ధిలో నాయక్ చేసిన పరిశోధన, అభివృద్ధికి ప్రసిద్ధి చెందారు. డైరెక్టర్‌గా డాక్టర్ నాయక్ భారతదేశపు మొట్టమొదటి డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డిఇడబ్ల్యూ) వ్యవస్థ యొక్క అభివృద్ధి, క్షేత్రస్థాయి పరీక్షలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ (టిఓటి)కి నాయకత్వం వహించారు. ఇది భవిష్యత్ రక్షణ సాంకేతికతలలో ఒక ప్రధాన ముందడుగు. డాక్టర్ జగన్నాథ్‌నాయక్ బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) నుండి ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లోఎం.ఎస్ పూర్తి చేసి, పిహెచ్.డి పట్టా పొందారు. డాక్టర్ జగన్నాథ్ నాయక్ ఆకాశ్ క్షిపణుల కోసం ఫైబర్ ఆప్టిక్ గైరో (ఎఫ్ఓజి) గైడెన్స్, డిఈడబ్ల్యూ ఆధారిత యాంటీ డ్రోన్ వ్యవస్థల ముఖ్య రూపశిల్పి. హైదరాబాద్‌లోని ఇమారత్ పరిశోధనా కేంద్రం (ఆర్‌సిఐ)లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, ఫైబర్ ఆప్టిక్ గైరోస్కోప్‌ల (ఎఫ్ఓజి) స్వదేశీ అభివృద్ధికి సారథ్యం వహించారు. తద్వారా ప్రస్తుతం క్షిపణులు, విమానాలు, ప్రధాన యుద్ధ ట్యాంకులలో వినియోగిస్తున్న ఈ కీలక సాంకేతికతలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చారు.



డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ జగన్నాథ్‌నాయక్

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఎబివిపి రణం
### విద్యార్థులపై లాఠీ-ఛార్జ్, అరెస్టులు
### ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం
### ఎబివిపి జాతీయ కార్యవర్గసభ్యుడు జీవన్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) నిర్వహించిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నిరసన కాస్త ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు, విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేసారు. ఈ క్రమంలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. విద్యామండలి ముట్టడికి ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి, వాహనాల్లో ఎక్కించి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ అంశంపై ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకుపై పోలీసులు అనవసరంగా లాఠీచార్జ్ చేసి విద్యార్థులను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా తన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తుందని జీవన్ హెచ్చరించారు.




## సిబిఐకి చేరిన నిఖిల్ అనుమానాస్పద మృతి కేసు
### సిఐడి అధికారుల నుండి ఫైల్స్ సేకరించిన సిబిఐ

**చిలుకూరు, జూన్ 30, ప్రభాతవార్త :** చిలుకూరు మండలంలోని దూదియా తండాకు చెందిన ధరావత్ నిఖిల్ అనుమానాస్పద మృతి హైకోర్టు ఆదేశాలతో సిబిఐ కేసు నమోదు చేసింది, జూన్ 20న నిఖిల్ ను కిడ్నాప్ చేశారు ఆ తర్వాత సూర్యాపేట పట్టణ పరిధిలో అనుమానాస్పద స్థితిలో నిఖిల్ మృతి చెందినట్లు గుర్తించారు, పట్టణ పరిధిలో పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు, ప్రేమ వ్యవహారంతోనే నిఖిల్‌ను కిడ్నాప్‌చేసి హత్య చేశారని తల్లి దండ్రులు ఆరోపించారు, అయితే జిల్లా పోలీసులతో పాటు సిఐడి అధికారులు విచారణ చేపట్టారు, అయినప్పటికీ పలు కారణాలతో మృతుడి తల్లిదండ్రులు హైకోర్టు ను ఆశ్రయించడంతో విచారణ నిమిత్తం సిబిఐ కి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది, మృతుడి తల్లిదండ్రుల స్టేట్మెంట్ రికార్డ్ చేస్తామని సిబిఐ పేర్కొంది, సిఐడి అధికారుల నుండి కేసుకు సంబంధించిన ఫైల్స్ ను సిబిఐ తీసుకుంది, చిలుకూరు మండలంలో కిడ్నాప్ గురైన నిఖిల్ సూర్యాపేట పట్టణ పరిధిలో అనుమానపద స్థితిలో మృతి చెందడంతో కేస్ పోలీసుల నుండి సిఐడి ఆ తర్వాత సిబిఐకి చేరింది, ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## మరో వివాదంలోకి కేతన్ హత్య కేసు
### సియాగోయల్ తరఫున న్యాయవాది ఎవరు?
### ఆమె సోదరునికి న్యాయవాది రూ.10 కోట్ల పరువునష్టం నోటీసు దేనికి?



**పుణే, జూన్ 30:** పుణెలో సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్యకేసులో తాజాగా మరో వివాదం తెరపైకి వచ్చింది. నిందితురాలు సియా గోయల్ తరఫున కోర్టులో వాదిస్తున్న న్యాయవాది ఎవరు అనే అంశంపై న్యాయపరమైన పోరు మొదలైంది. అడ్వకేట్ ఆశుతోష్ శ్రీవాస్తవ, సియా సోదరుడు సాహిల్ గోయల్‌కు రూ.10 కోట్ల పరువునష్టం నోటీసు జారీ చేశారు. జూన్ 18న పుణెలోని లోహగడ్ కోట వద్ద తన నిశ్చితార్థం జరిగిన కేతన్ అగర్వాల్‌ను సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌధరీ కలిసి కొండపై నుంచి తోసివేసి హత్య చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో సియా తనను అధికారికంగా న్యాయవాదిగా నియమించిందని, తన పేరుతో వకాలత్నామాపై సంతకం చేసిందని ఆశుతోష్ శ్రీవాస్తవ వెల్లడించారు. అయితే సియా కుటుంబ సభ్యులు ఈ వాదనను ఖండించారు. తమ తరఫున అడ్వకేట్ విపుల్ దుషింగ్ కేసు వాదిస్తున్నారని సాహిల్ గోయల్ స్పష్టం చేశారు. ఇటీవల వడగావ్ మావల్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా సియా గోయల్ స్వయంగా ఆశుతోష్ శ్రీవాస్తవ నా న్యాయవాది కాదు. విపుల్ దుషింగ్ నా తరఫున వాదిస్తున్నారని పేర్కొన్నట్లు సమాచారం. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో సాహిల్ గోయల్ తనపై అసత్య, పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆశుతోష్ శ్రీవాస్తవ రూ.10 కోట్ల నష్టపరిహారం కోరుతూ 10 పేజీల లీగల్ నోటీసు పంపారు.

తప్పుడు ప్రకటనలను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సియా తనకు చట్టబద్ధంగా వకాలత్నామా ఇచ్చిందని, తాను ఎలాంటి అనుమతి లేకుండా కేసులో ప్రవేశించలేదని శ్రీవాస్తవ నోటీసులో పేర్కొన్నారు. సాహిల్ చేసిన వ్యాఖ్యల వల్ల తన వృత్తిపరమైన ప్రతిష్ఠ దెబ్బతిందని, మానసిక వేదనతో పాటు భవిష్యత్ కస్టమర్లలోనూ అనుమానాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. యూట్యూబ్, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, వార్తా వెబ్‌సైట్లలో ప్రచారంలో ఉన్న పరువునష్టం కలిగించే వీడియోలు, వ్యాఖ్యలను వెంటనే తొలగించాలని నోటీసులో కోరారు. అలాగే 48 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు, ఏడు రోజుల్లో రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, కేతన్ అగర్వాల్ హత్యకేసులో సియా గోయల్, చేతన్ చౌధరీల పోలీసు కస్టడీని కోర్టు మరో ఐదు రోజుల పాటు పొడిగించింది. ఇద్దరు నిందితులతో కలిసి ఘటనాస్థలంలో నేర పునర్నిర్మాణం నిర్వహించాల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. హత్య అనంతరం సియా కేతన్ పాస్‌పోర్టును చించి తగులబెట్టినట్లు విచారణలో వెల్లడైందని, దాని ఆనవాళ్ల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. చేతన్ హత్య అనంతరం దుస్తులు మార్చుకున్నాడని, ఆ తర్వాత అతని కదలికలను గుర్తించే పనిలో ఉన్నామని వెల్లడించారు. ఘటన అనంతరం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: 02/MAU61-USI0HB(OTH)/93/2026-HB/3rd call Dt.: 29-06-2026
E PROCUREMENT TENDER NOTICE (Third Call)
Name of Work: "Engaging of Technical persons for Carpenters, Plumbers, Operators for Operation & Maintenance of Secretariat Buildings: 1 to 6 and WTP & STP at AP Secretariat, IGC, Velagapudi for 24 Months" - Estimate Cost Rs.1,44,00,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 01.07.2026 to 08.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 08.07.2026 up to 15.00 Hrs., Technical bid opening 08.07.2026 @16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi


వార్త, బుధవారం 1, జులై 2026

> అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.
>
> - బెంజిమెన్ ఫ్రాంక్లిన్

# 'సర్' నిష్కళంకమేనా?

ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాము. యువతే కాదు ఆలోచనా పరులు కూడా ఇలాంటి హక్కు ఉండటం కూడా అవసరం అని నమ్ముతుంటారు. 'ఓటనేది నా కూతుర్లాంటిది. అమ్ముకోను' అంటూ జనం సంబరపడిన రోజులూ ఉన్నాయి. కానీ ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ఓటు వేస్తారని డబ్బులు పంచి పెట్టడం నుంచి ఓడిన వాళ్లు తామిచ్చిన డబ్బు తిరిగి వసూలు చేసే పనిలో అకృత్యాలు.. ఇలా ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన సందర్భాలు ఇప్పుడు వికటిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం పడ్తోందని, స్థానికంగా లేని వారికి ఓటు హక్కు నీయడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (సర్) తెచ్చింది. ప్రక్రియను ప్రవేశ పెట్టడం ఆహ్వానించదగినదే. అయినా ఓటు హక్కుకు మోర బిగించడమే గందరగోళానికి దారితీసింది. 'సర్' ప్రక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత ధర్మాసనం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. 'సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణలమధ్య విపక్షాలు ఎత్తుగడలు తుత్తునియలు చేశారు ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి. అయినా ఏదో అనుమానం విపక్షాలను వెంటాడుతూనే ఉంది. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడం వేరే అంశం. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు ఇసిని వదల్లేదు. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ ప్రత్యేక బిఎల్‌ఒల ద్వారా ఎంతో జాగరూకతతో నిర్వహించిన ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కొక్కరూ బయటపడుతున్నారు. ప్రతి పథకానికి ప్రభుత్వ నిర్ణయాలకు నాణేనికి రెండువైపులా ఉంటాయి. వాటిని పాలకులు ఎప్పటికప్పుడు సరిచేయడంలోనే ఔచిత్యముంటుంది. ఎంతో విజయవంతంగా కొన్ని రాష్ట్రాల ఎన్నికలు నిర్వహించగలిగినా ఎప్పటికప్పుడు లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిఉంది. సుప్రీంకోర్టు జోక్యానికి వెళ్లినప్పుడు వారి సూచనలను మార్పు చేసే పద్ధతి నడుస్తున్నందున అన్నిటికీ సుప్రీం ఆమోద ముద్రకు ఎదురు చూస్తున్నాయి. ఈలోగా ఓటరు హక్కుకు దిక్కులేక కొందరు అభాగ్యులు ఆకాశంలోకి చూడటమే మిగిలింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జాబితాలో తన పేరు లేకపోతే తనను జైలుకు పంపుతారనే భయంతో తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో బోరబండ ప్రాంతవాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనో సాధారణ కారు డ్రైవర్. ఎన్నికల సంఘ ప్రక్రియలో తన డాక్యుమెంట్లు సరిపోలడంలేదు. అదే జరిగితే తన కుటుంబం రోడ్డున పడ్తుందనే ఆవేదనతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఓటు హక్కు మీద బాధ్యత పెరిగిన చోట పర్వాలేదు. తాను ఓటు వేసే సమయం, సందర్భాన్ని సద్వినియోగ పరుచుకుంటారు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతారు. కనుచూపుమేరలో చెప్పుకోదగిన ఎన్నికలులేని తెలంగాణలో ఓ వ్యక్తి తనువు చాలించాడంటే ఇంతకన్నా ఘోరం ఏమీ కనిపించదు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరమే. కానీ రాజకీయ పార్టీలోనూ, ఓటర్లలోనూ గందరగోళం సందేహాలకు తావిచ్చేవిధానంలో ఇంకా కొన్నిమార్పులు చేయాల్సి ఉంది. మృతిచెందిన వారి ఓట్లు తీయాల్సిందే. శాశ్వతంగా ఒక ప్రాంతంలో నివసించే వారిఓట్లు తొలగించరాదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు అక్కడ లేరనే సాకుతో సరైన నిర్ధారణ లేకుండా తొలగించడమంటే వారి ఓటు హక్కును ప్రశ్నించడమే. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాలో నాణ్యతను సాధించవచ్చు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట శాశ్వతంగా మరో చోట నివసిస్తుంటే వారి 'ఓటు హక్కు' ఆ ప్రాంతానికే మార్చాలి. దీని బాధ్యత ఓటరు కు ఎంత ఉందో, ఎన్నికలు నిర్వహించే సంఘానికి అంతేబాధ్యత ఉంటుంది. కాకతాళీయంగా కాకుండా ఉద్యమంలా చేపట్టిన 'సర్' ప్రక్రియలో లోపాలను ఎన్నికల సంఘం సవరించుకోవాలి. ఎన్నోసార్లు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ 'సర్' ప్రక్రియలో లోపభూయిష్ట విధానాలను సవరించుకుంటే ఎన్నో లక్షలమంది తమ ఓటు హక్కును కోల్పోతారని ఇవ్వాళ్టికీ కాంగ్రెస్ పార్టీ గొంతెత్తి విమర్శిస్తూనే ఉంది. అంటే 'సర్'లో ఇంకా లోపాలున్న మాటేగా. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక ప్రక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అది సందేహమే కావచ్చు కానీ విశ్వసనీయత పెంచుకోవాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘానిదే. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కు'కు రోడ్డెక్కడం సహించరానిది. నాలుగు రోజుల క్రితమే 'సర్' అమలుకు ఏడాది పూర్తయింది. అయినా వివాదాలు, సద్దుమణగ లేదు. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, విపక్ష పార్టీలకు మధ్య అఘాతం సృష్టించి 6 కోట్ల ఓటర్లకు 'ఓటు' దిక్కు హక్కులేని వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి సమీక్షించాలి. ఆది నుంచి ఈ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నందున సిఇసి 'సర్' పారదర్శకతను నిరూపించుకోవాలి.

> ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.
>
> ఆస్కార్‌వైల్డ్



> ఎప్పుడు, ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.
>
> రామకృష్ణ పరమహంస



## ప్రజావాక్కు



### పొదుపే భవిష్యత్తుకు భరోసా

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని అనేక జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గుతున్నాయి. వర్షపాతం అనిశ్చితంగా మారడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోవడం, పెరుగుతున్న నీటిఅవసరాలు భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈపరిస్థితుల్లో నీటి ప్రతి బొట్టును విలువైన సహజ సంపదగా భావించి పొదుపుగా వినియోగించడం అత్యవసరంగా మారింది. వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మసాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించి వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలను వేగవంతం చేయాలి. ప్రతి గ్రామంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. పట్టణాల్లో భవనాలకు వర్షపు నీటిసేకరణ వ్యవస్థలను తప్పనిసరి చేయడం కూడా అవసరం. ఇళ్లలోనూ నీటివృథాను అరికట్టడం ప్రతి పౌరుడి బాధ్యత. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా పొదుపు అలవాటును పెంపొందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వనరులను కాపాడుకుందాం

పాలకులు పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింతక్రుంగదీస్తున్నాయి. అధికారంకోసం ఎవరికి తోచిన విధంగావారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ఇలా అన్ని ఉచితాలు ఇస్తు పోతూరాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాల వల్ల లబ్ధిపొందుతున్నారు. దాంతో ప్రభుత్వఖజానా ఖాళీఅవుతోంది. మన ఆర్థిక పరిస్థితిని మనమే చేతులారా నాశనం చేసుకుంటున్నాం. ఇప్పటికైనా ఈ విషయంలో ఆలోచించి నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తే బాగుంటుంది. కష్టం రాక ముందేవనరులను సమకూర్చుకోవడం, వంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

### సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

వర్షాకాల సందర్భంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్యం పట్ల తగినంత శ్రద్ధ వహించాలి. వర్షాకాల ప్రభావం వలన తీవ్రమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీలైనంత వరకు ఇంట్లో నుండి బయటికి వెళ్లకపోవడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దొంగ బాబాలను శిక్షించాలి

కల్తీ మందులు, కల్తీసరుకులు అమ్మినందుకు సుప్రీంకోర్టు రాందేవ్ బాబాకు అరెస్ట్‌వారెంట్లు చాలాసార్లు ఇచ్చింది. క్షమాపణలు చెప్పి తప్పించుకున్నాడు. చాలా రాష్ట్రాలు రాందేవ్ బాబా కల్తీ మందులను, కల్తీ సరుకులను నిషేధించాయి. అలాంటి కల్తీ బాబాకు విజయనగరంలో మందులు తయారుకు ప్రభుత్వ భూములు ఇవ్వడం సిగ్గు చేటు. మోసగాడు అయిన రాందేవ్‌బాబాకు విజయనగరం జిల్లాలో కొత్తవలస మండలం చిన్నరావులపల్లి గ్రామంలో 70 ఎకరాలు సాంక్షన్ చేసిన జీవో నంబర్ 131 తక్షణమే రద్దు చేయాలి. బాబాలందరూ దొంగలే. ప్రభుత్వం ఈరోజు దొంగబాబాలను పెంచి పోషిస్తుంది. కాషాయ గుడ్డలు వేసుకొని, ముఖాన బూడిద పూసుకుని, మెడలో రుద్రాక్షలు వేసుకొని కనిపిస్తే వాడిని తన్ని తరిమెయ్యక, అవతారమూర్తి లాగా నాయకులు సాష్టాంగపడటం, శాలువాలు కప్పడం, ఇలా భూములు ఇవ్వడం, నాయకుల దివాలాకోరు తనానికి చిహ్నం. మీ సొంత భూములు ఇవ్వండి. ప్రజల భూములను ఇలాంటి దొంగలకు ఇవ్వటానికి కాదుమిమ్మల్ని ఎన్నుకుంది, ప్రజలఆస్తులను రక్షించటానికి. బాబాల బతుకేమిటో ప్రజలకు తెలుసు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### రోడ్లపై రేకుల షెడ్లు తొలగించాలి

మండల కేంద్రాలలో ఇరుకుగా ఉండే రోడ్లపై కొందరు ఇంటి యజమానులు బైకులు పెట్టుకోవడానికి గాను రేకుల షెడ్లు నిర్మించడంవలనప్రజలకు రేకులషెడ్లు తలలకు తలిగి గాయాలు అవుతున్నాయి. రాత్రిపూట మరీ విపరీతంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కనుక ప్రభుత్వం రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, గ్రామపంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలోపర్యటించి రేకుల షెడ్లుతొలగించాలి. ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసి వారం రోజులలో తొలగించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈమధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లుతెలిసింది. అదిసహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్య బలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువపొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజిక స్తితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తివినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యా ప్రయాణానికి డిజిటల్ చిరునామా

**ఏ సాంకేతికత అయినా విజయవంతం కావాలంటే కేవలం సౌకర్యం మాత్రమే సరిపోదు, వ్యవస్థపై ప్రజల్లో ఉండే నమ్మకం విశ్వసనీయతే కీలకమని గుర్తించాలి. గతంలో విద్యార్థి తన విద్యా ప్రయాణానికి సాక్ష్యంగా సర్టిఫికెట్ల సంచిని మోస్తూ కనిపించేవాడు, కానీ రేపటి రోజున అతని సమగ్ర విద్యా చరిత్ర కేవలం ఒకే ఒక్క డిజిటల్ గుర్తింపులో సురక్షితం కాబోతోంది. ఆధార్ ఏ విధంగానైతే భారత పౌరుడి వ్యక్తిగత గుర్తింపులో విప్లవాత్మక మార్పులు తెచ్చిందో, అదే రీతిలో 'అపార్' భారతీయ విద్యార్థి అకడమిక్ అస్తిత్వాన్ని పునర్నిర్వచించనుంది. ఈ వ్యవస్థ విజయవంతమైతే, మన విద్యావ్యవస్థ కేవలం సర్టిఫికెట్ల సేకరణ నుండి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేసే 'అభ్యాసక కేంద్రిత పర్యావరణ వ్యవస్థ'గా రూపాంతరం చెందుతుంది. వికసిత భారత్ లక్ష్య సాధనలో, డిజిటల్ ఇండియా నిర్మాణంలో విద్యారంగానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి.**



ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్ర రావు

భారతదేశ విద్యా రంగం ప్రస్తుతం ఒక అప్రకటిత డిజిటల్ విప్లవానికి వేదికైంది. ఒకప్పుడు విద్యార్థులు తమ మార్కుల మెమోలు, బదిలీ, ప్రవర్తన్న, మైగ్రేషన్ డిగ్రీ సర్టిఫికెట్లవంటి అమూల్యమైన పత్రాలను భౌతికంగా భద్రపరుచుకోవడానికి ఎంతోప్రయాస పడాల్సి వచ్చేది. అవి ఏమాత్రం దెబ్బ తిన్నా లేదా పోగొట్టుకున్నా, తిరిగి పొందడం ఒక ప్రహసనంగా ఉండేది. అయితే, సాంకేతికత అందిపుచ్చుకుంటున్న నేటి తరుణంలో, విద్యార్థి అకడమిక్ ప్రస్థానమంతా ఒకే డిజిటల్ గుర్తింపుతో ముడిపడే నూతన శకం ఆరంభమైంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రరి) 'ఒక దేశం ఒకే విద్యార్థి గుర్తింపు' అనే నినాదంతో రూపుదిద్దుకున్న ఈ విధానం, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య, వృత్తి నైపుణ్య శిక్షణ వరకు విద్యార్థి సాధించిన ప్రతి విజయానికి ఒక సురక్షితమైన డిజిటల్ చిరునామాగా నిలవబోతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద విద్యా వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారతదేశం, గణాంకాల పరంగా అపారమైన విస్తృతిని కలిగి ఉంది. యుడిఐఎస్‌ఇ 2023-24 నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా సుమారు 14.89 లక్షల పాఠశాలలు, 26.5కోట్లకు పైగా విద్యార్థులు, 95 లక్షల మంది ఉపాధ్యాయులు ఈ వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నారు. ఉన్నత విద్యారంగంలోనూ ఎఐఎస్‌హెచ్‌ఇ 2023గణాంకాల మేరకు 4.33కోట్ల మంది విద్యార్థులు, 1,168 విశ్వవిద్యాలయాలు, 45 వేలకు పైగా కళాశాలలు విస్తరించి ఉన్నాయి. ఇంతటి భారీ వ్యవస్థలో విద్యార్థుల రికార్డులు వేర్వేరు సంస్థల వద్ద విడివిడిగా ఉండటం వల్ల అనేక పరిపాలనాపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా నకిలీ ధ్రువపత్రాల బెడద, విద్యా చరిత్ర ధృవీకరణలో జాప్యం, విద్యాసంస్థల మార్పు సమయంలో రికార్డుల బదిలీలో ఇబ్బందులు, చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు తిరిగి చేరడంలో ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలు విద్యా ప్రగతికి ఆటంకంగా మారాయి. ఈ క్లిష్టతరమైన సవాళ్లను పరిష్కరించి, విద్యార్థి ప్రయోజనాలే పరమావధిగా సాగేలా జాతీయ విద్యా విధానం 2020 ఒక సమగ్రమైన డిజిటల్ విద్యా నిర్మాణాన్ని ప్రతిపాదించింది. అపార్ అనేది ప్రతి విద్యార్థికి కేటాయించే 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య. ఇది కేవలం ఒక అంకె మాత్రమే కాదు, విద్యార్థి అకడమిక్ ప్రస్థానానికి జీవితాంతం తోడ్పడే ఒక 'డిజిటల్ అకాడమిక్ పాస్పోర్ట్'. విద్యార్థి ప్రవేశ వివరాలు, హాజరు, పరీక్షా ఫలితాల నుంచి మొదలుకొని స్కాలర్‌షిప్లు, డిగ్రీలు, డిప్లొమాలు నైపుణ్య ధ్రువపత్రాల వరకు అన్నింటినీ ఇది ఒకే వేదికపైకి తెస్తుంది. అంతేకాకుండా, క్రీడలు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ వంటి సహపాఠ్య కార్యక్రమాల్లో సాధించిన విజయాలు, మెడల్స్ కూడా ఈ డిజిటల్ ఖాతాలో నిక్షిప్తమవుతాయి. తద్వారా విద్యార్థి సమగ్ర విద్యా చరిత్ర ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా సులభంగా అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవస్థ ప్రధానంగా అపార్ రిజిస్ట్రీ, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్, డిజిలాకర్ వంటి మూడు కీలక డిజిటల్ వ్యవస్థల సమన్వయంతో అత్యంత పటిష్టంగా పనిచేస్తుంది. ఈ నూతన వ్యవస్థలో అత్యంత వినూత్నమైన, విప్లవాత్మకమైన అంశం 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్'. ఒక బ్యాంకు ఖాతాలో నగదును ఏ విధంగానైతే భద్రపరుచుకుంటామో, విద్యార్థులు తమఅభ్యాస ప్రక్రియలో ఆర్జించిన క్రెడిట్లు కూడా ఇందులో అలాగే డిజిటల్ రూపంలో నిక్షిప్తమవుతాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి డిగ్రీలో రెండు సంవత్సరాలు పూర్తి చేసి, అనివార్య కారణాల వల్ల చదువును మధ్యలో ఆపివేసినా, అతను సంపాదించిన క్రెడిట్లు వృథా కావు. కొన్ని ఏళ్ల విరామం తర్వాత చదువు ప్రారంభించాలనుకున్నప్పుడు, అతను మొదటి నుంచి కాకుండా ఎక్కడైతే ఆపారో అక్కడి నుంచే తన విద్యా ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. జాతీయ విద్యా విధానం 2020 ఆకాంక్షించిన మల్టీపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ , క్రెడిట్ ట్రాన్స్ఫర్ వంటి అత్యాధునిక భావనలకు ఇది ఊపిరి పోస్తోంది. నిర్ణీత కాలపరిమితిలో డిగ్రీ పూర్తి చేయాలనే పాత సంప్రదాయ సంకెళ్లను తెంచుకుంటూ, విద్యార్థి తన వెసులుబాటును బట్టి నేర్చుకునే 'జీవితాంత అభ్యాస వ్యవస్థ' వైపు భారత విద్యా రంగం వడివడిగా అడుగులు వేస్తోంది. అపార్ వ్యవస్థ కేవలం విద్యార్థులకే కాకుండా, ప్రభుత్వానికి విద్యా పరిపాలనా యంత్రాంగానికి సైతం బహుముఖ ప్రయోజనాలను చేకూరుస్తుంది. నర్సరీ నుండి డాక్టరేట్ స్థాయివరకు విద్యార్థి, సమగ్ర విద్యా చరిత్రను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా, రాష్ట్రం లేదా విశ్వవిద్యాలయం మారినా రికార్డులను తక్షణమే సరి చూసుకోవడం సాధ్యమవుతుంది. దేశంలో తరచూ కలకలం రేపుతున్న నకిలీ సర్టిఫికెట్ల ముఠాలకు అడ్డుకట్ట వేయడంలో ఇది ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుంది. ప్రస్తుతం భారతదేశ ఉన్నత విద్యలో 'స్థూల నమోదు నిష్పత్తి' సుమారు 28.4 శాతంగానే ఉండటం ఆందోళనకరమైన విషయం. పాఠశాల లేదా కళాశాల స్థాయిలోనే పెద్ద సంఖ్యలో విద్యార్థులు విద్యా ప్రవాహం నుండి వేరుపడుతున్నారని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ తరుణంలో అపార్, ఎబిసిల సమన్వయం, విద్యా వ్యవస్థ నుండి బయటకు వెళ్లిన వారు తిరిగి తమ చదువును కొనసాగించడానికి అవసరమైన వెసులుబాటును కల్పిస్తూ, వారిని తిరిగి విద్యా స్రవంతిలోకి చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ పరిపాలనా కోణంలో చూస్తే, అపార్ ఒక అత్యంత శక్తివంతమైన 'డేటా ఆర్కిటెక్చర్'గా అవతరించనుంది. విద్యార్థుల నమోదు సరళి, బడి మానేస్తున్న వారి ధోరణులు, ప్రాంతీయ అసమానతలు, లింగ వివక్ష వంటి కీలక అంశాలపై ఎప్పటికప్పుడు కచ్చితమైన గణాంకాలను ఇది అందిస్తుంది. ఈ సమాచారం అందుబాటులో ఉండటం వల్ల విధాన నిర్ణేతలు ఊహల ఆధారంగా కాకుండా, వాస్తవ గణాంకాల ఆధారంగా ఆధారిత నిర్ణయాలు తీసుకునే వీలుంటుంది. భారతదేశం వంటి సువిశాల దేశంలో విద్యా సంస్కరణలు విజయవంతం కావాలంటే, ఖచ్చితమైన డేటా ఆధారంగా ప్రణాళికలు రూపొందించడం ఒక ప్రాథమిక అవసరం. కేంద్ర ప్రభుత్వం 2023లో శ్రీకారం చుట్టిన అపార్‌అమలు ప్రక్రియ, ప్రస్తుతం పాఠశాల, ఉన్నత, వృత్తి విద్యా రంగాల్లో దశలవారీగా పురోగతి సాధిస్తోంది. ప్రభుత్వ లక్ష్యంప్రకారం 2026-27 నాటికి దేశవ్యాప్తంగా దీనిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే, ఈ బృహత్తర వ్యవస్థ ఆశించిన విజయాలను అందుకోవాలంటే కొన్ని క్లిష్టమైన సవాళ్లను అధిగమించక తప్పదు. ముఖ్యంగా కోట్లాది మంది విద్యార్థుల వ్యక్తిగత సమాచార గోప్యత, సైబర్ భద్రతను అత్యున్నత ప్రమాణాలతో కాపాడటం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటితో పాటు తల్లిదండ్రులలో అవగాహన కల్పించి వారి అంగీకారాన్ని పొందడం, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాల కొరతను అధిగమించడంవిద్యాసంస్థలను సాంకేతికంగా సంసిద్ధం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిఉంది. అంతిమంగా, ఏ సాంకేతికత అయినా విజయవంతం కావాలంటే కేవలం సౌకర్యం మాత్రమే సరిపోదు, వ్యవస్థపై ప్రజల్లో ఉండే నమ్మకం విశ్వసనీయతే కీలకమని గుర్తించాలి. గతంలో విద్యార్థి తన విద్యా ప్రయాణానికి సాక్ష్యంగా సర్టిఫికెట్ల సంచిని మోస్తూ కనిపించేవాడు, కానీ రేపటి రోజున అతని సమగ్ర విద్యా చరిత్ర కేవలం ఒకే ఒక్క డిజిటల్ గుర్తింపులో సురక్షితం కాబోతోంది. ఆధార్ ఏ విధంగానైతే భారత పౌరుడి వ్యక్తిగత గుర్తింపులో విప్లవాత్మక మార్పులు తెచ్చిందో, అదే రీతిలో 'అపార్' భారతీయ విద్యార్థి అకడమిక్ అస్తిత్వాన్ని పునర్నిర్వచించనుంది. ఈ వ్యవస్థ విజయవంతమైతే, మన విద్యా వ్యవస్థ కేవలం సర్టిఫికెట్ల సేకరణ నుండి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేసే 'అభ్యాసక కేంద్రిత పర్యావరణ వ్యవస్థ'గా రూపాంతరం చెందుతుంది. వికసిత భారత్ లక్ష్య సాధనలో, డిజిటల్ ఇండియా నిర్మాణంలో విద్యా రంగానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. ●




# వర్షపు నీటిని ఒడిసిపడితేనే జీవకోటికి భద్రత

డాక్టర్. వై. సంజీవ కుమార్

ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరాలలో నీరు అత్యంత ముఖ్యమైనది. నీరు లేకుండా జీవం లేదు. మానవులు, జంతువులు, పక్షులు, మొక్కలు ఇలా సమస్త జీవకోటి మనుగడకు నీరే ఆధారం. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా తాగునీటి కొరత, భూగర్భ జలాల తగ్గుదల, వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యలు మానవాళిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేయగలిగే అత్యంత సులభమైన, సమర్థవంతమైన పని వర్షపు నీటిని ఒడిసిపట్టడం. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా వర్షపు నీరు ఎక్కువగా కాలువల ద్వారా వృథాగా నదులు, సముద్రాలలో కలిసిపోతోంది. ఈనీటిని భూమిలోకి ఇంకే విధంగా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం వర్షపాతం తగ్గడం, అసమానంగా కురవడం, అటవీ నిర్మూలన, అధికంగా బోర్లు వేయడం వంటి కారణాలవల్ల భూగర్భ జలాల మట్టాలు క్రమంగా పడిపోతున్నాయి. ఈపరిస్థితిని మార్చాలంటే వర్షపు నీటిని భూమిలోకి చేరేలా చేయడం అత్యవసరం. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. బావులు, బోర్లు ఎండిపోకుండా ఉంటాయి. తాగునీటి సమస్య తగ్గుతుంది. వ్యవసాయానికి అవసరమైన నీరు అందుబాటులోఉంటుంది. పర్యావరణ సమతుల్యత మెరు గుపడుతుంది. వర్షపు నీటిని భూమిలోకి చేర్చడానికి ఇంకుడు గుంతలు అత్యంత ఉపయోగకరమైనవి. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, పార్కుల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తే పైకప్పులపై పడే వర్షపు నీరు నేరుగా భూమిలోకి చేరుతుంది. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి సమీప ప్రాంతాల్లోని బోర్లలో నీటి నిల్వలు మెరుగుపడతాయి. ప్రతిపౌరుడు తన ఇంటి వద్ద ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తే మరింతమెరుగైన ఫలితాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు చెరువులు, కుంటలు, బావులు నీటి నిల్వలకు ప్రధాన ఆధారంగా ఉండేవి. ప్రస్తుతం అనేక చెరువులు పూడికతో నిండిపోవడం, ఆక్రమణలకు గురికావడం వల్ల వాటి నీటి నిల్వసామర్థ్యం తగ్గిపోయింది. వర్షాకాలానికి ముందు చెరువులను శుభ్రపరచి, పూడికతొలగించి, నీటినిల్వసామర్థ్యాన్ని పెంచితే భారీగా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చు. అలాగే పొలాల్లో చిన్నచిన్న గుంతలు, కందకాలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు పొలంలోనే నిలిచి భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో నాటిన మొక్కలు సులభంగా భూమిలో స్థిరపడతాయి. మొక్కలు పెరిగి చెట్లుగా మారినప్పుడు వాతావరణంలో తేమను పెంచి వర్షాలను ఆకర్షించడంలో కీలక పాత్రపోషిస్తాయి. రైతులు పొలాల్లో వర్షపు నీటిని నిల్వచేసుకునే పద్ధతులను అనుసరించాలి. కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వచేయవచ్చు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి పంటలకు అవసరమైన నీరు అందుతుంది. వ్యవసాయ ఉత్పత్తికూడా మెరుగుపడుతుంది. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టు అమూల్యమైన సంపద నీటిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు ప్రకృతిసంపాదనకు అందించినట్టే, వర్షపునీటిని ఒడిసి పట్టుదాం నీటిభద్రతతో కూడిన భవిష్యత్తును నిర్మిద్దాం. ●

# యుద్ధాల్లో అమెరికా గెలిచినదెప్పుడు?



సరికొండ రవీంద్రనాథ్

ప్రపంచాన్ని శాసిస్తున్నది మేమే అని అమెరికా గొప్పలు చెప్పుకుంటుంది. కానీ అవమానాలతోవెను తిరగడమేగాని ప్రపంచ చరిత్రలో అమెరికా గెలిచిన యుద్ధం ఏదీలేదు. ఇరాన్ నుంచి కువైట్‌ను విముక్తి చేసి అక్కడ తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా దాన్ని గెలుపు కింద ప్రపంచం పరిగణించడం లేదు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నేనే సూపర్ పవర్ అంటూ అనేక దేశాల ప్రభుత్వాల వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంది. ఆరు భారీ యుద్ధాల్లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొన్నది. సుమారు పదిహేను దేశాల్లో కుట్రలు, కుతంత్రాల ద్వారానే ప్రభుత్వాలను అమెరికా పడదోసి నేతలను మార్చింది. ఇప్పుడు గల్ఫ్ యుద్ధం నుంచి బైట పడటానికి ఇరాన్ పెట్టిన షరతులను అన్నింటిని అమెరికా ఆమోదిస్తూ సంతకాలు చేసింది. ఇది అమెరికా పరాజయంగానేప్రపంచం భావిస్తోంది. వియత్నాం, కొరియా, గల్ఫ్, ఇరాక్, అఫ్ఘానిస్థాన్, ఇరాన్ యుద్ధాల్లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొంది. వియత్నాం యుద్ధం అమెరికాకు అత్యంత అవమానాన్ని, నష్టాన్ని మిగిల్చింది. కమ్యూనిస్టు దేశాలైన రష్యా, చైనా ప్రాబల్యాన్ని అరికట్టడానికి అమెరికా ఈ యుద్ధం చేసింది. ఆగ్నేయాసియాలో 1955 నుంచి 75వరకు ఇరవై సంవత్సరాలు ఈ యుద్ధం కొనసాగింది. అమెరికాకు చెందిన 59 వేల మంది సైనికులు మృతి చెందగా లక్షా యాభై నాలుగు వేల మంది గాయపడ్డారు. హెచిమిన్ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో వియత్నాం సైనికులు, ప్రజలు సుమారు 20లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వియత్నాంపై గెలవలేమని నిర్ణయించుకుని అమెరికా తమ సైన్యాన్ని అవమానకరమైన రీతిలో ఉపసంహరించుకుంది. యుద్ధానికి ముందు రెండుగా ఉన్న వియత్నాం యుద్ధం తర్వాత కమ్యూనిస్టు దేశంగా ఏకమైపోయింది. ఇది అమెరికా తట్టుకోలేని మరో విషాదం. కొరియా యుద్ధం కూడా వియత్నాం యుద్ధం లాంటిదే. 1950-53 మధ్య జరిగిన ఈ యుద్ధంలో అమెరికా కన్నులొట్టబోయి బైటపడింది. జపాన్ నుంచి దక్కిన దక్షిణ కొరియాను మాత్రం కాపాడుకోగలిగింది. ఈ యుద్ధంలో 37వేల మంది అమెరికా సైనికులు చనిపోయారు. లక్షమంది గాయపడ్డారు. ఇప్పటికీ ఉత్తర కొరియా అమెరికాను అణ్వాయుధాలతో ఆడిస్తూనే ఉంది. దురదృష్టం ఏంటంటే ఈ యుద్ధంలో అపారమైన ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటికీ రెండు కొరియాల మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉంది. 1990నుంచి ఏడాది పాటు జరిగిన గల్ఫ్ యుద్ధంలో 294మంది అమెరికా సైనికులు చనిపోయారు. సుమారుగా ఉత్తరాంధ్ర వైశాల్యంగల కువైట్‌ను చమురు కోసం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆక్రమించాడు. అమెరికా దాడి చేసి కువైట్‌ను విడిపించింది. సుమారు 140 బిలియన్ డాలర్లు అమెరికాకు ఖర్చయింది. ఈఖర్చులో ఎక్కువ భాగం ఫ్రాన్స్, బ్రిటన్‌తో సహా అరబ్ మిత్ర దేశాలు భరించాయి. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికాకు జరిగిన నష్టం అపారమైనది. దేశంలో విలువైన మినరల్స్ తవ్వి తెచ్చుకోవాలని అమెరికా వెళ్లింది. తీవ్రవాదుల తుపాకుల మోతల మధ్య రాళ్లు కూడా తెచ్చుకోలేమని అర్థమైంది. అవమానకరమైన రీతిలో తిరుగుముఖం పట్టింది. 2001 నుంచి 21వరకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం జరిగిన యుద్ధంలో 7,200 మంది సైనికులు చనిపోయారు. 53వేలమంది గాయపడ్డారు. సుమారు మూడు ట్రిలియన్ డాలర్లువ్యయం చేయాల్సి వచ్చింది. ఈ ఖర్చు చివరికి ఐదు ట్రిలియన్లకు చేరుకుంది. ఇది రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికాపెట్టిన ఖర్చుతో సమానం. ఈ యుద్ధం ఆపేయాలంటూ అమెరికా ప్రజలు వీధుల్లోకి వచ్చిన తర్వాతనే అమెరికా ప్రభుత్వం తమ సేనలను ఉపసంహరించుకుంది. అమెరికా పెంచి పోషించిన తీవ్రవాద సంస్థ అల్ ఖైదా బలహీనపడింది. ఒసామా బిన్‌లాడెన్ చనిపోయాడు. కానీ 2021లో తాలిబన్‌లు తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అదీ అవమానం రసాయన ఆయుధాలు ఉన్నాయంటూ ఇరాక్ పై అమెరికా దాడిచేసింది. 2003-11 మధ్య జరిగిన యుద్ధంలో అమెరికా సైనికులు 4 వేల 431 మంది చనిపోయారు. 32 వేల మంది గాయపడ్డారు. 1.5 ట్రిలియన్ డాలర్లు ఖర్చయింది. చివరగా తేల్చిందేమిటంటే ఇరాక్ నుంచి ఆశించిన చమురు రాకపోగా అమెరికాకు రెండు ట్రిలియన్ల వరకూ చేతి చమురు వదిలింది. అమెరికాకు యుద్ధం ఖర్చుల కింద 300బిలియన్ డాలర్లు ఇరాక్ చెల్లించాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేయించారు. కానీ ఖర్చులో డాలర్ కూడా అమెరికాకు తిరిగి రాలేదు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సిఐఎ కుట్రలు, కుతంత్రాలతో సుమారు పదిహేను దేశాల్లో ప్రభుత్వాలను కూలదోస్తారు. తర్వాత తమకు అనుకూలమైన నియంతలను ప్రభుత్వాల్లో నియమించుకున్నారు. ఇలా పరోక్షంగాచేసిన యుద్ధాల్లో క్యూబా క్షిపణుల సంక్షోభం ప్రధానమైంది. ఇది దాదాపు యుద్ధమే. కానీ క్యూబా నాయకుడు, సోషలిస్టు నేత ఫిడెల్ కాస్ట్రోను అధికారం నుంచి తొలగించలేకపోయారు. కాస్ట్రోను హత్య చేయడానికి సిఐఎ సుమారు ముప్పయిసార్లు హత్యాయత్నాలు చేసింది. ఇండోనేషియాలో సుకర్ణో, ఇరాన్‌లో మహమ్మద్ మొసాద్, అఫ్ఘానిస్థాన్‌లో నజీబుల్లా కుట్రల ద్వారా అమెరికా తొలగించిన దేశాధ్యక్షుల జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలో కొందరు అధినేతలను అమెరికా కిరాతకంగా హత్య చేయించింది. లిబియా అధ్యక్షుడు గఢాఫీని వీధుల్లో పరుగెత్తించి కుక్కను కొట్టినట్టు రాళ్లతో కొట్టి చంపారు. అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు ముహ్మద్ నజీబుల్లాను నడివీధిలో ట్రాఫిక్ సిగ్నల్‌కు కట్టి ఉరి తీసారు. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను విచారణ పేరుతో ఉరితీసారు. చిలీలో సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని కూలదోసి చంపేసారు. ఇటీవల వెనెజులాఅధ్యక్షుడు మదురోను అరెస్టుచేసి తీసుకువచ్చారు. అమెరికా గూఢాచారి సంస్థ సిఐఎ ప్రపంచ వ్యాప్తంగా జరుపుతున్న హింసాత్మక కుట్రల్లో ఇవి కొన్ని మాత్రమే. భారతదేశాన్ని కూడా విడదీయడానికి సిఐఎ కుట్రలున్నాయి. కాశ్మీర్ విభజనకు జెకెఎల్‌ఎఫ్, అస్సాం దేశం కోసం యుఎల్‌ఎఫ్‌ఎ, తమిళనాడు, శ్రీలంక తమిళ ప్రాంతాలతో ప్రత్యేక దేశం ఏర్పాటుకు ఎల్.టి.టి.ఇ. టియుఎల్‌ఎఫ్ లాంటి సంస్థలు ఏడు ఏర్పాటు చేసారు. అన్నీ నాలుగు అక్షరాలే. మాజీ ప్రధాని ఇందిర ముందు సిఐఎ ఆటలు సాగలేదు. తెరచాటు కుట్రలతో పెత్తనం చేయడం తప్ప ప్రత్యక్ష యుద్ధంలో గెలిచిన చరిత్ర అమెరికాకు లేదు. ఇప్పుడు గల్ఫ్ యుద్ధం నుంచి అమెరికా ఎలా బైటపడుతుందో చూడాలి. ●



# భారత్ షేరునే కొనుగోలుచేస్తా

## అమెరికా సెనేటర్ స్టీవ్ డైన్స్ ప్రశంసలు

**వాషింగ్టన్,జూన్ 30:** దేశాలను స్టాక్ మార్కెట్లో షేర్లలా చూస్తే, తాను కచ్చితంగా భారత్ షేరునే కొనుగోలు చేస్తానంటూ అమెరికాకు చెందిన రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారత్ వేగంగా ఎదుగుతోందని, అమెరికాతో ఆ దేశ సంబంధాలు అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. వాషింగ్టన్ డీసీలో జరుగుతున్న యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ సెనేట్ ఎన్నికల ప్రచార విభాగానికి స్టీవ్ డైన్స్ అధిపతిగా ఉన్నారు. దీంతో ఆయన ట్రంప్ పార్టీ నాయకత్వానికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయంగా కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. భారత్ ఆర్థిక వృద్ధిని ఉటంకిస్తూ ఆయన తన ప్రశంసలకు కారణాలను వివరించారు. జిడిపి దృష్ట్యా చూస్తే ప్రపంచంలోని టాప్ 20 ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఐదో స్థానంలో ఉంది. త్వరలోనే జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకోనుంది. ఈ టాప్ 20 దేశాలలో ఈ ఏడాది, వచ్చే యేడాది కూడా అత్యధిక జిడిపి వృద్ధి రేటును నమోదు చేయబోయేది భారతే. అందుకే భారత్ ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోందని డైన్స్ పేర్కొన్నారు.



ఇదే సదస్సులో మరో సందర్భంలో మాట్లాడిన డెమోక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి నేత రో ఖన్నా మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 30 యేళ్లలో భారత్ అమెరికా సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని ఆయన ఆరోపించారు. ఇరాన్‌తో యుద్ధానికి దిగాలన్న ట్రంప్ విధానాలు పూర్తిగా విధ్వంసకరమైనవి. ఆ ప్రభావంతో భారత్‌లో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నమ్మకం లేకపోతే భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌ను అడగండని ఉటంకిస్తూ రో ఖన్నా అన్నారు. ఒకవైపు డైన్స్ భారత్‌ను నమ్మకమైన భాగస్వామి అని, ప్రధాని నరేంద్ర మోడీతో సంబంధాలను బలోపేతం చేయడానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వ చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం వరకు సుంకాలు విధించింది. ఈ సుంకాల వల్ల 2025 ఆర్థిక సంవత్సరంలో భారత జిఇపి వృద్ధికి ఒక శాతం వరకు గండి పడవచ్చని ఆర్థికవేత్తలు అప్పట్లో అంచనా వేశారు. ప్రస్తుతం ఈ సుంకాలు 18 శాతానికి తగ్గినా, ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే ఇది ఇంకా ఎక్కువే. అమెరికాకు భారతీయ విద్యార్థులు, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు అవసరమని డైన్స్ చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం మాత్రం విద్యార్థి వీసాలు, హెచ్1బీ వర్క్ పర్మిట్లపై కఠిన నిబంధనలు విధించింది. ఫారిన్ స్టూడెంట్స్ కోసం ఉద్దేశించిన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను తొలగించడం, హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును ఒక లక్ష డాలర్లకు పెంచడం వంటి చర్యలు భారత విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

భారతీయ అమెరికన్లపై పెరుగుతున్న ద్వేషపూరిత దాడుల గురించి ప్రశ్నించగా, ద్వేషం ఏ రూపంలో ఉన్నా దానిని ఎదుర్కోవాలి. ఇక్కడ భారతీయ అమెరికన్లు చాలా సురక్షితంగానే ఉన్నారని డైన్స్ సమాధానమిచ్చారు. ఎఫ్‌బీఐ డేటాను విశ్లేషిస్తూ ఈ యేడాది ఏప్రిల్‌లో 2015 నుంచి 2025 మధ్య ఆసియన్లపై ద్వేషపూరిత నేరాలు 195 శాతం పెరిగాయని తేలింది.



## 'సర్'పై విపక్షాల అభ్యంతరం

### సిజెఐకి 23 రాజకీయ పార్టీల లేఖ

### ఎన్నికల సంఘం తీరుపైనా ప్రస్తావన

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఎన్నికల ప్రక్రియ విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు 23 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపి ఉమ్మడిగా లేఖ రాశాయి. ఈ విషయాన్ని మంగళవారం కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "జూన్ 8న జరిగిన 'ఇండియా' కూటమి సమావేశానికి 21 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర అభ్యర్థి హాజరయ్యారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తికి ఉమ్మడి లేఖ రాయాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మరో రెండు పార్టీలు మద్దతు తెలపడంతో మొత్తం 23 పార్టీలు ఈ లేఖపై సంతకం చేశాయి. ప్రతిపక్ష పార్టీలు సంఘీభావం, ఐక్యత, ప్రతిఘటన అనే సూత్రంపై దృఢంగా నిలిచి ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత కోసం కలిసి పోరాడతామని స్పష్టం చేశార్లు" అని జైరాం రమేష్ పేర్కొన్నారు.


ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వల్ల కోట్లాది మంది ఓటు హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇండియా కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ధ్రువీకరణ లేకుండా పేర్లు తొలగించే పరిస్థితులు తలెత్తితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అలాగే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కొనసాగాలని, ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉండాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం.



## కొత్త ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్

### - బాధ్యతలు స్వీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశానికి నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో జనరల్ ధీరజ్ సేథ్ ఈ రోజు 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. జనరల్ సేథ్ పుణెలోని ఖడక్‌వాస్లాలో ఉన్న జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితులయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన విశిష్ట సైనిక వృత్తిలో, ఆయన కార్యాచరణ, వ్యూహాత్మక, సామర్థ్య అభివృద్ధి, సంస్థాగత రంగాలలో విస్తృతమైన అనుభవాన్ని సంపాదించారు. భారత సైన్యం పోరాట సామర్థ్యానికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఆయన గణనీయంగా దోహదపడ్డారు. ఆయన కమాండ్ బాధ్యతలలో ఎడారి సెక్టార్‌లోని ఆర్మర్డ్ రెజిమెంట్, వెస్ట్రన్ థియేటర్‌లోని ఆర్మర్డ్ బ్రిగేడ్, జమ్మూ కాశ్మీర్‌లోని కౌంటర్‌ఇన్సర్జెన్సీ ఫోర్స్ ఉన్నాయి. లెఫ్టినెంట్ జనరల్‌గా, ఆయన భారత సైన్యంలోని ప్రముఖ స్ట్రైక్ ఫార్మేషన్‌లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండ్‌గా వ్యవహరించారు. తదనంతరం ఆయన ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా పనిచేస్తూ, కీలకమైన జాతీయ, అంతర్జాతీయ సైనిక కార్యకలాపాలు, ఉత్సవ బాధ్యతలను పర్యవేక్షించారు.



## సింధు జలాలు వదలకుంటే భారత్ అంతుచూస్తాం

### పాకిస్థాన్ మంత్రి ప్రేలాపనలు

**కరాచి,జూన్ 30:** పాకిస్తాన్‌కు సింధు నది నీళ్ల ఇవ్వకూడదని భారత్ తీసుకున్న నిర్ణయం పాకిస్థాన్‌ను భారీ దెబ్బకొట్టింది. భారత సరిహద్దులోని పాక్ ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను పాకిస్థాన్ బ్రతిమిలాడాల్సింది పోయి బెదిరింపులకు దిగుతోంది. సింధు నదీజలాలు ఇవ్వకుంటే భారత్ అంతుచూస్తామంటూ హెచ్చరిస్తోంది. తాజాగా, పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ కూడా భారత్‌ను బెదిరించాడు. సింధు నదీ జలాలు పాకిస్థాన్ నీళ్ల అంటూ చెప్పాడు. తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేసామంటూ పరోక్షంగా భారత్‌ను హెచ్చరించాడు. పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతౌల్లా తరార్ మాట్లాడుతూ సింధు నదీ జలాలను ఒక ట్యాప్ ద్వారా మన ప్రధానమంత్రి కంట్రోల్ చేస్తున్నారు అంటూ విమర్శించాడు.పాకిస్థాన్‌లోకి ఒక్క చుక్క నీళ్లు కూడా రాకుండా అడ్డుకుంటున్నారన్నాడు. ఇలా ఏకపక్షంగా ఒక దేశం నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం తగదంటూ చెప్పుకొచ్చాడు. సింధు నదికి సంబంధించిన జలాల విషయంలో ఇండియా, పాక్ మధ్య దశాబ్దాలుగా ఒప్పందం ఉంది. అయితే, గత ఏడాది పహల్గాంలో ఉగ్రదాడుల తర్వాత ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసింది. దీంతో పాకిస్థాన్‌కు సింధు నదీ జలాల పంపిణీని భారత్ నిలిపివేసింది.

## సీషెల్స్ పాలకులకు ప్రధానిమోడీ అపురూప కానుకలు



**విక్టోరియా,జూన్ 30:** ప్రధాని నరేంద్ర మోడీ తన మూడు రోజుల సీషెల్స్ పర్యటనలో ఆ దేశ ఉన్నత స్థాయి నాయకులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. భారత గొప్ప సాంస్కృతిక వారసత్వం, కళా నైపుణ్యానికి అద్దం పట్టేలా ఈ కానుకలను ఎంపిక చేశారు. రెండు దేశాల మధ్య బలమైన స్నేహ బంధాన్ని, భాగస్వామ్య విలువలను ఈ బహుమతులు ప్రతిబింబిస్తున్నాయి. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినియేకు ప్రధాని మోడీ మురాదాబాదీ ఇత్తడి తాబేలును బహూకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ప్రసిద్ధ ఇత్తడి హస్తకళకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ. అక్కడి నిపుణులైన కళాకారులు చేతితో దీనిని ఎంతో నైపుణ్యంగా రూపొందించారు. జ్ఞానం, స్థిరత్వం, దీర్ఘాయుష్షుకు తాబేలు ప్రతీక. ప్రపంచంలోనే అతిపెద్ద, ఎక్కువ కాలం జీవించే తాబేళ్లలో ఒకటైన అల్డాబ్రా జెయింట్ టార్టాయిస్‌కు సీషెల్స్ ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సీషెల్స్ ప్రథమ మహిళ వెరోనిక్ హెర్మినియేకు బిద్రీవేర్ బాక్స్, మహేశ్వరి సిల్క్ శాలువాను ప్రధాని అందజేశారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బిద్రీవేర్ హస్తకళ చాలా ప్రత్యేకమైనది. నల్లటి లోహపు ఉపరితలంపై వెండి తీగతో చేసే సున్నితమైన నగిషీ పనితనం ఇందులో కనిపిస్తుంది. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వర్‌కు చెందిన మహేశ్వరి సిల్క్ శాలువా తేలికైన బరువు, నాణ్యమైన పట్టు, కాటన్ నూలుతో చేసిన నేతకు ప్రసిద్ధి. సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిల్లేకు సిక్కింకు చెందిన ఆర్కిడ్ పెయింటింగ్‌ను, ఆయన అర్ధాంగి లీనా పిల్లేకు కంచివరం పట్టు నెమలిపై సీషెల్స్ జాతీయ పుష్పం ఆర్కిడ్‌ను అందంగా చిత్రించారు. ఇది ప్రకృతి పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల రెండు దేశాలకు ఉన్న నిబద్ధతకు నిదర్శనం. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన కంచి పట్టు తన నాణ్యత, మన్నిక, బంగారు జరీ పనితనానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. సీషెల్స్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టాకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివసించే తోడా గిరిజన తెగకు చెందిన తోడా ఎంబ్రాయిడరీ శాలువాను మోదీ బహూకరించారు. తెలుపు రంగు కాటన్ వస్త్రంపై ఎరుపు, నలుపు రంగు దారాలతో రేఖాగణిత ఆకృతులలో చేసే ఈ ఎంబ్రాయిడరీ ఆ తెగ కళాత్మక వారసత్వానికి చిహ్నం. ఈ బహుమతుల ద్వారా రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని, స్నేహాన్ని మరింత పటిష్టం చేసే ప్రయత్నం చేశారు.

## 'మోడీ నిద్ర లేచే ఉంటారులే..'

### ఉదయం ఆరింటికే ఫోన్ చేయాలనుకున్న ట్రంప్




**వాషింగ్టన్, జూన్ 30:** భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఇరు దేశాధినేతల స్నేహం మూలస్తంభం అని యుఎస్ రాయబారి సెర్గియోగోర్ అన్నారు. వాషింగ్టన్ వేదికగా ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యుఎస్ఐఎస్‌పిఎఫ్)లో పాల్గొన్న ఆయన.. మోడీ-ట్రంప్ బంధాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకున్న ఆయన.. ప్రధాని మోడీకి ఓసారి ట్రంప్ ఉదయం ఆరు గంటలకే ఫోన్ చేయాలనుకున్నట్లు తెలిపారు. 'రెండు నెలల కిందట మియామిలో యుఎఫ్‌సి ఈవెంట్ జరిగింది. ఆ సమయంలో నేను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్నాను. వేదిక పక్కన మేం మాట్లాడుకుంటూ ఉండగా.. 'మోడీకి కాల్ చేద్దాం' అని ట్రంప్ అన్నారు. 'ఇప్పుడు భారత్‌లో సమయం ఉదయం 6 గంటలు' అని నేను చెప్పా. దానికి అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఏం ఫర్వాలేదు. ఆయన (మోడీ) నిద్ర లేచే ఉంటారు. ఎక్కువ సేపు పడుకోరు. ఆయనకు నేనంటే ఇష్టం' అని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేరే బాధ్యతల్లో ఉండటంతో మోడీతో కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు. అయితే, ఈ సంఘటన వారిద్దరి మధ్య మైత్రిని చాటి చెబుతుంది. ఎవరితోనైనా స్నేహం చేస్తే.. ప్రతిదాన్ని షెడ్యూల్ చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్‌ను చూశాక నాకనిపించింది. మోడీ ఆయనకు గొప్ప స్నేహితుడు' అని సెర్గియో గోర్ వెల్లడించారు.

**తుది దశకు ట్రేడ్ డీల్..**

ఇక, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా రాయబారి ప్రస్తావిస్తూ.. 'ట్రేడ్ డీల్‌పై తుది దశకు చేరుకున్నాం. చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. కేవలం ఒకటి లేదా రెండు శాతం ఉత్పత్తులపై అంగీకారానికి రావాల్సి ఉంది. అతి త్వరలోనే ఈ ఒప్పందంపై ప్రకటన వస్తుంది' అని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ భారత పర్యటన గురించి సెర్గియో గోర్ మాట్లాడారు. భారత్‌లో పర్యటించేందుకు అమెరికా అధ్యక్షుడు ఎదురుచూస్తున్నారని, మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ పర్యటన ఉండొచ్చని తెలిపారు.

## పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ఒక ప్రయోగం

### వచ్చే యేడాది నాటికి ఫలితాలు



**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశంలో పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ కలిపే కార్యక్రమం ఇంకా కొనసాగుతున్న ప్రయోగ దశలోనే ఉందని, ఈ విధానం ప్రభావం వచ్చే యేడాది నాటికి స్పష్టమవుతుందని ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇ20 పెట్రోల్‌కు, వాహనాల యాంత్రిక నష్టానికి సంబంధం ఉందని చెప్పడానికి గట్టి ఆధారాలు లేవని, ఈ విధానం భారతదేశ ఇంధన భద్రతకు, రైతులకు, పర్యావరణానికి మొత్తంగా ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. 2025-26 సరఫరా సంవత్సరానికి ఇథనాల్ కేటాయింపులకు సంబంధించి కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. జూన్ 23న ఇచ్చిన తన ఉత్తర్వులో, టెండర్ ప్రక్రియను ఖరారు చేయడానికి ముందే, తమ ఇథనాల్ కేటాయింపులను పెంచాలని కోరుతూ ఒక డిస్టిలరీ చేసిన అభ్యర్థనను పరిశీలించాలని హైకోర్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను (ఒఎంసిలు) బిపిసిఎల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లను ఆదేశించింది. పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యంపై ఈ ఉత్తర్వు విస్తృత ప్రభావం చూపవచ్చని బిపిసిఎల్ కోర్టుకు తెలిపింది. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సరఫరా ఒప్పందాలను ఖరారు చేయడంతో ఇథనాల్ కేటాయింపుల ప్రక్రియ అక్టోబర్ 2025లోనే పూర్తయిందని, వ్యక్తిగత కేటాయింపులను తిరిగి ప్రారంభించడం దేశవ్యాప్త కార్యక్రమానికి అంతరాయం కలిగించవచ్చని హెచ్చరించారు.

## చైనా బిలియనీర్‌కు అమెరికా కోర్టు 30 యేళ్ల జైలుశిక్ష

**న్యూయార్క్,జూన్ 30:** చైనా బిలియనీర్ గువో వెంగుయికి 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. అమెరికాలోని మన్‌హటన్ జిల్లా కోర్టు ఆయనకు ఆ శిక్షను విధించింది. చైనాలో ఒకప్పుడు సంపన్న వ్యక్తిగా ఉన్న గువో వెంగుయి కొన్నేళ్ల క్రితం అమెరికాకు పరారీ అయ్యారు. అయితే అమెరికా వేదికగా చైనా కమ్యూనిస్టు పార్టీని ఆయన విమర్శించేవారు. బిలియన్ డాలర్ల స్కామ్‌లో అమెరికా కోర్టు ఆయనకు ఇవాళ శిక్షను ఖరారు చేసింది. ప్రాపర్టీ టైకూన్‌గా పేరున్న గువో వెంగుయి 2017లో చైనాను వీడి అమెరికా వెళ్లారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ విమర్శకుడిగా పేరుగాంచారు. మనీల్యాండరింగ్, ఫ్రాడ్, ముఠా నేరాభియోగాల కింద గువోను అరెస్టు చేశారు. చైనాకు ప్రజాస్వామ్యాన్ని మార్చాలనుకున్న ప్రజలను గువో పీక్కుతిన్నారని న్యూయార్క్ కోర్టు జడ్జీ అనాలిసా తన తీర్పులో పేర్కొన్నారు. చైనీయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బును దోచుకున్నగువో ఆ సొమ్ముతో సంపన్న జీవితాన్ని గడిపారు. చైనాలో రాజకీయ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని భారీ ఆన్‌లైన్ ఉద్యమాన్ని నడిపారు. అమెరికా చేరుకున్న తర్వాత వారి నుంచి భారీ మొత్తంలో సొమ్మును రాబట్టారు. 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో స్కీమ్‌లతో ప్రజల్ని గువో మోసం చేశారు. అమెరికాలో గువో 50 వేల చదరపు గజాల ఇంటిని నిర్మించుకున్నారు. స్వంత అవసరాల కోసం డబ్బును వాడడంతో గువోపై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ తనకు వచ్చిన నిధులను రాజకీయాల కోసం వాడినట్లు ఆయన చెబుతున్నారు. చైనాను విమర్శించే అమెరికా నేతలతో గువో చేతులు కలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గతంలో సలహాదారుడిగా చేసిన స్టీవ్ బానన్‌తో కలిసి ఆన్‌లైన్ వీడియోలు చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఆ ఇద్దరూ కలిసి పనిచేశారు.

### ఆ అగ్నిపర్వతం నుంచి 18.9 కోట్ల విలువైన

## బంగారం ధూళి గాలిలోకి..



**రాస్ ఐలాండ్, జూన్ 30:** అంటార్కిటిక్‌లోని ఎరెబస్ అగ్నిపర్వతం.. యేటా రూ. 18.9 కోట్ల విలువైన బంగారం ధూళి గాల్లోకి విరజిమ్ముతున్నట్లు జియోఫిజికల్ పరిశోధనలు వెల్లడించాయి. 1991 నాటి సర్వే ప్రకారం.. రాస్ ద్వీపం సమీపంలో ఉన్న ఎరెబస్ అగ్నిపర్వతం రోజుకు 80 గ్రాముల బంగారు ధూళి గాల్లోకి విరజిమ్ముతోంది. ఈఅగ్నిపర్వత లావా నుంచి విడుదలయ్యే వాయువులుస్వచ్ఛమైన బంగారు సూక్ష్మకణాలను మోసుకెళ్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అవి అంటార్కిటిక్ మంచుపై స్థిరపడటానికి ముందు 1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయని తెలిపారు. ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను ఉయోగించి.. 60 మైక్రోమీటర్ల వరకు వ్యాసం కలిగి ఉంటే ఈ బంగారు స్పటికాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. లావాతోపాటు స్వచ్ఛమైన బంగారు సూక్ష్మ స్పటికాలను వాతావరణంలోకి ఈ అగ్నిపర్వతం విడుదల చేస్తోందని చెప్పారు. అగ్నిపర్వత వాయువులలో బంగారం దొరకడం పూర్తిగా అసాధారణ విషయమేమీ కాదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. హవాయిలోని కిలావుయా, ఇటలీలోని మౌంట్ ఎట్నా, అలాస్కాలోని ఆగస్టీన్, మెక్సికోలోని ఎల్ చిచోన్ వంటి అగ్నిపర్వతాల వద్ద కూడా స్వల్ప మొత్తంలో బంగారాన్ని గుర్తించామన్నారు.

# సంక్షిప్త వార్తలు

## వెనెజులా భూకంపంలో 58వేల భవనాలు ధ్వంసం



**కారకస్, జూన్ 30:** ఇటీవల సంభవించిన జంట భూకంపాలు వెనుజులాకు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఆ దేశంలో 58 వేలకుపైగా భవనాలు ధ్వంసమైనట్లు నాసా అంచనా వేసింది. జూన్ 25న సేకరించిన ఉపగ్రహ డేటా ఆధారంగా ఈ లెక్కలు వెల్లడించింది. క్షేత్రస్థాయిలో విధ్వంస ప్రభావాన్ని అంచనా వేసి, సహాయక బృందానికి మార్గనిర్దేశం చేసేందుకు ఈ శాటిలైట్ డేటా ఉపయోగపడుతుందని నాసా పేర్కొంది. అయితే.. 855 భవనాలు దెబ్బతిన్నాయని, వాటిలో 189 పూర్తిగా ధ్వంసమయ్యాయని వెనుజులా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ వెల్లడించడం గమనార్హం. ఈ భవన శిథిలాల కింద వేల సంఖ్యలో ప్రజలు చిక్కుకుని ఉంటారనే ఆందోళన నెలకొంది. వారిని బయటకు తీసినా ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. సమాచార లోటును ఈ గ్రూప్‌లు భర్తీ చేస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు.

## 37కేజీల బంగారం సీజ్: గువాహటిలో ఒకరి అరెస్టు

**గువాహటి, జూన్ 30:** గువాహటిలో అసోం పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో దాదాపు రూ.55 కోట్ల విలువైన 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వ్యక్తిని మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాకు చెందిన అక్షయ్ భన్సోరేగా గుర్తించారు. లతాసిల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. ఖచ్చితమైన సమాచారం ఆధారంగా చేపట్టిన పోలీసు ఆపరేషన్‌లో ఈ బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్) సంభవి మిశ్రా తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు, దర్యాప్తులో భాగంగా దానిని పరిశీలిస్తున్నారు.

## తమిళనాడులో ఇక అన్నీ ఎసి బస్సులే




**చెన్నై,జూన్ 30:** తమిళనాడులో ఇకపై ప్రభుత్వం కొనుగోలు చేసే కొత్త బస్సులన్నీ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యంతోనే ఉండనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్థిబన్ తెలిపారు. ప్రజలు సౌకర్యంగా ప్రయాణించేలా ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పార్థిబన్ తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం చేరాలన్నది సిఎం లక్ష్యమనిచెప్పారు. ప్రతి కొత్త బస్సులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు ఉండాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలని సూచించినట్లు వెల్లడించారు.

## బెంగాల్‌లో నాఫ్తా పైప్‌లైన్‌లో భారీ పేలుడు

**హాల్దియా,జూన్ 30:** పశ్చిమ బెంగాల్‌లో ఉన్న నాఫ్తా పైప్‌లైన్‌లో పేలుడు ఘటన జరిగింది. పుర్బా మిద్నాపూర్ జిల్లాలోని హాల్దియా పెట్రోకెమికల్స్ సంస్థకు చెందిన పైప్‌లైన్ అగ్నిప్రమాదానికి గురైనట్లు అదికారులు చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆ ప్రమాదంలో 20 మంది గాయపడ్డారు. హాల్దియా మున్సిపాల్టీలోని 13వ వార్డులో ఉన్న కొన్ని ఇండ్లు ఆ మంటలకు ధ్వంసం అయ్యాయి. 12 ఫైరింజిన్లు మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశాయి. ప్రమాద సమయంలో సమీపంలో ఉన్న కార్మికులకు కాలిన గాయాలు అయ్యాయి. విషమంగా ఉన్న వారిని కోల్‌కతా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంటల్ని అదుపులోకి తెచ్చినట్లు పోలీసులు చెప్పారు.

## పాక్ మాజీ ప్రధానికి ఇస్లామాబాద్ హైకోర్టులో ఊరట

**ఇస్లామాబాద్,జూన్ 30:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు అల్‌ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో ఇస్లామాబాద్ హైకోర్టు నుంచి ఊరట లభించింది. ఈ కేసులో తమకు పడిన శిక్షను సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన అప్పీల్‌పై తుది వాదనలు వినిపించడానికి కోర్టు రెండు వారాల గడువు మంజూరు చేసింది. దీంతో ఈ వివాదాస్పద కేసులో ఇమ్రాన్ ఖాన్ భవిష్యత్తు మరికొన్ని రోజుల్లో తేలనుంది. ఇస్లామాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆమిర్ ఫారూఖ్, జస్టిస్ మియాంగుల్ హసన్ ఔరంగజేబ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ అప్పీళ్లపై విచారణ చేపట్టింది.

# మూడు నెలల్లో మూడు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

## ముమ్మరంగా కొనసాగుతున్న నిర్మాణ పనులు

## 15 స్కూళ్లను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు

## మరో 40 స్కూళ్లకు ప్రతిపాదనలు పూర్తి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లో భాగంగా త్వరలో మరో మూడు స్కూల్స్ ను ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆరుట్లలో టిపిఎస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. త్వరలోనే మరో మూడు టిపిఎస్‌లను ప్రారంభించనున్నారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టిపిఎస్) ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కూడా ఇలాంటి పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పై ప్రత్యేక దృష్టి సారించింది. వీటిలో ఆరుట్ల టిపిఎస్ మినహా మంచాల, వంగూరు, పోల్కంపల్లి టిపిఎస్‌లపై ఫోకస్ చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయాలని విద్యా కమిషన్‌కు సూచించారు. దీంతో తెలంగాణ విద్యా కమిషన్ మూడు నెలల టైమ్‌బౌండ్ ప్రణాళికతో యుద్ధ ప్రాతిపదికన పనులను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వంగూరు, పోల్కంపల్లి, మంచాల టిపిఎస్‌లలో ఆధునిక తరగతి గదులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, పరిశుభ్రమైన క్యాంపస్ వాతావరణం వంటి అన్ని మౌలిక సదుపాయాలతో ఈ పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా అధికారులు వేగంగా పని చేస్తున్నారు. వంగూరు, మంచాల, పోల్కంపల్లి టిపిఎస్‌లలో నిర్మాణ పనులు, నాణ్యత, టైమ్‌లైన్ అమలును నిరంతరం పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా కమిషన్ సభ్యులు పూర్తి పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వంగూరు టిపిఎస్ పర్యవేక్షణ బాధ్యతలను డాక్టర్ చారకొండ వెంకటేష్, మంచాల టిపిఎస్ పనులను జోష్నా శివారెడ్డి, పోల్కంపల్లి టిపిఎస్ నిర్మాణాలను ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు నేరుగా పర్యవేక్షి స్తున్నారు.

మరో మూడు నెలల్లో ఈ మూడు పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న నేపథ్యంలో విద్యా కమిషన్ ఆయా ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. దీని కోసం అక్కడ సాగుతున్న నిర్మాణ పనులను విభజించి, స్కూల్ ప్రిన్సిపల్ నేతృత్వంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులకు పనుల విభజన చేస్తోంది. ప్రతి పనికి ముగ్గురు చొప్పున ఎస్ఎంసీ సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిర్మాణాల పురోగతి, నాణ్యత, అవసరమైన సదుపాయాల కల్పనను ఎప్పటికప్పుడు సమీక్షి ంచేలా నిర్ణయం తీసుకుంది. ఎక్కడా జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రతి నిర్మాణ దశకు ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించి ఎస్ఎంసీ సభ్యులను మానిటరింగ్ చేస్తోంది. ఇప్పటికే 15 టిపిఎస్ స్కూల్స్ ఏర్పాటుపై విద్యాశాఖ అధికారులు, ఈడబ్ల్యూఐడీసీ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. మరో 15 స్కూల్స్ ఏర్పాటుకి సంబంధించి పరిశీలన కొనసాగుతోంది. ఈ ఏడాదిలోగా సుమారు 40 టిపిఎస్‌ల పనులను ప్రారంభించేలా విద్యాశాఖ అధికారులు ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో కలిపి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

# యాచారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## మంత్రి దామోదర రాజనర్సింహకు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** యాచారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆయన మంగళవారం లేఖ రాశారు. యాచారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది కొరత, నిధుల దుర్వినియోగంపై తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య వ్యవస్థను తీరుతెన్నులు తెలుసుకోవడానికి రంగారెడ్డి జిల్లా సీపీఎం బృందంతో కలసి తాను జూన్ 25న యాచారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించానన్నారు. యాచారం ఆసుపత్రి సందర్శనలో తమ బృందం గుర్తించిన సమస్యలను మీ దృష్టికి తెస్తున్నానని, వాటిని పరిష్కారించాలని లేఖలో కోరారు. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్ లేకపోవడం వల్ల అత్యవసర సమయంలో రోగులు దిక్కులేని స్థితిలో ఉంటున్నారన్నారు. తాగునీరు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మందుల నిల్వకు ఫ్రిడ్జ్‌లు లేవని, పారిశుధ్య లోపం వల్ల టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న 39 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, భవన నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా అవినీతిపై విచారణ జరిపించాలని మంత్రికి రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు.

# నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ 12

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** వీధి బాలలు, తప్పిపోయిన చిన్నారులను గుర్తించేందుకు ఉద్దేశించిన ఆపరేషన్ ముస్కాన్ 12 బుధవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సిఐడి డిజి చారు సిన్హా మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించడంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్‌పిలు, పోలీసు కమిషనర్ల సహా ఇందులో పాల్గొంటున్న ఎన్‌జిఒ సంస్థల ప్రతినిధులు, భాగస్వామ్య సంస్థల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ 12 జూలై నెలాఖరు వరకు కొనసాగుతుందని తెలిపారు. కనిపించకుండా పోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో ఆపరేషన్ ముస్కాన్ కీలకంగా వ్యవహారిస్తుందని ఆమె తెలిపారు. కుటుంబాల చెంతచేరని వారిని చైల్డ్ హోంలకు తరలించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామని ఆమె తెలిపారు. ఈ క్రమంలో వారికి మంచి విద్యను అందిస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమం ఒక మంచి ఉద్దేశంతో చేబడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అన్ని విభాగాల అధికారులు, ఇతర సిబ్బంది కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో డిఐజి పరిమళ హన్నా నూతన్‌తో పాటు స్త్రీ శిశు సంక్షేమ విభాగం కమిషనర్ వెంకట మల్లిక్ సహా ఇతర అధి కారులు పాల్గొన్నారు.

# టిఎస్ఎస్‌పిని మరింత ఆధునీకరించాలి

## ఫ్యూచర్ సిటీ, ఆమన్‌గల్‌లో కొత్త బెటాలియన్ల ఏర్పాటు

## స్పెషల్ పోలీసు బెటాలియన్ల ఉన్నతాధికారుల సమీక్షలో డిజిపి ఆనంద్




మంగళవారం టిఎస్ఎస్‌పి విభాగం ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డిజిపి సివి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగం (టిఎస్ఎస్‌పి)ని మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆధునీకరించాలని ఆ విభాగం ఉన్నతాధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణలో స్థానిక పోలీసులకు సహకరించడం, విపత్తుల నిర్వ హణలో కీలకంగా వుండడం, విఐపి బందోబస్తులో నిరంతరం పాల్గొనడం, ప్రత్యేక ఆపరేషన్లలో పాలు పంచుకోవడంలో ముఖ్య భూమిక వహిస్తున్న ఘనత టిఎస్ఎస్‌పి సిబ్బందిదేనని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని టిఎస్ఎస్‌పి విభాగం హెడ్‌క్వార్టర్స్‌ను డిజిపి ఆనంద్ మంగళవారం సందర్శించారు.

ఈ సందర్భంగా టిఎస్ఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్ సహా ఇతర ఉన్నతాధికారులతో డిజిపి సమీక్ష నిర్వ హించారు. టిఎస్ ఎస్‌పి భవిష్యత్ అవసరాలకు అనుగు ణంగా సాంకేతికంగా ఉన్నత స్థాయికి ఎదగా లని డిజిపి ఆకాంక్షించారు. ఈ విభాగం లో ఖాళీగా వున్న పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, వాహనాల సంఖ్యను పెంచేలా చూడాలని ఆయన సూచించారు. టిఎస్ఎస్‌పి బెటాలియన్లలో గల సిబ్బంది క్వార్టర్స్ సవ్యంగా వుండేలా చూడాలని, ఇక్కడ మౌలిక వసతులు సరిగ్గా వుండాలని డిజిపి ఆదేశిం చారు.

బెటాలియన్లలో పనిచేసే సిబ్బంది సంక్షేమం సరిగ్గా వుండాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని డిజిపి ఆదేశించారు. ఉమ్మడి ఎపి హయాంలో ఎపిఎస్‌పిగా వున్న ఇప్పటి టిఎస్ఎస్‌పి నక్సల్స్ ఆపరేషన్లలో విజయవంతంగా పాల్గొని ఎన్నో విజయాలను సాధించిందని ఆయన అన్నారు. నక్సలైట్ల సమస్య తీవ్రంగా వున్న సమయంలో ఈ విభాగం సిబ్బంది చూపిన తెగువ ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. తాను వరంగల్, నిజామాబాద్ వంటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో పనిచేసిన సమయంలో ఈ విభాగం సిబ్బంది స్థానిక పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచేవారని డిజిపి తెలిపారు. అప్పట్లో తరచూ పోలీసు స్టేషన్లపై నక్సలైట్లు దాడులు చేసేవారని, వీటిని స్పెషల్ పోలీసులు వి జయవంతంగా తిప్పికొట్టేవారని డిజిపి తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత ఇప్పుడు 13 బెటాలియన్లు మనకు వున్నాయని, వీటిని రాష్ట్రావసరా లకు అనుగుణంగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. గత ఏడాది నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో కురిసిన వర్షాల సమయంలో టిఎస్ఎస్‌పి సిబ్బంది వరద ప్రాంతాలలో అమోఘంగా సేవలందించారని డిజిపి కొనియాడారు.

ఈ విభాగం సిబ్బంది విధి నిర్వహణలో రాణిస్తూనే తమ కుటుంబాల బాధ్యతలను చూసుకోవాలని డిజిపి సూచించారు. బెటాలియన్ల సిబ్బంది విధుల కేటాయింపులో పారదర్శకంగా వుండాలని ఉన్నతా ధికారులను డిజిపి ఆదేశించారు. ఎలాంటి సమస్యలు, ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. గతంలో వున్నట్లుగా ఇప్పుడు న క్సలైట్ల సమస్య లేందున ఉన్నతాధికారులు ప్రతీ బెటాలియన్ పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆయన కోరారు. భవిష్యత్ అవరా ల కోసం ఫ్యూచర్ సిటీ ఆమన్‌గల్ ప్రాంతాలలో కొత్తగా బెటాలియన్ల ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు డిజిపి తెలిపారు. అంతకు ముందు టిఎస్ ఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్ తమ విభాగం పనితీరు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో ఈ విభాగం డిఐజిలతోపాటు బెటాలియన్ల కమాండంట్లు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ రెండో విడత అడ్మిషన్లు

## 31 వరకు ప్రవేశాలకు గడువు

## ఇంటర్ బోర్డు ప్రకటన

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరంలో నేటి(బుధవారం) నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ నెల 31 వరకు అడ్మిషన్ల స్వీకరణకు తుది గడువుగా ఇంటర్ బోర్డు ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో జనరల్, వొకేషనల్ విభాగాలలో రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సును అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, కోపరేటివ్, టి.జి. రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్, బి.సి. సంక్షేమ రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, కె.జి.బి.వి, టి.జి. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు, కాంపోజిట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. మొదటి విడతలో భాగంగా మే 8 నుంచి 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. తరగతులను జూన్ 1 నుంచి ప్రారంభించారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను మంగళవారం(జూన్ 30)తో ముగించారు. నేటి(బుధవారం) నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. అడ్మిషన్ల సందర్భంగా ప్రిన్సిపాల్‌లు ఇంటర్నెట్ మార్క్స్ మెమోల ఆధారంగా తాత్కాలిక ప్రవేశాలు కల్పించడానికి అనుమతి ఇచ్చారు. మొదటి విడతలో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 62వేల మంది చేరినట్టు తెలిసింది.

# నేటి నుంచి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తులు ప్రారంభం

## ఆగస్టు 31 వరకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకము క్రింద ఎస్సీ విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తులను నేటి(బుధవారం) నుంచి స్వీకరించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరమునకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకమునకు సంబందించి రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులు ఉపకార వేతనముల కొరకు దర ఖాస్తు చేసుకోవడానికి మంగళవారం(జులై 1) నుంచి ఆగస్టు 31 అవకాశం కల్పించినట్టు ఎస్‌సిడిడి శాఖ తెలిపింది. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటనలో సూచించారు.

# సిఎం ప్రజావాణి చొరవతో చిన్నారికి పునర్జన్మ

## రూ. 6 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన చిన్నారెడ్డి

## సిఎంకు చిన్నారి కుటుంబసభ్యుల కృతజ్ఞతలు



సిఎం ప్రజావాణిలో చిన్నారి తండ్రి భానోత్ శ్రీనుకు సిఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 30, ప్రభాతవార్త:** సిఎం ప్రజావాణీ చొరవతో 17నెలల చిన్నారికి పునర్జన్మ లభిం చింది. శ్వాసకోశ ఇబ్బందులు, నిమోనియా వంటి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారికి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి ఫీజు తగ్గేలా చేసి ఆ చిన్నారి తల్లి దండ్రులకు అండగా నిల్చింది.సీఎం ప్రజా వాణి. మహబూబాబాద్ జిల్లా కే సముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన బానోత్ శ్రీను క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు.అతని భార్య అంజలి దంపతుల 17నెలల కుమారుడు వైష్ణవ్ నందన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు.దీంతో అతని ఆరోగ్యం క్షీణించింది.గత జనవరి 7న ఆ కుటుంబం సీఎం ప్రజావాణీకి వచ్చి వారి సమస్యను వివరించారు.సీఎం ప్రజావాణీ బృందం చొరవ తీసుకుని చిన్నారికి ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందేలా చూసారు.సీఎం ఆర్ ఎఫ్ కింద 6లక్షల రూపాయల చెక్ ను అందించారు.ఈ సందర్భంగా చిన్నారి కుటుంబం సీఎం రేవంత్‌రెడ్డి,సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లకు చిన్నారి తల్లి దండ్రులు భానోత్ శ్రీను అంజలి ధన్యవాదాలు తెలియజేసారు.

# వేగవంతమైన, పారదర్శక విద్యుత్ సేవలు

## సమగ్ర నెట్‌వర్క్ మ్యాపింగ్ ప్రారంభం

## దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితీష్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్యుత్ అంతరాయాలను వేగంగా గుర్తించడం, వినియోగదారులకు సత్వర సేవలు అందించడం లక్ష్యంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సమగ్ర విద్యుత్ నెట్‌వర్క్ మ్యాపింగ్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ సిఎండి జితీష్ వి. పాటిల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో జూలై 1 నుండి తొలి దశలో ఈ కార్యక్రమాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో అమలు చేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ రంగాన్ని సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసి, వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 132/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ల నుంచి 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు), చివరకు ప్రతి వినియోగదారుడి సర్వీస్ కనెక్షన్ వరకు పూర్తి విద్యుత్ నెట్‌వర్క్ అనుసంధానాన్ని డిజిటల్ రూపంలో ఖచ్చితంగా నమోదు చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వినియోగదారుల సర్వీసులు, సంబంధిత డీటీఆర్‌లు, ఫీడర్ల మధ్య అనుసంధాన వివరాలు పూర్తిస్థాయిలో డిజిటల్ మ్యాపింగ్ కాలేదని, ఈ కార్యక్రమం ద్వారా ఆ లోటును పూర్తిగా తొలగించి, విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత ఆధునీకరిస్తామన్నారు. ఈ మ్యాపింగ్ పూర్తయిన తర్వాత ఒక వినియోగదారుడి ఇంటికి విద్యుత్ ఏ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి, ఏ 33 కేవీ ఫీడర్ ద్వారా, ఏ 11 కేవీ ఫీడర్ ద్వారా, ఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా చేరుతుందనే పూర్తి సమాచారం ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. బిల్లింగ్ ప్రక్రియలో మీటర్ రీడర్లు ప్రతి డీటీఆర్‌ను సందర్శించి, ఆయా ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానమైన వినియోగదారుల సర్వీసులను ఖచ్చితంగా మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలులోకి వచ్చిన తరువాత విద్యుత్ అంతరాయాలను మరింత వేగంగా గుర్తించడం సాధ్యమవుతుందన్నారు. వినియోగదారుడు 1912 కాల్ సెంటర్, టీజీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్, వాట్సాప్, వెబ్ పోర్టల్ లేదా ఇతర డిజిటల్ వేదికల ద్వారా ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే ఆ సర్వీస్ ఏ డీటీఆర్‌కు, ఏ ఫీడర్‌కు అనుసంధానమై ఉందో వ్యవస్థ స్వయంచాలకంగా గుర్తిస్తుందని తెలియచేశారు. దీంతో సమస్య 33 కేవీ ఫీడర్ స్థాయిలో ఉందా, 11 కేవీ ఫీడర్ వద్ద ఉందా, డీటీఆర్ వద్ద ఉందా లేదా వ్యక్తిగత సర్వీస్ కనెక్షన్ వద్ద ఉందా అనే విషయం తక్షణమే నిర్ధారణ అవుతుందని, ఫలితంగా ఫిర్యాదుల పరిష్కార సమయం గణనీయంగా తగ్గి, విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించబడుతుందని చెప్పారు. అలాగే విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలు, పునరుద్ధరణకు పట్టే అంచనా సమయం వంటి వివరాలను వినియోగదారులకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించే అవకాశం కలుగుతుందన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కేసుల విచారణ 6కి వాయిదా

## అప్పటి వరకు మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉంటాయన్న హైకోర్టు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత నెలలో విచారణ సందర్భంగా మంగళవారం(జూన్30)కి వాయిదా వేయగా.. మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు ఈ నెల 6కి వాయిదా వేసింది.

ఔ విచారణ సందర్భంగా గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు ఈ నెల 6 వరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలో విచారణ సందర్భంగా రీయింబర్స్‌మెంట్‌కి సంబంధించి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కొన్ని ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్9లోని 4 నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించిన విషయం తెలిసిందే. అపుడు హైకోర్టు జారీ చేసిన ఆ మధ్యంతర ఉత్తర్వులు ఈ నెల 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# 'సిగాచి' ఘటన చరిత్రలో దుర్దినం

## ప్రభుత్వ నియంత్రణ వైఫల్యం వల్లే

## దారుణం: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 30:** తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిరక్ష ్యల్ల కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. మృతదేహాల సాక్షి గా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818హెచ్‌పికి అనుమతి తీసుకుని 1777 హెచ్‌పి నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ ఎన్‌ఓసి, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాల్లు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ^మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

# ఎన్టీఆర్ జీవిత చరిత్ర నవతరానికి పాఠ్యాంశం కావాలి

## నన్ను తన మంత్రివర్గంలో చేరమంటే సున్నితంగా తిరస్కరించా : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




మంగళవారం త్యాగరాయగానసభలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు టిడి జనార్దన్‌కు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, చిత్రంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, ఎంకె.రాము తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జూన్ 30, ప్రభాతవార్త:** మహోన్నత పరిపాలనాదక్షుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు జీవిత చరిత్రను నేటి యువతరానికి, పిల్లలకు పాఠ్యాంశంగా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్దన్ కు ఎన్టీఆర్ పురస్కారాన్ని ప్రధానం చేసి ప్రసంగించారు. నాటి రాజకీయ శూన్యతను భర్తీ చేస్తూ ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనం దేశ చరిత్రలోనే అపూర్వమైనదన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం జనాన్ని విపరీతంగా ప్రభావితం చేశాయని, అందుకే పార్టీ పెట్టిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించారని కొనియాడారు. జనం గురించి, వారి జీవన ప్రమాణాల్లో మార్పుల గురించి ఎన్టీఆర్ నిరంతరం తపించారని వెంకయ్యనాయుడు అన్నారు. ముఖ్యంగా సమాజంలో మహిళలకు సమానమైన అవకాశాలు కల్పించడంతో పాటు, వెనుకబడిన తరగతులకు (బీసీలకు) ఆయన రాజకీయంగా, సామాజికంగా వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. తెలుగు భాష పట్ల ఎన్టీఆర్‌కు ఉన్న ప్రేమ అనన్యసామాన్యమైనదని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ అమ్మ భాషలోనే మాట్లాడాలని, ఎవరి భాషను వారు గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. అయితే ప్రస్తుత రాజకీయాల్లో విలువలు పూర్తిగా పడి పోతుండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ రోజుల్లో నాయకులు ఏ భాష మాట్లాడుతున్నారో మనం చూస్తూనే ఉన్నాం. రాజకీయాల్లో భాషా సంస్కారం కరువైంది. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతున్న తీరు ఎంతగానో బాధ కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వ్యక్తిగతంగా నన్ను కలిసి నా మంత్రి వర్గంలో చేరండి అని ఆహ్వానించారు. కానీ నేను ఆ ఆహ్వానాన్ని సున్ని తంగా తిరస్కరించాను' అని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ ఎల్లప్పుడూ ఒక గొప్ప జాతీయవాదిగా నిలిచారని అన్నారు. రాజకీయంగా ఎన్ని వైషమ్యాలు, భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటేననే భావన ఉండాలని వెంకయ్యనాయుడు హితవు పలికారు.

నాకు 77 ఏళ్లు నిండాయి. నేను పదవీ విరమణ మాత్రమే చేశాను.. కానీ సమాజం పట్ల, ప్రజా సమస్యల పట్ల పెదవి విరమణ చేయలేదు అని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. అద్భుతమైన మహానాయకుడైన ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని అందించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలా చారి అన్నారు. తాను ఈ స్థాయికి రావడానికి కారణం టీడీపీ అని, అక్కడి నుండి తాను ఓనమాలు నేర్చుకున్నానని అన్నారు. అనంతరం టిడి జనార్దన్ తెలుగుదేశం పార్టీతో దశాబ్దకాలంగా ఉన్న సాగిన వైనం తదితర అంశాలను ప్రస్తావించారు. హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి, విశ్రాంత ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ యం. నరసింహప్ప, ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెలుగు వన్.కామ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ కంఠమ నేని రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.కె. రాము రచించిన నందమూరి నవోదయం సంగీత నృత్యోత్సవంలో భాగంగా జరిగే నృత్య రూపకంలో స్థానిక బాలికలు, నృత్య కళాకారిణులు ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

## యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటు

### చైర్మన్‌గా మన్నె సత్యనారాయణరెడ్డి, సభ్యులుగా చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 30:** యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా మన్నె సత్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఎంఎస్ఎన్ (ఫార్మా) గ్రూప్ చైర్మన్ అయిన సత్యనారాయణ రెడ్డికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం దేవాదాయ ముఖ్య కార్యదర్శి


మన్నె సత్యనారాయణరెడ్డి, కొణిదెల సురేఖ, వినోద్ వెంకటస్వామి

శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలానే 10 మంది బోర్డు సభ్యులను, ఏడుగురు ఎక్స్ అఫీషియో సభ్యుల పేర్లను నియామకం చేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొణిదల సురేఖ(మెగాస్టార్ చిరంజీవి సతీమణి), చిలప్పగారి విజయరాజం, తూళ్ల విజయేందర్(మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ కుమారుడు), పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య,, స్వాతి కాంతామణి, ఎం. రాఘవేంద్ర రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, ట్రస్టీ వ్యవస్థాపకులు నియమితులయ్యారు. ట్రస్ట్ బోర్డులో ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, వైటిడిఏ వైస్ చైర్మన్, ఆలయ ఈవో, ప్రధాన అర్చకుడు ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

## హైకోర్టులో బండి భగీరథ్ బెయిల్ పిటిషన్.. నేడు విచారణ

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనకు సంబంధించి పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో రిమాండులో వున్న బండి భగీరథ్ హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. మే నెల 16వ తేదీన అరెస్టయిన భగీరథ్‌కు ఇటీవలే ఇంజనీరింగ్ పరీక్షల కోసం ఐదు రోజుల మధ్యంతర బెయిల్ లభించడం తెలిసిందే. గత గురువారం నాడు లొ ంగిపోగా తిరిగి జైలుకు వెళ్లాడు. మేడ్చల్ కోర్టు భగీరథ్ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో అతను హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్ పై బుధవారం హైకోర్టు విచారణ చేబట్టనుంది.

## గురుకులాల్లో నాణ్యమైన విద్యతోపాటు వసతులకూ ప్రాధాన్యం

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యతోపాటు వసతుల అభివృద్ధికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం టీజీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్‌లో నూతన మినీ బ్లాక్‌ను మంత్రి ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో




పాటు ఆధునిక మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సొసైటీ పరిధిలో నిర్మించిన నూతన మినీ బ్లాక్ భవనాన్ని మంత్రి అడ్లూరి ప్రారంభించారు. బ్లాక్‌లోని సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురుకుల విద్యాసంస్థలను దేశంలోనే ఆదర్శ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా విస్తరిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు మెరుగైన బోధన వాతావరణంతోపాటు విద్యా, పరిపాలనా కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యా నాణ్యతతో పాటు వసతుల అభివృద్ధికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ (ఎఫ్ఏసీ) కార్యదర్శి కంభంపాటి శారద, జాయింట్ సెక్రెటరీ (అకడమిక్స్) సక్రు నాయక్, అడిషనల్ సెక్రటరీ(ఫైనాన్స్) విజయలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ నీతిది(అడ్మిన్) డి.శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## వెబ్‌సైట్ మొరాయింపు: 5 రోజులుగా 'స్టాంప్స్' సేవలు బంద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** గత ఐదు రోజులుగా మెయింటెనెన్స్ పేరిట తెలంగాణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, అడ్వకేట్లకు సంబంధించిన వివిధ దస్తావేజులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, కోర్టు వ్యవహారాలకు అవసరమైన స్టాంప్ పేపర్లు అందుబాటులో లేకపోవడంతో అనేక పనులు స్తంభించి పోయాయి. వెబ్‌సైట్ తెరుచుకోకపోడంతో స్టాంప్ పేపర్ల అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. హైకోర్టు పరిసర ప్రాంతాలు, రంగారెడ్డి కోర్టు, సిటీ సివిల్ కోర్టు తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా కనిపిస్తోంది.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అక్బరుద్దీన్ ఒవైసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిశారు. తన కుమార్తె వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానపత్రాన్ని అందించారు.

## మొకిలా లేఅవుట్ ఇ-వేలానికి భారీ స్పందన

### హెచ్ఎండిఎకు రూ.231.65 కోట్ల ఆదాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) మొకిలా లేఅవుట్‌లోని 100 నివాస ప్లాట్లకు నిర్వహించిన ..మూడో దశ ఈవేలంకు గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ వేలంలో హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బిడ్డర్లు పాల్గొన్నారు. హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లపై మార్కెట్‌లో ఉన్న విశ్వాసంతో పాటు, ప్రణాళికాబద్ధమైన నివాస ప్రాజెక్టులపై పెరుగుతున్న డిమాండ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది. మూడో దశ ఈవేలంలో వేలానికి ఉంచిన మొత్తం 100 ప్లాట్లు పూర్తిగా విక్రయించబడ్డాయి. గరిష్ఠంగా చదరపు గజానికి రూ.1,09,500 బిడ్ నమోదు కాగా, సగటు బిడ్ ధర చదరపు గజానికి రూ. 75,640గా నమోదైంది. ఈ వేలం ద్వారా హెచ్ఎండీఏకు సుమారు రూ. 231.65 కోట్ల ఆదాయం సమకూరింది. మొకిలా ప్రాంతం పెట్టుబడులకు ఎంత ఆకర్షణీయమైనదో ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. వేలం సందర్భంగా బిడ్డర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అనేక ప్లాట్లకు పలువురు బిడ్డర్లు పోటీ పడటం విశేషం. ఈ విజయవంతమైన ఈ వేలం ద్వారా హైదరాబాద్ పశ్చిమ అభివృద్ధి కారిడార్‌లో అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు మరింత వేగవంతం అవుతాయని హెచ్ఎండిఏ ఆశాభావం వ్యక్తం చేసింది.

# రుతుపవనాల ఉధృతి.. దేశవ్యాప్తంగా ముసురు

### 23 రాష్ట్రాల్లో అతి భారీవర్షాలు
### ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు హైఅలర్ట్
### వాతావరణ శాఖ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార:** దేశంలో నైరుతి రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చాయి. దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో, రాబోయే 24 నుంచి 72 గంటల్లో దేశం లోని 23 రాష్ట్రాలకు భారీ నుంచి అతి భారీవర్షాల హెచ్చరికలను మంగళ వారం భారత వాతావరణ శాఖ (ఐఎండి) జారీ చేసింది. రుతుపవనాల ఉత్తర సరిహద్దు ప్రస్తుతం గుజరాత్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్ మరియు నేపాల్ సరిహద్దుల వరకు విస్తరించింది. రాబోయే రెండు రోజుల్లో ఇవి గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. అదనంగా, జూలై 2 నుండి ఒక కొత్త పశ్చిమ అవాంతరం క్రియాశీలకం కానుండటంతో వాయువ్య భారతదేశంలో వర్షాల తీవ్రత మరింత పెరగనుందని తెలిపింది. అలాగే జాతీయ రాజధాని ప్రాంతంలో గత కొన్ని రోజులుగా వేధిస్తున్న తీవ్రమైన వేడి, తేమ నుండి ప్రజలకు ఉపశమనం లభించనుంది. జూన్ 30న ఆకాశం మేఘావృతమై కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయి. జూలై 1 నుండి జూలై 4 మధ్య వర్షాలు మరింత విస్తృతంగా కురిసే అవకాశం ఉండటంతో, గరిష్ట ఉష్ణోగ్రతలు 5 ది నుండి 6 ది వరకు తగ్గుతాయి. అయితే, వాతావరణంలో పూర్తి మార్పు వచ్చే వరకు జూన్ 30 వరకు కొన్ని చోట్ల వడగాడ్పుల ప్రభావం ఉండవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక ఉత్తర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు పూర్తిస్థాయిలో చురుకుగా మారాయని ఐఎండి తెలిపింది. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో జూన్ 30 నుండి జూలై 3 వరకు, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో జూలై 2 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. అటు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జూలై 5 వరకు కొండ ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. దీనివల్ల కొండచరియలు విరిగిపడటం, రహదారులు మూసుకుపోవడం, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని ఐఎమ్‌డి హెచ్చరించింది. చార్ ధామ్ యాత్రికులు తమ ప్రయాణాలకు ముందు వాతావరణ సమాచారాన్ని తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఇటు బీహార్‌లోని ఉత్తర, మధ్య జిల్లాల్లో రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయి. ఈ వర్షాలు ఖరీఫ్ పంటల సాగుకు ఎంతో మేలు చేయనున్నాయి. అయితే, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మెరుపులు వచ్చేటప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని అధికారులు హెచ్చరించారు. జార్ఖండ్‌లోని గనుల, కొండ ప్రాంతాల్లో నదుల నీటిమట్టం పెరిగే అవకాశం ఉండటంతో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అంతేకాకుండా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, విదర్భ, మహారాష్ట్రలలో రుతుపవనాలు చురుగ్గా కదులుఉన్నాయి. జూలై 3 తర్వాత కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దక్షిణ భారతదేశంలో కేరళ, కర్ణాటక తీరప్రాంతాలలో అతి భారీ వర్షాలు, తెలంగాణ, తమిళనాడులలో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయి. అలాగే, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లలో రాబోయే కొద్దిరోజుల పాటు విస్తారంగా వర్షాలు కొనసాగుతాయి. అస్సాం, మేఘాలయ, బీహార్, కేరళ, కొంకణ్ రాష్ట్రాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయిని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణ, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముంది. రాబోయే రెండు నుంచి ఐదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ మరియు జమ్మూ కాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లోకి మరింతగా విస్తరించే అవకాశం ఉంది. జూలై 2 నుంచి ఏర్పడనున్న కొత్త పశ్చిమ అవాంతరం కారణంగా వాయువ్య భారతదేశం అంతటా వర్షపాతం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

# అన్నదాతల కోసం రూ.1,56,496 కోట్ల ఖర్చు

### నిరంతరాయంగా రైతు భరోసా: డిసిఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం రెండున్నరేళ్లలో తమ ప్రభుత్వం రూ.1,56,496 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అదే గత ప్రభుత్వ 12 ఏళ్ల హయంలో ఖర్చు చేసింది రూ.2,88,670 కోట్లు మాత్రమే అన్నారు. . హైదరాబాద్ శిల్పకళా వేదికలో మంగళవారం సాయంత్రం జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్థికంగా ఇన్ని చిక్కులున్నా, ఎక్కడా వెనకడుగు వేయకుండా రైతు సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ఆరు నూరైనా సరే రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని పునరుద్ఘాటించారు. రైతు రుణమాఫీ చేసిన తరహాలోనే సన్న వడ్లకు బోనస్ ఇచ్చినట్టుగానే తమ ప్రభుత్వం ఉన్నంత కాలం రైతు భరోసాను నిరంతరాయంగా కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. రైతులంతా వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వంపై అడ్డగోలుగా తప్పుడు ప్రచారాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులను కోరారు. రైతుల సంక్షేమ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంటే, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, అప్పుల ఊబిలోకి నెట్టిన మాజీ పాలకులకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్రంపై అడ్డగోలుగా అబద్ధపు కట్టుకథలు అల్లుతూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతాంగం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై అడ్డగోలుగా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల కోసం జరిగిన ఖర్చుతో పోలిస్తే, తమ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పనిచేస్తుందని గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతుల కోసం కేవలం రూ.2,88,670 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని చెప్పారు. ఈ లెక్కన నెలకు సగటున 2,532 కోట్లు, ఏడాదికి 30,364 కోట్లు మాత్రమే వ్యయం చేశారు కానీ, తమ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలోనే రూ.1,56,496 కోట్లను రైతుల కోసం ఖర్చు చేసిందని వెల్లడించారు. అంటే నెలకు 5,217 కోట్ల చొప్పున, ఏడాదికి 62,604 కోట్ల రూపాయలను రైతు సంక్షేమం కోసం వెచ్చిస్తున్నామని స్పష్టం చేశారు. ఇది గత పాలకులు ఖర్చు చేసిన దానికంటే రెట్టింపని తెలిపారు.



అలాగే గత పాలకులు తెచ్చిన 8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని తమ ప్రభుత్వం మోస్తోందని చెప్పారు. ఆ అప్పులకు సంబంధించి కేవలం రెండున్నర ఏళ్లలో రూ.2,08,557 కోట్లు బ్యాంకుల వడ్డీలు, అసలు చెల్లింపులకే ఖర్చు చేశామని పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ మన లక్ష్యం

### గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి
### నాణ్యమైన విద్య సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలి: రాష్ట్రపతి ముర్ము
### విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతాం
### విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఏపి మంత్రి లోకేష్


మంగళవారం విశాఖలో గిరిజన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపి మంత్రి లోకేష్

**విశాఖపట్నం జూన్ 30 ప్రభాతవార్త:** గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ పటిమను పెంపొందించే కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఎదగాలి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. మంగళవారం బీచ్ రోడ్‌లో గల హోటల్లో గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ఈ గిరిజన విశ్వవిద్యాలయానికి ఎన్నో ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని గుర్తుచేశారు. గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను విధాన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలను పెంపొందించే ఒక ప్రధాన కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం రూపాంతరం చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా ఏర్పాటైన ఇటువంటి సంస్థలు.. స్థానిక గిరిజన ప్రాంతాల విద్యా, వైద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అటవీ హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వెనుకబడిన, గిరిజన వర్గాల యువత సమగ్ర వికాసానికి, అలాగే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ఈ వర్సిటీ విశేష కృషి చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఘటికోత్సవం అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మైలురాయి లాంటిదని, ఇది కేవలం సంబరాల రోజే కాకుండా భవిష్యత్తుపై ఒక బలమైన నిర్ణయం తీసుకునే సందర్భమని రాష్ట్రపతి అన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న పర్యావరణం నుండి ప్రాక్టికల్ నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు.

2047వ సంవత్సరం నాటికి వికసిత భారత్‌ను సాధించడమే మన లక్ష్యమని, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఇక్కడి సమ్మిళిత, ప్రాక్టికల్ విద్యా విధానం ద్వారా ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ధీమా వ్యక్తం చేశారు. గిరిజన యువతకు ఆధునిక విద్యను అందించడం ద్వారా వారు దేశ సమానాభివృద్ధిలో భాగస్వాములు కాగలరని ఆమె ఆకాంక్షించారు. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# పిఎం కృషి సించాయ్ యోజన అమలుకు రైతులకు 30 నుండి 90 శాతం వరకు సబ్సిడీ

### రాష్ట్ర, జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీల నియామకం

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) పథకంలో అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్టీరింగ్ కమిటీలను నియమించింది. ఈ పథకంలో భాగంగా మోడ్రనైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్, వాటర్ మేనేజ్‌మెంట్ (ఎంసీఏడీ, డబ్ల్యూఎం) సబ్ స్కీమ్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోడల్ డిపార్ట్‌మెంట్, రాష్ట్ర, జిల్లాస్థాయిలో స్టీరింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం సీఏడీ, డబ్ల్యూఎం స్కీమ్‌ను అమలు చేయాలని ఏప్రిల్‌లో నిర్ణయించింది. అందుకోసం రాష్ట్ర, జిల్లా కమిటీలు, నోడల్ డిపార్ట్‌మెంట్‌ను నియమిం చాలని రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీలను నియమించింది. స్కీమ్ అమలు కోసం ఇరిగేషన్‌శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా, క్యాచ్‌మెంట్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీగా సీఈలు, నోడల్ ఆఫీసర్‌గా ఎస్ఈని నియమించింది.

స్కీమ్‌కు సంబంధించి ప్రణాళికల రూపకల్పన, ప్రాజెక్టుల ఎంపిక తదితర వాటికోసం స్టేట్‌లెవల్, జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీలను నియమించింది. కాగా కేంద్రం ప్రారంభించిన ఈ పీఎంకేఎస్‌వై జాతీయ వ్యవసాయ పథకంగా అమలు చేస్తోంది. దీని ప్రధాన లక్ష్యం ప్రతి నీటి చుక్కకు ఎక్కువ పంట సాధించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యాలను విస్తరించడం, నీటి వృథాను తగ్గించడం.

దేశంలో పెండింగ్‌లో ఉన్న భారీ మరియు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం. కొత్త నీటి వనరుల సృష్టి, చిన్న తరహా నీటిపారుదల సౌకర్యాలు మరియు కమాండ్ ఏరియా అభివృద్ధి. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం మరియు నేల కోతను నివారించడం వంటి ముఖ్యమైన అంశాలు అమలు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఈ పథకం ద్వారా రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు కొనుగోలు చేయడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 నుండి 90 శాతం వరకూ సబ్సిడీ అందిస్తాయి. బిందు, తుంపర్ల సేద్యం వంటి సూక్ష్మ నీటి పారుదల పద్ధతులను అమర్చుకునేందుకు రైతులకు ఆర్థిక సహాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

## 35 యేళ్ల తర్వాత మళ్లీ విచారణకు సరళాభట్ హత్యకేసు

**శ్రీనగర్, జూన్ 30:** కశ్మీరీ పండిట్ సామాజిక వర్గానికి చెందిన నర్స్ సరళా భట్ అపహరణ, హత్య కేసు 35 ఏళ్ల తర్వాత కీలక మలుపు తిరిగింది. జమ్మూకశ్మీర్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎస్ఏఐ) ఈ ఘటనపై దర్యాప్తును ముగించి, జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) చీఫ్ మహ్మద్ యాసిన్ మాలిక్‌తో పాటు మరికొందరిని నిందితులుగా చేరుస్తూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో 737 పేజీల భారీ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడానికి సిద్ధమైంది. లోయలో ఉగ్రవాదం తీవ్రస్థాయిలో ఉన్న కాలంలో జరిగిన ఈ ఘోరానికి సంబంధించిన దర్యాప్తులో ఇన్నాళ్లకు ఒక పెద్ద పురోగతి లభించింది. 1990 ఏప్రిల్ 18న శ్రీనగర్‌లోని షేర్‌ఇకశ్మీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌కేఐఎంఎస్) సమీపంలో నర్స్ సరళా భట్‌ను ఉగ్రవాదులు అపహరించారు. ఆ తర్వాత ఆమెను శారీరక హింసకు గురిచేసి, శ్రీనగర్ మాల్‌బాగ్‌లోని ఒమర్ కాలనీలో ఆటోమేటిక్ రైఫిల్స్‌తో కాల్చి అతి క్రూరంగా హత్య చేశారు. అప్పట్లో ఉగ్రవాద సంస్థలు సృష్టించిన బీభత్సం, భయాందోళనల కారణంగా సాక్షులు ఎవరూ ముందుకు రాకపోవడంతో దశాబ్దాలుగా ఈ కేసు ఒక మిస్టరీగానే ఉండిపోయింది.

## భారీగా తగ్గిన ముడిచమురు ధరలు

### బ్యారెల్‌కు 68.86 డాలర్లు మాత్రమే

**న్యూఢిల్లీ, జూన్ 30:** పశ్చిమాసియాలో సంక్షోభం మొదలైన తర్వాత మొట్టమొదటిసారిగా భారత్ దిగుమతి చేసుకునే ముడిచమురుసగటు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. ఈ తగ్గుదల ప్రయోజనం దేశంలోని వినియోగదారులకు వెంటనే అందే అవకాశం లేదు. గతంలో ఎదుర్కొన్న భారీ నష్టాలను చమురు మార్కెటింగ్ కంపెనీలు భర్తీచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. వినియోగదారులను ఆదుకునేందుకు భరించిన ఆర్థిక వ్యయంలో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం రాబట్టుకోవాలని భావిస్తోంది. ఈ కారణాలచేత ముడి చమురు తగ్గినా ఇప్పట్లో పెట్రోల్ , డీజిల్ రేట్లు తగ్గే అవకాశం కనిపించడం లేదు. సోమవారం నాటికి భారత క్రూడ్ ఆయిల్ బాస్కెట్ సగటు ధర బ్యారెల్‌కు 68.86 డాలర్లకు తగ్గింది. పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28న ఘర్షణలు మొదలైన తర్వాత మార్చి 23న గరిష్ఠంగా 157.04 డాలర్లకు చేరిన ధరతో పోలిస్తే ఇది 56 శాతం కంటే ఎక్కువ తగ్గుదల. ఈ పరిణామం ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థలకు కొంత ఊరటనిచ్చింది. ప్రస్తుతం ఈ కంపెనీలు పెట్రోల్‌పై లీటర్‌కు రూ.5 నుంచి రూ.6 వరకు లాభం పొందుతున్నప్పటికీ, డీజిల్ అమ్మకాలపై మాత్రం లీటర్‌కు రూ.8 నుంచి రూ.10 వరకు నష్టపోతూనే ఉన్నాయి. సంక్షోభ సమయంలో అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచడంవల్ల చమురు కంపెనీలు భారీ నష్టాలను చవిచూశాయి.

### రైతు భరోసా తొలిరోజు
## 14.65 లక్షల మందికి రూ.2,482 కోట్లు విడుదల

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం (ఖరీఫ్) సీజన్లో రైతులకు పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రైతు భరోసా ఆర్థికసాయం కింద మంగళవారం శిల్పాకళా వేదికగా సీఎం రేవంత్రెడ్డి విడుదల చేశారు. ఇందులో భాగంగా మొదటిరోజు రాష్ట్రంలోని మొత్తం 41.37 లక్షల మంది రైతుల ఖాతాలోకి రూ.2,482.02 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతుల కోసం రూ.878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72 లక్షల మంది రైతుల కోసం రూ.1,603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.

## స్పెయిన్‌లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి

**హైదరాబాద్ (అల్వాల్), జూన్ 30, ప్రభాతవార్త:** ఉన్నత విద్య కోసం విదేశానికి వెళ్ళిన తెలంగాణా విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా, కల్వ శ్రీరామ్‌పూర్ మండలం, కూనారం గ్రామానికి చెందిన గిట్ల సాయి అఖిల్ రెడ్డి(30) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయడానికి ఆరు నెలలు క్రితం స్పెయిన్ వెళ్ళాడు. బాధితుడు గిట్ల గునాకర్ రెడ్డి, సుభాషిని రెడ్డిలకు ఏకైక సంతానం. కుటుంబం ప్రస్తుతం హైదరాబాద్, అల్వాల్‌లో నివాసం ఉంటున్నారు. స్పెయిన్ వెలెన్సీయాలో నివాసం ఉంటూ అఖిల్ రెడ్డి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. వెలెన్సియాలో తాను నివసిస్తున్న భవనం మొదటి అంతస్తు నుంచి కింద పడి అతను చని పోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఒక్క కొడుకు పరాయి దేశంలో శవంగా మారడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.


సాయిఅఖిల్‌రెడ్డి (ఫైల్)

## తిరుమల సమాచారం



### హుండీ కానుకలు రికార్డు

● రూ.5.63 కోట్లు ఒక్కరోజే రాబడి

**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవిసెలవులు ముగిసిన తరువాత మళ్ళీ గత వారంలో నాలుగురోజులు కలియుగ వైకుంఠం తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ ఏర్పడి బ్రహ్మోత్సవాలను తలపించజేసింది. ఇష్టదైవమ్ తిరుమలేశుని దర్శనం కోసం అంతకంతకూ దేశం నలుమూలల నుండి భక్తుల భారీగా తరలిరావడంతో తిరుమలకొండ భక్తజనసంద్రంగా మారింది. ఇదే సమయంలో తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి కానుకల రూపంలో సమర్పించుకున్న ఆదాయం జూన్ నెలలో ఆదివారం ఒక్కరోజుకే రూ.5.63 కోట్లు చేకూరింది. 95,498 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఒక్కరోజే 4.34లక్షల లడ్డూలు కొనుగోలు చేశారు. దీన్నిబట్టి భక్తుల రద్దీ ఏమేరకు ఉందో అంచనా వేయవచ్చు. ఇదే జూన్ నెలలో 23వ తేదీ హుండీ రాబడి రూ. 5.18 కోట్లు కాగా 15వ తేదీ రూ.5.04 కోట్లు, 28న రూ.4.90 కోట్లు, 16వ తేదీ రూ.4.72 కోట్లు, 12న రూ.4.60 కోట్లు ఇలా వరుసగా రూ.4 కోట్ల పై మాటగానే ఆదాయం సమకూరింది. తిరుమలకు వచ్చి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. జూన్ 29న 95,498మంది భక్తులు, జూన్ 14వ తేదీ 95,094మంది, 8వ తేదీ 95,152 మంది, 7న 92,230మంది భక్తులు, 13న 92,830 మంది భక్తులు ఇలా వరుసగా సరాసరి 90వేల మంది వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. కాగా మంగళవారం ఉదయానికి భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. మంగళవారం ఉదయం వైకుంఠమ్ 2లోని 21 కంపార్టుమెంట్లలో భక్తులు నిండి ఉన్నారు. దీంతో సర్వ దర్శనానికి సుమారు 12 గంటల సమయం నిరీక్షిస్తున్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతుందని టిటిడి ప్రసారం చేసింది. వారాంతం ముగిసినా రద్దీ తగ్గకపోవడంతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం 30,231 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు.

### ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు దాతలు విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళాన్ని అందించింది. సంస్థ ప్రతినిధులు తరుణ్, రమేష్ తిరుమలలో టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడును కలసి విరాళం డిడిని అందజేశారు. ఈ సందర్భంగా పేద ప్రజల ప్రాణరక్షణకు చేయూతనిచ్చే మహోన్నత సేవలో భాగస్వాములైన అపర్ణ సంస్థ యాజమాన్యాన్ని ఛైర్మన్ నాయుడు అభినందిస్తూ, వారి దాతృత్వాన్ని కొనియాడారు.

### జులై 7న జీడిపప్పు ఖాళీ ప్లాస్టిక్ బకెట్‌ల ఇ వేలం

**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో ఏప్రిల్ 1వ తేదీ నుండి 2027 మార్చి 31వరకు జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించే ఖాళీ ప్లాస్టిక్ బకెట్‌లను ఇ వేలం వేయనున్నారు. జులై 7న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ వేలం వేయనున్నారు. ఆసక్తిగల బిడ్డర్లు రూ.25 వేలు ఇఎండి చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 08772 264429 నంబరుకు కార్యాలయం వేళల్లో, టిటిడి వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఒఆర్‌జి, రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కొనుగోలు.ఎపి.జివొవి.ఇన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

### తిరుమల పవిత్రతకు భంగం

● గోగుల కోటయ్య కోటిపై పిడి యాక్ట్




**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తూ భక్తులను వేధించిన గోగుల కోటయ్య కోటి(22)పై తిరుమల పోలీసులు పిడి యాక్టు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసు, టిటిడి సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న నేరస్థుడు గోగుల కోటయ్య కోటి (22) పై పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు అమలు చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ నిందితుడి నేరచరిత్రను పరిశీలించి ప్రజా శాంతిభద్రతలకు, ముఖ్యంగా తిరుమలకు వచ్చే భక్తుల భద్రతకు ముప్పుగా ఉన్నట్లు నిర్ధారించి పిడి యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

# మతసామరస్యానికి నిదర్శనం బారాషహీద్ దర్గా

● భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక నెల్లూరు రొట్టెల పండుగ: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**నెల్లూరు(వైద్యం), జూన్ 30 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మంగళవారం నెల్లూరులోని చారిత్రాత్మక బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బారాషహీదులను దర్శించుకుని దేశ ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని పేర్కొన్నారు. భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు, భిన్న సంస్కృతులను కలిగిన ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని పరస్పర గౌరవం, సోదరభావాన్ని చాటుకునే అపూర్వ ఆధ్యాత్మిక ఉత్సవం రొట్టెల పండుగ అని అన్నారు. భారతదేశం వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దేశమని, ఆ గొప్ప సంస్కృతికి ప్రతిబింబమే నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ అని మంత్రి పేర్కొన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు తదితర అన్ని మతాలకు చెందిన భక్తులు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒకే చోట చేరి రొట్టెలను మార్చుకోవడం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం కేవలం ఆధ్యాత్మిక విశ్వాసానికి మాత్రమే పరిమితం కాకుండా, సర్వమత సౌభ్రాతృత్వానికి, సామాజిక ఐక్యతకు, మానవ విలువలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. మతం ఏదైనా మనుషులందరూ ఒక్కటేనని, పరస్పర ప్రేమ, గౌరవం, సహజీవనమే భారతీయతకు మూల సూత్రమని ఈ పండుగ ప్రపంచానికి చాటి చెబుతోందని తెలిపారు. ప్రతి ఏటా దర్గాపై ప్రగాఢ విశ్వాసంతో, స్వర్ణాల చెరువులో జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారని చెప్పారు. గతంలో కొన్ని వేల మంది భక్తులతో ప్రారంభమైన ఈ ఉత్సవం నేడు లక్షలాది మంది పాల్గొనే మహోత్సవంగా రూపాంతరం చెందడం ఈ పండుగ విశిష్టతకు నిదర్శనమన్నారు. దివంగత ఆనం వివేకానంద రెడ్డి హయాం నుంచే బారాషహీద్ దర్గా అభివృద్ధికి తమ కుటుంబం కృషి చేస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎన్డీఏ కూటమి నాయకులు, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో రొట్టెల పండుగ మరింత వైభవంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు.

# 'సంజీవన్ని' ఒక గేమ్‌ఛేంజర్

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో అమలవుతున్న 'సంజీవన్ని' ఒక గేమ్ ఛేంజర్ పథకంగా జాతీయ స్థాయిలో గుర్తింపులోకి వచ్చిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంరక్షణ మండలి సమావేశానికి హాజరైన సందర్భంగా మంత్రి సత్యకుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా వివరించారు. రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులకు సంజీవని పథకం గురించి వివరించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులు సోకిన అనంతరం చికిత్సను అందించే సాంప్రదాయ విధానం నుండి(రియాక్టివ్) వ్యాధుల నివారణకు (ప్రివెంటివ్) దిశగా సమగ్ర మార్పునకు 'సంజీవన్ని' పథకం ఒక గేమ్ ఛేంజర్ కానున్నదని మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో వివరించారు. డిజిటల్ వైద్య సేవలను అట్టడుగు స్థాయికి అందుబాటులోకి తెచ్చి వైద్య సేవల్ని పొందడంలో ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య నెలకొన్న అంతరాన్ని తొలగించడానికి 'సంజీవన్ని' ఇతోధికంగా ఉపకరిస్తుందని మంత్రి తెలిపారు. దార్శినికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు సంజీవని పథకాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు.

గతేడాది జులై మాసంలో కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమై, ప్రస్తుతం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న 'సంజీవన్ని' పథకాన్ని ఆగస్టు మాసంలో రాష్ట్రమంతటా విస్తరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రజలకు వైద్య సేవలను అందించే దిశగా పలు అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని రాష్ట్ర మంత్రుల సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. టెలీ వైద్య సేవలు, ఎన్‌సిడి స్క్రీనింగ్, ఎయిడ్స్ నియంత్రణ, ఎనీమియా నివారణ, ఆసుపత్రుల్లో ప్రసవాలు, క్షయ వ్యాధి నోటిఫికేషన్, ప్రసవకాలంలో మాతృ మరణాల నివారణ వంటి పలు అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ సోదాహరణంగా వివరించారు.

# సునీల్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆపండి

● ప్రభుత్వానికి ఐపిఎస్ అధికారి భార్య పిటిషన్

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రఘురామ కృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ పదవీ విరమణ రోజే ఊహించని షాక్ తగిలింది. ఆయనకు అందాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆయన భార్య పి.అరుణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితి కారణంగా సునీల్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య ప్రభుత్వానికి ఒక పిటిషన్ సమర్పించారు. తమ మధ్య వైవాహిక వివాదాలు ఉన్నాయని, తన భర్తపై గృహ హింస, వరకట్న వేధింపుల ఆరోపణలు ఉన్నాయని అరుణ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ విషయమై 2017 జూన్‌లోనే కేసు నమోదైనట్లు ఆమె వివరించారు. ఒకవేళ ఇప్పుడు ఆయనకు రిటైర్మెంట్ ప్రయోజనాలు అందిస్తే, తన జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

### తిరుపతిలో ఆరుగురు అరెస్ట్... గంజాయి సీజ్

**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో గంజాయి అమ్మకాలు కలకలం రేపింది. నగరంలోని కోట కొమ్మల వీధి, దొడ్డపురం వీధి, పెద్దకాపు లే అవుట్, కట్టమంచికి చెందిన యువకులు ఈ గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. రెండు రోజుల క్రితం గంజాయి మత్తులో కోట కొమ్మల వీధిలో గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ గొడవలకు కారణమైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో అసలు నిందితులు వెలుగులోకి వచ్చారు. తిరుపతి దొడ్డాపురంవీధికి చెందిన హరికృష్ణ రెడ్డి, జ్ఞానచరణ్, కోట కొమ్మల వీధికి చెందిన ఉదయ్ కుమార్, కట్టమంచికి చెందిన వెంకట సాయి, జీవకోన అరుణోదయ కాలనీకి చెందిన ఆదినారాయణల వద్ద రెండు కిలోల గంజాయితో అలిపిరి పోలీసులకు పట్టుబడ్డారు. ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు.

# దోచుకునే వారిదే నేడు కాలం

● సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు




**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం శ్రమ చేసే వారికి విలువ లేదని దోచుకునే వారిదే కాలమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ఎద్దేవా చేశారు. నేటి పాలకులు జాతీయ సంపదను దోచేస్తూ, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల జీవితాలను కాలరాస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సమయంలో ఐక్య ఉద్యమాల అవసరం అన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 8న ప్రారంభమైందని, ఇంకా కొనసాగుతుందన్నారు. ఆ యుద్ధ ప్రభావం భారత దేశంలో అధికంగా ఉందని, క్రూడ్ ఆయిల్, గ్యాస్, నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధానికి ముందు చమురు బ్యారెల్ ధర 70 డాలర్లు ఉంటే, యుద్ధం సమయంలో 120 డాలర్లు ఉండేదని, ప్రస్తుతం 70 డాలర్లకు తగ్గిందని, అయినా దేశంలో ధరలు మాత్రం తగ్గలేదన్నారు. దేశంలో ప్రజలపై భారాలు పెరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని ప్రధాని మోడీ కనీసం ప్రకటన చేయక పోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత పాలకులు అమెరికాకు సహాయం చేయడానికి దేశానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉన్న అదానీ, అంబానీ ఆదాయాలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు అన్ని కూడా కార్పొరేట్ శక్తులకు ఆదాయంగా మార్చేస్తున్నారని గజమెత్తారు.

**వర్మది వసుదైక కుటుంబం:**

వర్మ కుటుంబం నిజమైన వసుదైక కుటుంబం అని, కుల మతాలకు అతీతంగా లౌకికవాదాన్ని ప్రోత్సహించిన వ్యక్తి ఆయన అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు పేర్కొన్నారు. వర్మ 84వ జయంతి సందర్భంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నేటి తరం ఎదుర్కొంటున్న సవాల్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందరపు మురళి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వర్మ చిన్నతనం నుంచే పోరాట పటిమ కలిగిన వ్యక్తి అన్నారు. పోస్టల్ ఉద్యోగ సంఘంలో ఉన్నప్పుడే ఉద్యమాల్లో పని చేశారని తెలిపారు. ఆయన కుటుంబంలో కులం, మతం భేదాలు లేవని, కట్న కానుకల సమస్యలే లేవని, అవనిగడ్డ కుటుంబాన్ని చూస్తే, నిజమైన భారతదేశాన్ని చూసినట్టు ఉంటుందని వర్మది వసుదైవిక కుటుంబం అని పేర్కొన్నారు. తనకు తెలిసిన మంచిని నలుగురికి చెప్పే తపన ఉన్న వ్యక్తి వీర వర్మాన్ని తెలిపారు. ఒకే దేశం ఒకే మతం ఒకే ఆహారం ఆఖరికి ఒకే బట్ట అనే విధంగా పాలకులు వ్యవహరించడం దారుణం అన్నారు. ప్రభుత్వ సంస్థలు సైతం ప్రైవేటు వారికి అప్పనంగా అప్పగించేస్తూ, దేశ ప్రజలకు కనీసం ఉపాధి భరోసా కూడా లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయాలను సైతం విచిత్రంగా ఉన్నాయని అధికారంలో ఉన్న టిడిపి, జనసేనలు మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని, ప్రతిపక్షంలో ఉన్న వైసిపి సైతం మోడీ వెంటే ఉన్నారని విమర్శించారు. దేశంలో 'సర్ట్' పేరుతో ఓట్లు మాయం చేసే తంతు జరుగుతుందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి సుబ్రహ్మణ్యం, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య, ఐఎన్‌టియుసి నాయకులు రత్నకుమార్, కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# మామిడి రైతులను ఆదుకోవాలి

● చిత్తూరు- పుత్తూరు రహదారిపై వైసిపి ధర్నా



**చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:** మామిడి రైతుకు ఈ సీజన్‌లో తీరని అన్యాయం జరిగిందని, మామిడి రైతుకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం జైన్ ఫ్యాక్టరీ ఆవరణలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మాజీ ఎంపి రెడ్డప్ప, చిత్తూరు, పూతలపట్టు, జిడినెల్లూరు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు ఎంసి విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, కృపాలక్ష్మీ, చెవిరెడ్డి మోహిత్‌లు, పార్టీ పరిశీలకులు వల్లివేడు పృధ్వీరెడ్డి తదితరులు హాజరయ్యారు. రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తున్న వైకాపా నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

అంతరకు ముందు ధర్నానుద్దేశించి భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి రైతుకు ప్రభుత్వం వారం రోజుల క్రితం కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించి, ఫ్యాక్టరీలు రైతుల నుండి కేజీ తోతాపురి మామిడిని రూ.6 కొనుగోలు చేయాలని స్పష్టం చేసినప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క ఫ్యాక్టరీ రైతు నుండి తోతాపురి రకం మామిడి కేజీకి రూ.2 నుండి రూ.4 మించి కొనుగోలు చేయడం లేదని ధ్వజమెత్తారు. మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడి రైతులు ట్రాక్టర్లను పల్ప్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకువచ్చి రోజుల తరబడి పడిగాపులు పడుతున్నప్పటికీ ఫ్యాక్టరీలు మాత్రం మామిడి రైతుల నుండి కాయలు తీసకోవడం లేదని ధ్వజమెత్తారు. మాజీ ఎంపి రెడ్డప్ప మాట్లాడుతూ మామిడి మద్దతు ధర కోసం మామిడి రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడంతో మామిడి రైతుల కోసం వైకాపా రోడ్డెక్కిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తోతాపురి మామిడి కేజీకి రూ.15 మద్దతు ధర చెల్లించి మామిడి రైతును ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, మామిడి రైతులు హాజరయ్యారు.

# మామిడి రైతులతో వైసిపి డ్రామాలు

● చిత్తశుద్ధి వుంటే పెద్దిరెడ్డి ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేయాలి

● ఎమ్మెల్యేలు జగన్మోహన్‌నాయుడు, కలికిరి మురళీమోహన్



**చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు, తోతాపురి మామిడి కేజీకి రూ.4 ప్రోత్సాహక ధరను ముందుగానే ప్రకటించడంతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని జీర్ణించుకోలేని వైకాపా నాయకులు మామిడి డ్రామాను ఆడుతున్నారని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు పేర్కొన్నారు. చిత్తూరులోని ఎమ్మెల్యే గురజాల నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో మామిడి రైతులను ఆదుకోవాలని గత రెండేళ్ళుగా కూటమి ప్రభుత్వం తోతాపురి మామిడికి ప్రోత్సాహక ధర ఇస్తోందన్నారు. వైకాపా నాయకులు చిల్లర వేషాలు వేస్తూ రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు. రైతులు, ప్రజలకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వంకు దిష్టి తగులుతుందని, ప్రభుత్వానికి దిష్టి తగలకుండా వుండటానికి తాము నల్లచొక్కాలు వేసుకుని విలేకరుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

మామిడి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారని, ఆ మేరకు తాము మామిడి పల్ప్ ఫ్యాక్టరీలను సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైకాపా నాయకులకు నిజంగా చిత్తశుద్ధి వుంటే మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన మామిడి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు వెంకటేష్ యాదవ్, నరేష్, మోహన్‌రాజ్, నీరజాక్షులు నాయుడు, ఈశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ రోజునే రిటైర్మెంట్ బెనిఫిట్స్

- టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర




**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ టిటిడిలో సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వారికి రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశించారు. టిటిడిలో వివిధ శాఖల్లో జూన్‌నెలలో రిటైర్డ్ అయిన 122 మంది ఉద్యోగులకు సామూహిక సన్మానం కార్యక్రమాన్ని మహతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. టిటిడి ఉద్యోగుల సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనంద రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇఒ రవిచంద్ర మాట్లాడుతూ టిటిడిలో వివిధ శాఖల్లో, పలు హోదాల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ అయ్యాక వారిని గౌరవించి, వారికి అందే ఫలాలను అదే రోజు వారి ఖాతాల్లో జమ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజూ సరాసరి 75 వేల పైచిలుకు భక్తులకు సేవలందిస్తున్న ఉద్యోగులను ఇఒ రవిచంద్ర అభినందించారు. టిటిడి జెఇఒ డాక్టర్.ఎ.శరత్ మాట్లాడుతూ జూన్ 30న 122 మంది టిటిడి ఉద్యోగులు పదవి విరమణ పొందారని, వారిని సమిష్టిగా పండుగ వాతావరణంలో సన్మానించాలని టిటిడి ఇఒ ఆలోచనలు మేరకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. టిటిడిలో పదవీ విరమణ పొందిన వారిని సన్మానించడం మహా సేవగా కొనియాడారు. టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన 122 మందికి ఒక్కొక్కరికి శ్రీవారి లడ్డూ, వడ, అమ్మవారి కుంకుమ, పసుపు, రవికె, అక్షింతలు, తీర్థం, శాలువా ఇచ్చి సత్కరించారు.

### విద్యుత్ వినియోగదారులతో నేడు విడియో కాన్ఫరెన్స్

తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులతో బుధవారం(నేడు) వీడియోకాన్ఫరెన్స్ జరగనుంది. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించనునట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతి నెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు మొబైల్ నంబరు: 89777 79471కు కాల్ చేయడం ద్వారా వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ సమస్యపై చర్చించి, పరిష్కరించుకునేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లింకును సంబంధిత వినియోగదారులకు పంపడం జరిగిందని తెలిపారు.

# విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం

● ప్రమాదాల నివారణపై వినియోగదారుల్లో చైతన్యం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** నేటి సమాజంలో విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ భద్రతపై ఎస్పీడిసిఎల్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను తిరుపతిలో ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ విద్యుత్ సామర్థం, భద్రతా చర్యలు, నిబంధనల అమలు అంశాలపై ఈ యేడాది జూన్ 26న ప్రారంభమైన అవగాహనా కార్యక్రమాలు జులై 2వతేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడమే ధ్యేయంగా సంస్థ పరిధిలో సర్కిల్, డివిజన్, సబ్‌డివిజన్, సెక్షన్ల స్థాయిల్లో విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించేదుకు కృషి చేస్తున్నామని వివరించారు. విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం వుంటుందన్నారు. గృహోపకరణాల అంశంలో వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వినియోగించాలని సూచించారు.

అంతేకాకుండా ఇంటి వైరింగును నిపుణుడైన ఎలక్ట్రీషియన్‌తో తరచూ తనిఖీ చేయిస్తూ, పాడైన పరికరాలను వెంటనే మార్చుకోవాలని, ఎర్తింగ్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. బలమైన గాలి వర్షం సందర్భాల్లో ప్రజలు విద్యుత్ లైన్ల కిందగానీ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు దగ్గరగాగానీ నిల్చోవద్దని సూచించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ ప్రమాదాలు జరిగినట్లయితే వినియోగదారులు వెంటనే తమ సమీపంలోని విద్యుత్ సిబ్బందికిగానీ, అధికారులకుగానీ సమాచారం అందించాలని సూచించారు. సంస్థ పరిధిలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా విద్యుత్ భద్రతపై ప్రత్యేకంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు కె. గురవయ్య, పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, సిహెచ్ రామచంద్రరావు, ఎన్.శోభా వాలెంటీనా, ఎస్.రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్ధన్ నాయుడు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐ మేకప్‌తో జాగ్రత సుమీ !



మేకప్ ఇది మనల్ని రోజంతా అందంగా కనిపించేలా చేసినా రాత్రి పడుకునే ముందు మాత్రం దీన్ని పూర్తిగా తొలగించక తప్పదు. లేదంటే వివిధ రకాల చర్మ సౌందర్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఐ మేకప్ విషయంలోనూ ఇది వర్తిస్తుందంటూన్నారు నిపుణులు. ఒక బద్ధకంతో కంటికి వేసుకున్న మేకప్ తొలగించకపోతే మాత్రం కళ్ల కింద నల్లటి వలయాలు, కంటికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు తప్పవంటు న్నారు. మరి, ఇంతకీ పడుకునే ముందు ఐ మేకప్ తొలగించుకోకపోతే ఎలాంటి సమస్యలొస్తాయి? దీన్ని సరైన పద్ధతిలో తొలగించుకోవడమెలా? తెలుసుకుందాం.. వివిధ పనుల రీత్యా అలసిపోయి ఇంటికి చేరుకోవడం, ఆలస్యమవడం. ఇలా కారణమేదైనా రాత్రయ్యేసరికి ఒక రకమైన బద్ధకం ఆవహిస్తుంటుంది. దీంతో ఏదో పైపైన మొహం కడిగేసుకొని మేకప్ సంగతి రేపు చూసుకుందాంలే అనుకుంటారు చాలామంది. అయితే ఈ అజాగ్రత్తే లేనిపోని కంటి సమస్యల్ని తెచ్చిపెడుతుంది.


**చర్మ అలర్జీలు తప్పవు..** కంటి మేకప్ తొలగించుకోకుండా ఏదో పైపైన శుభ్రం చేసుకొని పడుకుంటుంటారు కొంతమంది అమ్మాయిలు. దీనివల్ల రాత్రి మనకు తెలియకుండానే కళ్లు దురద పుట్టచ్చు. నలపచ్చు దాంతో మేకప్ కళ్లలోకి చేరుతుంది. అలాగే అటు ఇటూ దొర్లే క్రమంలో దిండ్లు, బెడ్‌షీట్స్‌కి సైతం మేకప్ అంటుకుంటుంది. అక్కడి నుంచి చర్మం పైకి చేరి లేనిపోని ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. కాబట్టి ఈ సమస్యలన్నీ తలెత్తకూడదంటే కాస్త ఓపిక చేసుకొని ఐ మేకప్‌ని తొలగించుకోవడం మంచిది.

**మస్కారా తొలగిస్తున్నారా?** ...కనురెప్పల్ని తీర్చి దిద్దుకోవడానికి, వాటిని వంపులు తిరిగేలా చేయడానికి మస్కారా వాడడం మనకు అలవాటే అయితే ఇది రెప్పలకు మందంగా అంటుకొని.. వాటిని అలాగే బిగుసుకుపోయేలా చేస్తుంది. తద్వారా కనురెప్పల్లోని నూనె గ్రంథులు మూసుకు పోతాయి. ఇక రాత్రంతా కూడా మస్కారా పెట్టుకొని ఉండడం వల్ల రెప్పలకు తేమ అదక అవి తమ సహజత్వాన్ని కోల్పోతాయి. పెళుసుబారిపోయి తెగిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఇదిలాగే కొనసాగితే కనురెప్పలు క్రమంగా పల్చ బడి కంటి అందం దెబ్బ తింటుంది. కాబట్టి రాత్రి ఇంటికి చేరుకున్న తర్వాత మస్కారాను పూర్తిగా తొలగించుకోవడం మంచిది.



**నల్లటి వలయాలొస్తాయ్ !** .రోజంతా అలసి పోయిన శరీరం రాత్రి పడుకున్నప్పుడు విశ్రాంతి తీసుకున్నట్లే. కళ్లూ రాత్రిపూట రిలాక్స్ వుతాయి. ఈ క్రమంలో కళ్ల చుట్టూ ఉండే చర్మకణాలు యాక్టివేట్ అయి అక్కడ చర్మాన్ని రిపేర్ చేసుకుంటాయి. అయితే రాత్రి పూట మేకప్ తొలగించకుండా అలాగే పడుకోవడం వల్ల దీనిలోని రసాయనాలు ఈ కణాలు పనితీరును అడ్డుకుంటాయి. తద్వారా కళ్ల కింద నల్లటి వలయాలు, కంటి చుట్టూ వాపు.. వంటి సమస్యలొస్తాయి. ఫలితంగా చిన్న వయసులోనే వృద్ధ్యాప్య ఛాయలు అలుముకుంటాయి. కాబట్టి రాత్రి పూట కల్లకు వేసుకున్న మేకప్ తొలగించి వాటికి కాస్త సాంత్వన ఇవ్వడం మంచిదంటున్నారు నిపుణులు. □

# చిరు ప్రాయంలోనే అద్భుత ధారణ !



చిరుప్రాయంలోనే ప్రపంచంలోని వివిధ దేశాల పేర్లు, వాటి రాజధానులు పేర్లు వాటి నైసర్గిక స్వరూపం చెప్పే పిల్లల్ని చూసాం. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని మోపిదేవి కొక్కిలిగడ్డకి చెందిన ఓ చిన్నారి భౌతిక శాస్త్రంలో తారసిల్లే మూలకాల చరిత్రను ఒడిసిపట్టింది. పెద్ద పెద్ద చదువులు చదివిన వారు సైతం ఒక్కోసారి ఫలానా మూలకమంటే తలబద్దలు గొట్టుకుంటే తప్ప దాని సమాధానం బయటకురాదు. కానీ చిన్నతనంలోనే మంచి ధారణలో వాటి సంగతి తేల్చేసిన చిన్నారిని అభినందించాల్సిందే ఆమె చదువుతున్నది ఐదో తరగతి. భౌతిక శాస్త్రంలో ఎలిమెంట్స్ పట్టిక ఎదురుగా పెట్టుకున్నా వాటిని చదవడానికి మాట తడబడుతుంది. కానీ ఆ చిన్నారి అందరినీ ఆశ్చర్యం గొలిపేలా మూలకాల పేర్లు చకాచకా చెప్పేసింది. □

# బుట్టని మడతపెట్టి .. !

సాధారణంగా డీప్‌ఫ్రై లాంటివి చేయాల్సి వచ్చినప్పుడు ఒక్కోసారి ఆహార పదార్థాలు విడి పోయి నూనెంతా పాడవుతుంటుంది. అలాకాకుండా ఉండాలా? అయితే, ఈ డీప్ ఫ్రై బాస్కెట్‌ను తెచ్చేసుకోండి. దీంతో ఫ్రెంచ్ ఫ్రైస్, చికెన్ ఫ్రై.. లాంటివి చేసుకోవచ్చు.అంతేకాదు, కూరగాయలను ఉడికించుకోవాల్సి వస్తే, ఇది స్టీమర్‌లానూ పనిచేస్తుంది. పని అయ్యాక, డిటర్జెంట్‌తో శుభ్రపరుచుకుని, మెత్తని క్లాత్‌తో తుడిచేస్తే సరి. పైగా ఇది ఫోల్డబుల్ ఫ్రైయర్ కాబట్టి, భద్రపరచాలంటే ఎక్కువ చోటూ అవసరం లేదు. మడతపెట్టేసి కబోర్డులో చిన్న స్థలంలో కూడా పెట్టుకోవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేసిన ఇది ఎక్కువకాలం మన్నుతుంది కూడా. □



# భక్తికి మార్గం

మనం దైవ గ్రంధాల కన్న ఇతరత్ర గ్రంధాలు బాగా చదువుతాం. దైవ గ్రంధాలు చదవటం వల్ల భక్తి భావం ఏర్పడుతుంది. హిందూ ధర్మంలో చాలా గ్రంధాలు ఉన్నాయి. అలాగే అన్ని మతాల లోను ఉన్నాయి. కాకపోతే హిందువులు భగవద్గిత ప్రామాణిక గ్రంధంగా భావిస్తారు. అలాగే క్రైస్తవులు పరిశుద్ధ బైబిల్ ను ప్రామాణికంగా తీసుకున్నారు.

మహమ్మదీయులు దివ్య ఖురాన్‌పరమ పవిత్రంగా చూసుకుంటారు. ఇక బౌద్ధులు, జైనులు, పార్శిలు తమ మత గ్రంధాలనే చదువుతారు. ఏది చది వినా అన్ని గ్రంధాలు చెప్పేది ప్రేమ, జాలి, కరుణ మొదలగునవి. ఇక్కడ మాదే గొప్ప గ్రంథం అనే బేషాజాలు పోవాలి. ప్రతి గ్రంధ రాజంలోను శాంతి, ప్రేమ ఉంది. అదే మనకు కావాల్సింది. నేడు మానవుడు, విశ్వంలోని అన్ని దేశాలు శాంతి కోసం తపిస్తున్నాయి. మంచిదే దేశాల మధ్య శాంతి, ప్రేమ ఇచ్చి, పుచ్చుకునే ధోరణి ఉండాలి. ఒకరిని తక్కువ, మరొకరిని ఎక్కువ ఏ గ్రంథం చూడదు. అలా చూస్తే అవి ఎన్నటికి ఉత్తమ గ్రంధాలు కాలేవు. మనం ఏ గ్రంథం పఠ్ని చిన అందరి కొరకు ప్రార్థన చేయాలి. అప్పుడే మత మ్నౌద్య ఉండదు. అందరూ, విశ్వం లోని అన్ని దేశాలు సంక్షేమ దిశగా ప్రగతి మార్గంలో పయనించడమే ఉత్తమ గ్రంధాల లక్ష్యం.సర్వ మతాల సారం ఒకటే అనే విషయం మనకు అవగతమే.

# పనీర్ మంచిదే కానీ ?



చాలామందికి చాలా ఇష్టమైంది పనీర్. దీంతో చేసిన కూరలు, స్నాక్స్.. ఏవైనా మహత్తరంగా ఉంటాయి. పనీర్ రుచే కాదు, బలం కూడా. అయితే మార్కెట్లో దొరుకుతున్న పనీర్ మంచిదో కాదో తప్పకుండా తెలుసుకోవాలి. ఎలాగంటారా? అందుకు ఐదు మార్గాలున్నాయి.

- అసలు పనీర్‌ను చూడగానే అర్థమైపోతుంది. అది మంచిదో కాదో. తాజా పనీర్ తెల్లగా లేదా క్రీమ్ రంగులో ఉంటుంది. ముదురు పసుపు రంగులో ఉన్నా లేదా మొత్తం ఒకే రంగులో కాకుండా..కొంత ఒక రంగులో, మరికొంత ఇంకో రంగులో ఉన్నా.. అది స్వచ్ఛమైందికాదని గ్రహించాలి.
- ఓ చిన్న ముక్కను నలిపి చూస్తే కొద్ది మెత్తగా తగులుతుంది. నాణ్యమైంది మరీ మెత్తగా లేదా మరీ గట్టిగా ఉండదు.
- . వాసన చూస్తే తెలిసీ తెలియనట్టుగా కొద్దిగా పాల మిఠాయి వాసన వస్తుంది. అలా కాకుండా గాఢమైన లేదా పుల్లటి వాసన వచ్చిందంటే స్వచ్ఛంగా లేదన్నమాట.
- పనీర్ ముక్కను నీళ్ల గ్లాసులో వేస్తే.. మంచిదైతే మునిగిపోయి, అడుగున చెక్కుచెదరకుండా ఉంటుంది. కల్తీది కరిగిపోతుంది లేదా విరిగిపోతుంది.
- పనీర్‌ను నూనె లేకుండా పెనం మీద వేడి చేయండి. మంచిదైతే ఆకారం మారదు. కొద్దిగా తేమ బయటికొస్తుంది. అదే కల్తీ పనీర్ అయితే కరిగిపోతుంది లేదా అందులోంచి చాలా నీరు వస్తుంది. □

# బర్నవుట్ నుంచి బయటకు !

ఆఫీసు వర్క్ చేస్తున్నప్పుడు ఆకస్మాత్తుగా మధ్యలో పని ఆపేయాలని పిస్తుంది. రొటీన్‌గా అనిపించి తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. దీన్నే బర్నవుట్ అంటున్నారు నిపుణులు. ఇందులోంచి బయటపడే మార్గాలను సూచిస్తున్నారు. ప్రస్తుతం పనిలో వేగాన్ని పెంచుకోవడం అనివార్య మైంది. పోటీ కూడా పెరిగింది. అయితే ఈ వేగానికి అతిచేరువలోనే బర్నవుట్ పొంచి ఉంటుంది. ఈ రెండింటి మధ్య సన్నని గీత ఉంటుంది. మొత్తం పనిని వేగంగా పూర్తిచేయాలని ప్రయత్నిస్తూ, తెలియకుండానే మెదడుకు ఒత్తిడి కలిగిస్తాం. పనిలో ఇలా కాస్తంత కూడా విరామం లేకుండా నిరంతరం వేగంగా కొనసాగించుకుంటూ పోతే క్రమేపీ అది అలసట. ఒత్తిడికి దారి తీస్తుంది. దీంతో పనిపై నిర్లిప్తత మొదలవు తుంది. అశ్రద్ధచేస్తే ఈ స్థితి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

**విభజించాలి:** విధుల్లో భాగంగా ఉత్సాదకత పెరిగేలా జాగ్రత్త పడుతూనే ప్రాముఖ్యతను బట్టి పనులను విభజించగలిగే నైపుణ్యాలను పెంచుకోవాలి. ఇతరులు చేయగలిగేవాటిని వారికే అప్పగించాలి. వాటిని పర్యవేక్షిస్తే పనిభారం తగ్గు తుంది. మానసిక ఒత్తిడి దూరమవు తుంది. తక్షణం కాకపోతే.. కొన్ని పనులు ముఖ్య మైనవే అయినా.. వెంటనే చేయాల్సిన అవసరం ఉండదు. దీర్ఘకాలిక లక్ష్యాలు కోసం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు లుంటాయి. వీటిని వ్యూహాత్మకంగా, ప్రణాళికా బద్ధంగా చేయాలి. దీనికంటూ రోజూ కొంత సమయాన్ని కేటా యించుకోవాలి. ప్రశాంతంగా పూర్తి చేసే పనుల్లో సత్ఫలితా లుంటాయి.



**ప్రతిరోజూ ..** ఆఫీసుకు రాగానే ఆ రోజు చేయాల్సిన పనులను అత్యవసరం, అవసరం అంటూ విభజించు కోవాలి. వాటిని ప్రణాళికమేరకు పూర్తిచేయగలగాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి ధ్యానం, వ్యాయామాలకు చోటివ్వాలి. □




# తెలుగు చిత్రసీమలో అజాతశత్రువు





తెలుగు రాష్ట్రాల్లో ఆ పేరు తెలియని వారుండరు. ఆయన అసలు పేరు రాజాబాబు. కానీ మురళీమోహన్ గానే ప్రేక్షకులకు పరిచయం..ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో ఆయన తనదైన ముద్ర వేశారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఎన్నో సందేశాత్మక చిత్రాలను అందించారు. 'జగమే మాయ' చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేసిన మురళీ మోహన్, క్రమశిక్షణ గల నటుడిగా పేరు తెచ్చుకుని 350కి పైగా సినిమాల్లో నటించారు. చిత్ర రంగానికి ఆయన చేసిన సేవలకు గాను ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది.. హీరోగా ,సహాయ నటుడిగా రాణించి తన బహుముఖ ప్రజ్ఞను చాటు కున్నారు. ఆయన నటించిన సినిమాల్లో కుటుంబ విలువలకు పెద్దపీట వేయడం వల్ల మహిళా ప్రేక్షకులు ఆయనను బాగా ఆదరించారు. చిన్న నిర్మాతల హీరోగా ఎదిగారు. తెలుగు చిత్రసీమలో అజాతశత్రువుగా పేరు పొందిన అతికొద్ది మందిలో మురళీ మోహన్ ఒకరు. నిర్మాతగా ఆయన స్థాపించిన జయభేరి ఆర్ట్స్ బ్యానర్ టాలీవుడ్‌లో ఎన్నో క్లాసిక్ సినిమాలకు వేదికైంది. ఈ సంస్థ ద్వారా ఆయన నిర్మించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందాయి. ఆయనకు పద్మశ్రీ అవార్డు రావడంతో ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఫిలిం ఛాంబర్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మురళీ మోహన్ మాట్లాడుతూ... ఎన్నో సందర్భాల్లో మేము ప్రెస్ మీట్లు పెట్టాము పాత్రికేయులు వచ్చేవారు. మా సినిమాల గురించి రాసేవారు. చాలా చక్కటి కవరేజ్ ఇచ్చేవారు. ఎప్పుడూ కూడా నెగెటివిటీ రాసేవారు కాదు. అంతా మంచిగా రాసేవారు. ఫిలిం ఇండస్ట్రీకి ఫిలిం క్రిటిక్స్‌కి ఎప్పటి నుంచో కొంత అనుబంధాలు ఉన్నాయి. కేవలం టాలీవుడ్‌లో మాత్రమే కాదు. ఏ భాషలోనైనా క్రిటిక్స్‌కి ఇండస్ట్రీకి చాలా అవినాభావ సంబంధాలు ఉంటాయి. క్రిటిక్స్ వారు పిలిచి ఇంత పెద్ద కార్యక్రమం చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది.ప్రెసిడెంట్ బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ.. .మురళీ మోహన్‌గారి అసలు పేరు రాజాబాబు. మాకు ఇంత మంచి అవకాశాన్ని కల్పించినందుకు ఆనందంగా ఉంది. ఆయనకు అవార్డు రావడం చాలా గర్వంగా ఫీలవుతున్నాను అన్నారు. జనరల్ సెక్రటరీ సురేష్ కొండేటి మాట్లాడుతూ.. .సినిమా పాత్రికేయులు అందరూ హ్యాపీ. ఈ సన్మానికి ఒప్పుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

# 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ రిలీజ్



విభిన్నమైన కథలు, మంచి కంటెంట్ చిత్రాలతో ఎప్పటి కప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ వస్తున్న కామెడీ కింగ్ అల్లరి నరేష్, తనను స్టార్ హీరోగా నిలబెట్టిన కామెడీ జానర్‌లో మరో సారి సందడి చేయడానికి సిద్ధమ య్యారు. ఆయన నటిస్తున్న 65వ చిత్రం Naresh65కు చంద్ర మోహన్ చింతాడ దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌తో ఈ చిత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది ఇంతకు ముందెన్నడూ చూడని రీతిలో అద్భుతమైన వినోదాన్ని పంచే ఫాంటసీ కామెడీ చిత్రంగా వుండబోతుంది. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, నరేష్ వి.కె., శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ఇతర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరంతా తమ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకు లను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహించగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుం డగా, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్. వినూత్నమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్, ఆసక్తికరమైన ఫాంటసీకామెడీ కథాంశంతో 'రంభ ఊర్వశి మేనక' ఇప్పటికే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# 'నాగబంధం' ప్రాణం పెట్టి పని చేశా : విరాట్ కర్ణ



**నాగబంధం జర్నీ ఎలా ప్రారంభమైంది?**
అభిషేక్ నామా ఈ కథను సిద్ధం చేసుకుని, ఆ పాత్రకు తగ్గ నటుడి కోసం వెతుకుతు న్నారు. ఆ పాత్రకు కావాల్సిన అన్ని లక్షణాలు ఉన్న కొత్త వ్యక్తి అయితే బాగుంటుందని అనుకు న్నారు. ఆ సమయంలో నన్ను పిలిపించి మాట్లాడారు. నాకు కథ చాలా నచ్చింది. చాలా ఎగ్జైట్ అయ్యాను.

**ఈ సినిమా మొదలుపెట్టినప్పుడే రూ.100 కోట్ల బడ్జెట్ అనుకున్నారా?**
లేదు. సినిమా డెవలప్ చెందుతున్న కొద్దీ కంటెంట్ డిమాండ్ ప్రకారం బడ్జెట్ సైజ్ పెరుగుతూ వచ్చింది.

**మీ పాత్ర కోసం ఎలా సిద్ధమయ్యారు?**
ఈ కథ విన్నప్పుడే నా పాత్ర ఎలా ఉండాలో ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. ఈ కథ నా కోసమే రాసినట్టుగా అనిపించింది.

**శివరూపంలో కనిపించాలంటే చాలా ఎనర్జీ ఉండాలి కదా. ఎంత ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు?**
సినిమా కథ విన్నప్పుడే రుద్ర పాత్ర ఎలా ఉండాలో పూర్తిగా అర్థమైంది. పాత్ర కోసం దాదాపు 20 కిలోల బరువు పెరిగాను. తర్వాత నాగసాధువుగా కనిపించడానికి మరో ఐదు కిలోలు తగ్గాను.

**ఇంత భారీ సినిమా చేస్తున్నప్పుడు ఒత్తిడి ఉండేదా?**
మొదట్లో కొంచెం భయపడ్డాను. ప్రతిరోజూ షూటింగ్‌లో 300 మంది జూనియర్ ఆర్టిస్టులు, భారీ సెట్లు ఉండేవి. నమోరే పాట కోసం దాదాపు 5,000 మంది పాల్గొన్నారు. అయితే ఆ ఒత్తిడిని మొత్తం మా దర్శకుడు అభిషేక్ నామాతీసుకున్నారు.

**సినిమాల్లోకి రావడానికి మీకు ఇన్‌స్పిరేషన్ ఎవరు?**
నాకు మెగాస్టార్ చిరంజీవి ఇన్‌స్పిరేషన్. చిన్నప్పటి నుంచి ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన పాటలకు డాన్స్ చేసేవాడిని. అలా సినిమాలపై ఆసక్తి పెరిగింది.

**ఈ సినిమా నటుడిగా మీకు ఎలాంటి అనుభూతి?**
ఈ సినిమా నాలో చాలా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఒక నటుడిగా చాలా విషయాలు నేర్చుకున్నాను. అభిషేక్ నామా నన్ను ఒక ముత్యంలా తీర్చిదిద్దారని భావిస్తున్నాను.

# ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో భారీ చిత్రం

విజయాలు సాధించే చిత్రాలు ఎన్నో వస్తుం టాయి. కానీ, చరిత్ర సృష్టించి, చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాలు అరుదు గా వస్తుంటాయి. అలాంటి అరుదైన అద్భుతానికి శ్రీకారం చుట్టారు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఎన్నో ఏళ్లుగా సినీ అభిమానులు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రాబో తున్న మరో భారీ చిత్రానికి సంబం ధించిన అధికారిక ప్రకటన వెలువడింది గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' చిత్రం ఘన విజయం సాధించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు అందు కుంది. ఇప్పుడు మరోసారి ఈ నటుడుదర్శకుడు ద్వయం, భారతీయ చలనచిత్ర రంగంలో సరికొత్త రికార్డులను సృష్టిం చేందుకు, ఒక అసాధా రణమైన సినిమా ప్రయాణాన్ని ప్రారంభిం చడానికి సిద్ధమవు తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం కోసం అత్యున్నత స్థాయి సాంకేతిక బృందం పని చేస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించ నున్నారు. ఈ ప్రపంచ స్థాయి భారీ చిత్రాన్ని నిర్మించడానికి అగ్ర నిర్మాణ సంస్థలు చేతులు కలిపాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ(చినబాబు), ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై నందమూరి కళ్యాణ్ రామ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత విజయవంతమైన నటుడు-దర్శకుడు కలయికల్లో ఒకటైన ఎన్టీఆర్- త్రివిక్రమ్ జోడీ, రెండు అగ్ర నిర్మాణ సంస్థలతో కలిసి మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయి దృశ్యకావ్యాల్లో ఒకటిగా నిలవనుంది.




# 'ఇరుముడి' 'ఇరుముడి కట్టు' రిలీజ్



మాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు తొలి పాట ఇరుముడి కట్టుతో అద్భుతంగా శ్రీకారం చుట్టింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు లభించిన అద్భుత స్పందన, 'ఇరుముడి కట్టు' ఒక ఆధ్యాత్మిక భావోద్వేగాలతో కూడిన భక్తి పాట. జి.వి. ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ పాటలో అయ్యప్ప స్వామి భక్తి, నియమ నిష్ఠలు, మండల దీక్ష పవిత్రతను అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ పాటకు దర్శకుడు శివ నిర్వాణ, కళ్యాణ్ చక్రవర్తితో కలిసి సాహిత్యం అందించారు. అయ్యప్ప మాల ధరించి మండల దీక్ష చేపట్టిన ఓ భక్తుడు ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్ర చేసే పవిత్ర ప్రయాణాన్ని ఈ సాహిత్యం ఎంతో హృద్యంగా కనిపించింది. ఈ పాటలో రవితేజ అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తుడి పాత్రలో ఒదిగిపోయారు. ఆయన లుక్, భక్తి భావం, హావభావాలు, స్క్రీన్ ప్రెజెన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటలో రవితేజ భార్య, కుమార్తె పాత్రల్లో నటిస్తున్న ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర కనిపించే భావోద్వేగ సన్నివేశాలు కథకు మరింత ఎమోషన్ ని జోడించాయి. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు.నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# 'రణబాలి' డైరెక్టర్ రాహుల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది.ఈ రోజు డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు హీరో విజయ్ దేవరకొండ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు విజయ్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా స్పందిస్తూ మనం టాక్సీవాలా సినిమా చేసి తొమ్మిదేళ్ల వుతోంది. ఈ తొమ్మిదేళ్లలో మనం లైఫ్ లో ఎంతో మారిపోయాం. అర్థవంతమైన కథలు రాయాలనే తపన, వాటిని అందంగా తెరకెక్కించాలనే ఇష్టం నీలో ఏమాత్రం తగ్గలేదు. మనం కలిసి చేసింది రెండు చిత్రాలే అయినా ఎన్నో పోరాటాలు చేశాం. మొదటి చిత్రానికి ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ అందుకున్నాం. రణబాలి తో మనం మరో విజయం సాధించాలి. నువ్వు చేసే పనుల్లో అంతా మంచే జరగాలి. రణబాలిగా నటించే అవకాశం దక్కినందుకు సంతోషిస్తున్నా. మన సినిమాను ప్రేక్షకులు ఎప్పుడెప్పుడు చూస్తారా అని వేచి చూస్తున్నా. అని అన్నారు.




# మరో సిరీస్‌కు సిద్ధమైన టీమిండియా

## * నేడు ఇంగ్లండ్‌తో తొలి టి20 మ్యాచ్ *వైభవ్‌కు ఛాన్స్? * రాత్రి 10 గం.కు ప్రారంభం

**చెస్టర్‌లీస్ట్రీట్(లండన్), జూన్ 30:** టీ20 ఛాంపియన్లు టీమిండియా మరో సిరీస్‌కు సిద్ధమైంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఓటమి నుంచి ఇంకా తేరుకోని శ్రేయాస్ సేన...ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది.ఇందులో భాగంగా నేడు చెస్టర్‌లీస్ట్రీట్‌లో జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. పసికూన ఐర్లాండ్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై విమర్శలు ఎదుర్కొంటున్న మెన్ ఇన్ బ్లూ.. ఇంగ్లాండ్‌ను దాని సొంతగడ్డపై నిలువరిస్తుందా? అన్నది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

**శ్రేయాస్ శకం**

శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా తొలి మేజర్ సిరీస్ ఆడబోతోంది. ఇది కెప్టెన్‌గా శ్రేయాస్‌కు అసలు సిసలు పరీక్ష. తొలి సిరీస్ లోనే ఓటమి ఎదుర్కొన్న శ్రేయాస్.. ఇంగ్లాండ్‌పై గెలుపుతో విమర్శలకు చెక్ పెట్టాలని చూస్తున్నాడు. తుది జట్టులో ఒకటి రెండు మార్పులతో బరిలోకి దిగడంపై ఫోకస్ పెట్టింది.

**వైభవ్ అరంగేట్రం?**


ఐర్లాండ్‌పై యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని అంతా భావించినా అది జరగలేదు. వైభవ్‌కు అవకాశం ఇవ్వకుండా విమర్శలపాలైన టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఇంగ్లాండ్‌పై కచ్చితంగా బేబీ బాస్‌ను ఆడించే అవకాశాలున్నాయి.తొలి టీ20లోనే వైభవ్ అరంగేట్రం ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఐర్లాండ్‌పై విఫలమైన సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లో ఒకరిని బెంచ్‌కే పరిమితం చేసి అభిషేక్‌తో కలిసి వైభవ్‌ను ఓపెనింగ్‌కు పంపే ఛాన్స్ ఉంది. పేస్‌కు అనుకూలించే ఇంగ్లాండ్ పిచ్‌లపై ఎలా ఆడతాడన్నది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు ఇంగ్లాండ్... సొంతగడ్డపై పటిష్టంగా ఉంది. హ్యారీ బ్రూక్, బట్లర్, జోర్డాన్ కాక్స్, బెతెల్, విల్ జాక్స్, ఫిల్ సాల్ట్, బాంటన్ వంటి ఆటగాళ్లతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. వీరిని అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్‌లతో కూడిన పేస్ దళం ఎంతవరకు కట్టడి చేస్తుందన్న దానిపైనే టీమిండియా విజయావకాశాలు ఉన్నాయి.

**బౌలింగ్‌కు అనుకూలంగా..**

తొలి టీ20 మ్యాచ్ జరిగే చెస్టర్‌లీస్ట్రీల్ రివర్‌సైడ్ పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ గత ఎనిమిది మ్యాచ్‌ల్లో బౌలర్లదే ఆధిపత్యం. సగటు స్కోరు 138 కాగా.. అత్యధిక స్కోరు 195. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు మొదలుకానుంది.

**భారత్:** శ్రేయస్(కెప్టెన్), తిలక్(వైస్ కెప్టెన్), బిష్ణోయ్, అభిషేక్, సూర్యాంశ్, ప్రసిద్ధ్ కృష్ణ, శాంసన్, వైభవ్, అక్షర్, హర్షిత్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్, అర్ష్‌దీప్, దూబె, ప్రిన్స్ యాదవ్.

# తొలి రౌండ్ గట్టెక్కిన సిన్నర్, జొకోవిచ్





**లండన్, జూన్ 30:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడ్లకు ఆరంభంలోనే చుక్కలు కనిపిస్తున్నాయి. పురుషుల ప్రపంచ నంబర్‌వన్ జానిక్ సిన్నర్ తొలి రౌండ్‌లోనే అయిదు సెట్ల హోరాహోరీ పోరు ఎదుర్కొని ఊపిరిపీల్చుకున్నాడు. అలాగే మరో అగ్రశ్రేణి ప్లేయర్ నోవాక్ జోకోవిచ్ కూడా మూడు గంటల పోరులో గెలిచి రెండో రౌండ్ చేరాడు.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సిన్నర్ 4-6, 6-3, 6-7, 6-2, 6-3తో సెర్బియాకు చెందిన అన్‌సీడెడ్ మియోమిర్ కెమనోవిక్‌పై చెమటోడ్చి నెగ్గాడు. మూడున్నర గంటల పాటు జరిగిన ఐదుసెట్ల మ్యాచ్‌లో సిన్నర్ ఓ దశలో వెనుకబడి ఓటమి వైపు సాగాడు. తొలి సెట్‌లోనే సిన్నర్‌కు కెమనోవిక్ షాకిచ్చాడు. 6-4తో నెగ్గి శుభారంభం చేశాడు. రెండో సెట్‌ను సిన్నర్ నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఇక మూడో సెట్‌ను టై బ్రేక్‌లో కెమనోవిక్ గెలుచుకోవడంతో మ్యాచ్ హోరాహోరీగా సాగింది.అయితే నాలుగో సెట్‌లో వెనుకబడ్డ కెమనోవిక్ ఐదో సెట్‌లో తొలి గేమ్ గెలిచినప్పటికీ ఆతర్వాత పుంజుకోలేకపోయాడు. అయితే ఐదు సెట్ల దాకా పోరాడిన కెమనోవిక్ మాత్రం సిన్నర్‌కు ముచ్చెమటలు పట్టించాడు. ఇక రెండో రౌండ్‌లో సిన్నర్ పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్‌తో తలపడనున్నాడు.

**సిన్నర్ దారిలోనే జోకోవిచ్**

ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో నొవాక్ జోకోవిచ్, డానిల్ మెద్వెదెవ్, సిట్సిపాస్ తొలి రౌండ్‌లో నెగ్గి ముందంజ వేశారు. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జోకోవిచ్.. ఈసారి టైటిల్ అందుకుని అత్యధిక వయస్సులో వింబుల్డన్ నెగ్గి ప్లేయర్‌గా రికార్డుపై గురిపెట్టాడు. అయితే తొలి రౌడ్‌లో అతనికి చైనా ప్లేయర్ వు గట్టిపోటీ ఇచ్చాడు. మూడు గంటలకు పైగా సాగిన ఈ పోరులో జోకోవిచ్ 6-4, 5-7, 6-4, 6-4తో చైనా ప్లేయర్‌ను ఓడించాడు.

**రెండో రౌండ్‌లో సబలెంకా**

ఇక మహిళల సింగిల్స్‌లో సీడెడ్ ప్లేయర్ అలవోక విజయాలతో ముందంజ వేశారు. నాలుగు సార్లు గ్రాండ్ స్లామ్ విజేత సబలెంకా 65 నిమిషాల్లో సెర్బియా క్వాలిఫయర్ కొస్టొవిక్‌ను 6-2, 6-3తో ఓడించింది. రెండో రౌండ్‌లో అమెరికన్ మెక్‌కార్ట్‌నీ కెస్లర్‌తో తలపడనుంది. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్ మజా చాలిస్కాకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. ఆమెపై 2-6, 7-5, 6-2తో థాయిలాండ్ అన్‌సీడెడ్ మనంచాయ సంచలన విజయం అందుకుంది.

# జర్మనీ, నెదర్లాండ్స్ పెనాల్టీ షూటౌట్




## ప్రీక్వార్టర్స్‌లో బ్రెజిల్, మొరాకో, పరాగ్వే

**కాలిఫోర్నియా, జూన్ 30:** సాకర్ వరల్డ్‌కప్‌లో సంచలనాల మోత మోగుతోంది. నాకౌట్ మ్యాచ్‌లు చివరి నిమిషాల వరకు ఉత్కంఠ రేపుతున్నాయి. హాట్ ఫేవరెట్లు జర్మనీ, నెదర్లాండ్స్‌లు పెనాల్టీ షూటౌటయ్యాయి. జర్మనీపై పరాగ్వే, నెదర్లాండ్స్‌పై మొరాకో పెనాల్టీ షూటౌట్‌లో గెలుపొంది ప్రి క్వార్టర్ ఫైనల్ చేరాయి. నాకౌట్ మ్యాచ్‌లో జపాన్‌పై బ్రెజిల్ 96వ నిమిషంలో గోల్ సాధించి ముందంజ వేసింది.

**జర్మనీ ఇంటిదారి :** ఫిఫా కప్‌లో మాజీ చాంపియన్ జర్మనీ ఆట ముగిసింది. ఐదోసారి ఫిఫా చాంపియన్‌గా నిలవాలని భావించిన జర్మనీకి పరాగ్వే చెక్ పెట్టింది. పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో పరాగ్వే గెలుపొందింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో నిర్ణీత సమయం ముగిసేలోపు ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. జర్మనీ తరఫున ఆట 54వ నిమిషంలో కాయ్ హావెర్ట్జ్ గోల్ చేయగా, పరాగ్వే తరఫున 42వ నిమిషంలో జులియో ఎన్సియో గోల్ సాధించాడు. అదనపు సమయంలోనూ ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమవడంతో విజేతను తేల్చేందుకు పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. 2018, 2022 ఫిఫా ప్రపంచకప్పుల్లో గ్రూప్ దశలోనే వెనుదిరిగిన జర్మనీ ఈసారి మాత్రం గ్రూప్ దశను దాటినప్పటికీ రౌండ్ ఆఫ్ 16ను దాటడంలో విఫలమయ్యింది.

**నెదర్లాండ్స్‌కు మొరాకో షాక్**

మరో మ్యాచ్‌లో మొరాకో సైతం నెదర్లాండ్స్‌కు అదే తరహాలో షాకిచ్చింది. నిర్ణీత సమయం, అదనపు సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేసి సమంగా నిలువగా.. పెనాల్టీ షూటౌట్‌లో మొరాకో పటిష్టమైన నెదర్లాండ్స్‌ను 3-2తో ఓడించి ప్రీక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.ఈ మ్యాచ్‌లో తొలుత ఆధిక్యం నెదర్లాండ్స్‌కే లభించింది. 72వ నిమిషంలో కోడి గాక్పో గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.ఇంజరీ టైమ్ (91వ నిమిషం)లో ఇస్సా డియోప్ హెడ్డర్‌తో గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు.దీంతో పెనాల్టీ షూటౌట్ నిర్వహించగా.. కీలక సమయంలో మొరాకో గోల్‌కీపర్ యాస్సిన్ బౌనో నెదర్లాండ్స్ ఆటగాడు క్రిసెన్సియో సమ్మర్‌విల్లే పెనాల్టీని అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఇస్మాయిల్ సైబారి తన కిక్‌ను గోల్‌గా మలిచి మొరాకోకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

# ఆసియా క్రీడలకు భారత్ ఉమెన్ టీమ్

**ముంబై, జూన్ 30:** జపాన్ వేదికగా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గనే 15 మంది సభ్యుల భారత మహిళల క్రికెట్ జట్టును బిసిసిఐ ప్రకటించింది. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరిస్తార. స్టార్ ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రిచా ఘోష్, రేణుకా సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఆల్‌రౌండర్ శ్రేయాంక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఎంపికైంది. యస్తికా భాటియా స్థానంలో 17 ఏళ్ల వికెట్ కీపర్ కమిలిని జట్టులోకి ఎంపికైంది. కమిలిని ఇటీవలి కాలంలో చక్కని ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. తాజాగా టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగిన భారత ఉమెన్ జట్టులో ఇదొక్కటే మార్పు. కాగా, ఆసియా క్రీడల్లో భారత్ మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. హాంగ్‌ఝౌ వేదికగా జరిగిన గత క్రీడల్లో టీమిండియా స్వర్ణం గెలుపొందింది.

**భారత్ జట్టు:** హర్మన్‌ప్రీత్(కెప్టెన్), స్మృతి మంధాన,షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), కమలిని, భారతీ ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.



# నేటి నుంచి జాగ్రెబ్ ర్యాపిడ్ చెస్ టోర్నీ

**జాగ్రెబ్(క్రొయేషియా), జూన్ 30:** జాగ్రెబ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద భారీ ఆశలతో బరిలోకి దిగుతున్నారు. నేడు జాగ్రెబ్‌లో ప్రారంభమయ్యే ఈ టోర్నీలో ప్రపంచ అత్యుత్తమ చెస్ ఆటగాళ్లు తలపడనున్నారు. ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను వెనక్కి నెట్టి నార్వే చెస్ టైటిల్ సాధించిన ప్రజ్ఞానంద... ఈ టోర్నీలోనూ హాట్ ఫేవరెట్‌గా ఉన్నాడు. ర్యాపిడ్ విభాగంలో 9 రౌండ్లు, బ్లిట్జ్‌లో 18 రౌండ్లు జరుగుతాయి. ర్యాపిడ్‌లో ప్రతి విజయానికి 2 పాయింట్లు, డ్రాకు ఒక పాయింట్ లభిస్తాయి. అదే బ్లిట్జ్‌లో విజయానికి ఒక పాయింట్, డ్రాకు అర పాయింట్ కేటాయిస్తారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ తిరిగి ఫామ్ చాటాలని చూస్తున్నాడు. విన్సెంట్ కీమర్(జర్మనీ), అనిష్ గిరి(హాలండ్), అలీరేజా ఫిరౌజా(ఫ్రాన్స్) రేటింగ్ పరంగా ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు.




# రెండునెలల్లో ఆర్థిక లోటు 1.62 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ఆర్థికలోటు రూ.1.62 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ వ్యయాలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ విడుదల చేసిన డేటానుచూస్తే 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన మొత్తం ఆర్థికలోటు లక్ష్యంలో ఇప్పటివరకు 9.6 శాతం నమోదైంది. మే నెలాఖరు నాటికి ఫిస్కల్ డెఫిసిట్ రూ.1.62 లక్షల కోట్లుగా ఉంది. ఏప్రిల్ నెలలో నమోదైన రూ.3.62 లక్షల కోట్లతో పోలిస్తే మేలో లోటు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ఏప్రిల్‌లో అది వార్షిక లక్ష్యంలో 21.4 శాతానికి చేరగా మే నాటికి 9.6 శాతానికి తగ్గింది.

ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం ప్రభుత్వ ఆదాయం, వ్యయాల మధ్య అంతరాన్ని మరింత పెంచింది. ఈ పరిస్థితుల్లో విండ్‌ఫాల్ ట్యాక్స్ కింద విధించే స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తూ వస్తోంది.మే నెలలో నికర పన్నుల వసూళ్లు రూ.3.48 లక్షల కోట్లకు చేరాయి. ఇది వార్షిక లక్ష్యంలో 12 శాతం. మరోవైపు మౌలిక వసతుల అభివృద్ధికి చేసే మూలధన వ్యయం రూ.2.51 లక్షల కోట్లకు చేరి వార్షిక లక్ష్యంలో 20.5 శాతం నమోదైంది.ఏప్రిల్‌మే కాలంలో రెవెన్యూ డెఫిసిట్ కూడా గణనీయంగా తగ్గింది. ఏప్రిల్‌లో రూ.1.82 లక్షల కోట్లుగా ఉన్న రెవెన్యూ లోటు మే నాటికి రూ.68,985 కోట్లకు తగ్గింది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు వంటి ఖర్చులు రెవెన్యూ వ్యయంలో భాగంగా ఉంటాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ.8.81 లక్షల కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనా వ్యయంలో 16.5 శాతం. ఇదే సమయంలో ప్రభుత్వ మొత్తం రాబడులు రూ.7.18 లక్షల కోట్లుగా నమోదై పూర్తి సంవత్సర లక్ష్యంలో 19.7 శాతానికి చేరుకున్నాయి. పన్నుల ద్వారా వచ్చే రెవెన్యూ ఆదాయం రూ.6.99 లక్షల కోట్లకు చేరగా పన్నేతర ఆదాయం ఇప్పటికే వార్షిక లక్ష్యంలో సగానికి పైగా చేరడం విశేషం. పన్నేతర ఆదాయం రూ.3.50 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందులో డివిడెండ్లు, ప్రభుత్వ రంగ సంస్థల లాభాల రూపంలో వచ్చిన ఆదాయం రూ.2.89 లక్షల కోట్లుగా ఉంది.

# డాయిచ్ బ్యాంక్ వాటా కొనుగోలు చేసిన కోటక్




**ముంబయి, జూన్ 30:** జర్మనీకి చెందిన ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ డాయిచ్ బ్యాంక్ భారత్‌లోని తన రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు విక్రయించనున్నట్లు ప్రకటించింది. కార్యకలాపాలను సరళీకృతం చేయడం, మూలధనాన్ని మరింతసమర్థవంతంగా వినియోగించుకోవడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాయిచ్ బ్యాంక్ తెలిపింది. డాయిచ్ బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ వ్యాపార విభాగంలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాదాపు 2.7 బిలియన్ యూరోల విలువైన రుణాల పోర్ట్‌ఫోలియో ఉండగా సుమారు లక్షా యాభై వేల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తోంది.ఈ ఒప్పందంతో తమ వ్యాపారాన్ని మరింత సరళీకృతం చేసుకుని ప్రధాన బలాలపై దృష్టి సారించడం ద్వారా లాభదాయకతను పెంచుకోవచ్చని డాయిచ్ బ్యాంక్ బోర్డు సభ్యుడు క్లాడియో డి సాంక్టిస్ తెలిపారు. గత ఏడాదే భారత్‌లోని ఈ రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని విక్రయించేందుకు దేశీయ, విదేశీ బ్యాంకుల నుంచి డాయిచ్ బ్యాంక్ బిడ్లను ఆహ్వానించినట్లు వెల్లడించింది.ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తున్నప్పటికీ అధిక సంపన్నుల సంఖ్య పెరుగుతున్నా స్థానిక బ్యాంకుల నుంచి తీవ్రమైన పోటీ, నియంత్రణ పరమైన నిబంధనల కారణంగా విదేశీ బ్యాంకులు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని పెంచుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

# ఆర్ అండ్ డి కోసం కోల్ ఇండియా 1900 కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జూన్ 30:** ప్రభుత్వ రంగ బొగ్గు దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2030 ఆర్థిక సంవత్సరం నాటికి సుమారు రూ.1,900 కోట్లను ఆర్‌అండ్‌డీ కోసం వెచ్చించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపింది. గనుల తవ్వకాలను ఆధునికీకరించడం, పర్యావరణహిత సాంకేతికతలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా కొత్త టెక్నాలజీలను రూపొందించడం ఈ పెట్టుబడి ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంది.2025 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్ ఏర్పాటు ద్వారా కంపెనీ పరిశోధన కార్యక్రమాలకు కొత్త ఊపు లభించిందని తెలిపింది. ఈ కేంద్రం ద్వారా పరిశోధనలను ప్రాథమిక స్థాయి నుంచి సాంకేతిక నమూనాల అభివృద్ధి దశకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించింది.కంపెనీ భవిష్యత్ వృద్ధి, సాంకేతిక పరివర్తనకు పరిశోధన, అభివృద్ధి కీలకమని కోల్ ఇండియా సీనియర్ అధికారి తెలిపారు.2024 ఆర్థిక సంవత్సరంలో రూ.61 కోట్లుగా ఉన్న ఆర్‌అండ్‌డీ వ్యయం,2025లో నాలుగు రెట్లు పెరిగి రూ.245 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ప్రత్యేక ఆర్‌అండ్‌డీ విధానాన్ని కూడా అమల్లోకి తీసుకొచ్చింది.



పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యంలో భాగంగా ప్రముఖ ఐఐటీల్లో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఎన్‌సిసిఐ పర్యవేక్షణలో రూ.225 కోట్ల వ్యయంతో 19 పరిశోధనప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో మరో 13 పరిశోధన ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయి. అంతర్జాతీయ సాంకేతిక భాగస్వామ్యాలను కూడా కోల్ ఇండియా విస్తరించింది. కెనడాకు చెందిన ఎర్గో ఎక్సెర్జీతో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్, స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్తో జాంగ్రూా భూగర్భ గనిలో 5జీసాంకేతికత అమలు,ఆస్ట్రేలియాకు చెందిన సీఎస్ఐఆర్ఓతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలను చేపడుతోంది.



# రెండోరోజూ నష్టాలకే పరిమితం


## సెన్సెక్స్, నిఫ్టీల్లో ఐటి షేర్ల ఒత్తిడి

**ముంబయి, జూన్ 30:** ఐటిరంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోనే ముగిసాయి. ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 249 పాయింట్లు పడిపోయి 76,478వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 80 పాయింట్లు క్షీణించి 23,865 వద్ద స్థిరపడింది. వరుసగా రెండో రోజు కూడా ప్రధాన సూచీలు నష్టాలను నమోదు చేశాయి.ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు మూడు శాతానికి చేరువలో పతనంకావడం మార్కెట్‌పై తీవ్రప్రభావం చూపింది. ఐసీఐసీఐ బ్యాంక్ షేరు కూడా క్షీణించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.45 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.51 శాతం లాభపడగా మార్కెట్‌లో పెరిగిన షేర్ల సంఖ్య తగ్గిన షేర్ల కంటే ఎక్కువగా నమోదైంది. డాలరుతో రూపాయి మారకం విలువలు 94.65వద్ద నిలిచాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,42,532కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై సెటిల్‌మెంట్‌దరలు పదిసెంట్లుపెరిగి బ్యారెల్‌కు 73.25గా నమోదయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. చైనా తయారీ రంగం మళ్లీ వృద్ధి బాట పట్టడంతో ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణి కనబర్చాయి. అమెరికా ఫ్యూచర్స్ కూడా సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఢిల్లీ ప్రభుత్వం ఈవీ పాలసీకి ఆమోదం తెలపడంతో ఐషర్ మోటార్స్ షేరు 4.38 శాతం పడిపోయింది. ఈ పాలసీతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగం వేగంగా పెరుగుతుందనే అంచనాల నేపథ్యంలో కంపెనీపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మరోవైపు అదానీపోర్ట్స్ దాదాపు 2శాతం లాభపడింది.విజింజం పోర్టులో 49శాతం వాటాను ఎంఎస్‌సీ గ్రూప్‌కొనుగోలు చేయనున్న ఒప్పందం ఇందుకు కారణమైంది.శిల్పా మెడికేర్, గోద్రేజ్ ప్రాపర్టీస్, వారీ ఎనర్జీస్, కల్పతరు ప్రాజెక్ట్స్, కేఈసీ ఇంటర్నేషనల్, జాగ్సన్‌పాల్ ఫార్మాస్యూటికల్స్, గోదావరి బయోరిఫైనరీస్ కంపెనీల షేర్లు కూడా లాభాలతో ముగిశాయి. ఆస్థా స్పిన్‌టెక్స్ ఐపీఓకు మంచి స్పందన లభించింది.చివరి గణాంకాల ప్రకారం ఈ ఇష్యూ 1.48 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈనెల 29న ప్రారంభమైన ఈ ఐపీఓ జూలై 1న ముగియనుంది.మొత్తంగా ఐటీ రంగంలో అమ్మకాల ఒత్తిడి కారణంగా ప్రధానసూచీలు నష్టాల్లోముగిసినా మిడ్,స్మాల్‌క్యాప్ కొనుగోళ్లు కొనసాగడం పెట్టుబడిదారుల్లో ఆసక్తిని సూచించింది.

### పెట్రోకెమికల్ దిగుమతులపై కస్టమ్స్ మినహాయింపు

# జూలై 15 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ, జూన్ 30:** పెట్రోకెమికల్ ముడి పదార్థాల దిగుమతులకు సంబంధించిన కస్టమ్స్ డ్యూటీ మినహాయింపును కేంద్ర ప్రభుత్వం జూలై 15 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ మినహాయింపును తొలుత ఏప్రిల్ 2న తాత్కాలిక చర్యగా అమల్లోకి తీసుకువచ్చారు.జూన్ 30తో ఈ గడువు ముగుస్తుండగా ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరో 15 రోజుల పాటు పొడిగించారు. ఈ నిర్ణయంతో ప్యాకేజింగ్, ప్లాస్టిక్స్, వస్త్ర పరిశ్రమ, ఔషధ తయారీ, రసాయన పరిశ్రమ, ఆటోమొబైల్ విడిభాగాల తయారీతో పాటు పలు తయారీ రంగాలకు ఊరట లభించనుంది. పెట్రోకెమికల్ ముడి పదార్థాల సరఫరా అంతరాయం లేకుండా కొనసాగడంతో పాటు ఉత్పత్తి వ్యయాలపై ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉంది.మినహాయింపు పొందిన ఉత్పత్తుల్లో మెథనాల్, అన్హైడ్రస్ అమోనియా, టోల్యూయిన్, స్టైరిన్, డైక్లోరోమీథేన్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, పాలీబ్యూటాడైన్, స్టైరిన్‌బ్యూటాడైన్, అన్‌సాచ్యురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్ వంటి కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులు ఉన్నాయి.దేశీయ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలు నిరంతరంగా అందుబాటులో ఉండేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.